ఆంధ్రప్రదేశ్ శాసన పరిషత్ కార్యకలాపాలు

**ANDHRA PRADESH**

**LEGISLATIVE COUNCIL DEBATES**

అధికార నివేదిక

# OFFICIAL REPORT

సోమవారం, మార్చి 16, 2015,

ఇరవై మూడవ సమావేశం, సంపుటం-2, నంబరు-6,

**MONDAY, THE 16th DAY OF MARCH, 2015,**

**TWENTY THIRD SESSION, VOLUME - 2, NO.6,**

*****

శాసన పరిషత్తు సచివాలయము,

పబ్లిక్ గార్డెన్స్,

హైదరాబాద్ – 500 004.

**LEGISLATURE SECRETARIAT,**

**PUBLIC GARDENS,**

**HYDERABAD - 500 004.**

# ఆంధ్రప్రదేశ్ శాసన పరిషత్తు

## ప్రధాన అధికారులు

| | | |
|---|---|---|
| **ఛైర్మన్** | : | డా. ఎ. చక్రపాణి |
| **కార్యదర్శి (ఇన్‌ఛార్జ్)** | : | శ్రీ కె. సత్యనారాయణరావు |
| **ఉప కార్యదర్శులు** | : | శ్రీ పి. బాలకృష్ణమాచార్యులు<br>శ్రీ ఎమ్. విజయరాజు |
| **సహాయ కార్యదర్శులు** | : | శ్రీ పి.వి. సుబ్బారెడ్డి<br>శ్రీ కె. రాజ్‌కుమార్<br>శ్రీమతి ఆర్. వనితారాణి<br>శ్రీ పి. నరసింహ<br>శ్రీ బి. కమలాకర్<br>డా. వై. కామేశ్వరి<br>శ్రీ ఇ. సంజీవరావు<br>శ్రీ కె. వెంకటేశ్వరరావు<br>శ్రీ డి. జగన్‌మోహన్‌రావు<br>శ్రీ బి. ప్రభాకర్‌రావు |
| **చీఫ్ రిపోర్టర్** | : | శ్రీ ఆర్. శ్రీనివాసరావు |

* * * * *

# ఆంధ్రప్రదేశ్ శాసన పరిషత్తు కార్యకలాపములు

## సోమవారం, మార్చి 16, 2015.

## అధికార నివేదిక

---

విషయ సూచిక

---

(1) ప్రశ్నోత్తరాలు

(2) ప్రత్యేక ప్రస్తావన

(3) సభా సమక్షంలో ఉంచే పత్రాలు

(4) 2015–16 సంవత్సరపు వార్షిక బడ్జెటుపై సాధారణ చర్చ

---

**ANDHRA PRADESH LEGISLATIVE COUNCIL**
**MONDAY, THE 16th DAY OF MARCH, 2015.**

(THE HOUSE ASSEMBLED AT 10.00 A.M.)
(HON'BLE CHAIRMAN IN THE CHAIR)
* * *

(I) **ప్రశ్నోత్తరాలు ః**

MR. CHAIRMAN: Now, Question Hour.

**పశ్చిమగోదావరి జిల్లాలోని రోడ్లు**

ప్రశ్న నెం. 7825 (51)

శ్రీ రుద్రరాజు పద్మరాజు, ఎం.ఎల్.సి.,

గౌరవనీయులైన రవాణా, రోడ్లు & భవనాల శాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా?

అ) పశ్చిమ గోదావరి జిల్లాలో తాళ్లపూడి మార్గాన కొవ్వూరు నుండి పోలవరం మరియు దొండపాడు, రేపల్లెవాడ మార్గాన కన్నాపురం జంక్షన్ నుండి కొయ్యలగూడానికి వెళ్లే రహదారులు అధ్వాన్న స్థితిలో ఉన్న విషయం ప్రభుత్వం దృష్టికి వచ్చిందా;
ఆ) ఏజెన్సీ ప్రాంత ప్రజల సౌకర్యం కోసం మరియు రానున్న పుష్కరాలను దృష్టిలో ఉంచుకొని సదరు రహదారుల పునర్ నిర్మాణం మరియు సక్రమ నిర్వహణ కోసం ప్రభుత్వం తీసుకోనున్న చర్య వివరాలు తెలపండి?

గౌరవనీయులైన రవాణా, రోడ్లు మరియు భవనాల శాఖ మంత్రి (శ్రీ శిద్దా రాఘవరావు):

అ) అవునండీ.
ఆ) రోడ్ల రెండింటిని మెరుగుపరచి/పటిష్టపరచడానికి పరిపాలక అనుమతిని ఇవ్వడమయింది. 2015, గోదావరి పుష్కరాలు ప్రారంభమయ్యే లోపు పనులను పూర్తి చేయడమవుతుంది. లోప సంబంధ జవాబుదారీ కాలపరిమిత కాలంలో ఆయా సంస్థలే ఈ రోడ్లను నిర్వహిస్తాయి.

SRI RUDRARAJU PADMA RAJU : (శాసనసభ నియోజక వర్గం) Sir, I express my sincere thanks to the Hon'ble Minister for according administrative sanction for the above said roads. కొవ్వూరు నుంచి తాళ్లపూడి మీదుగా పోలవరం వెళ్లే రహదారి చాలా ఇరుకైన రహదారి. ఈ మార్గమధ్యంలో పట్టిసీమ అనే పుణ్యక్షేత్రం కూడా ఉంది. పట్టిసీమ నుంచి కూడా లిఫ్ట్ ఇరిగేషన్ చేయాలనే ఆలోచన గురించి రాష్ట్ర ముఖ్యమంత్రిగారు కూడా మొన్ననే బడ్జెట్ విషయానికి సంబంధించి మాట్లాడుతున్నప్పుడు సభలో కూడా చెప్పారు. అదే ప్రాంతం నుంచి కొవ్వూరు నుంచి రాజమండ్రి వరకూ నూతన వంతెన నిర్మాణం కూడా ఉంది కాబట్టి ఆ రహదారిలో ఇసుకలారీలు చాలా ఎక్కువగా తిరగడం, అనేక సంవత్సరాలనుంచి ఆ రహదారి సరిగా మరమ్మత్తులు చేయకపోవడం వల్ల ఆ ప్రాంతవాసులు చాలా ఇక్కట్లను ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా, గిరిజన ప్రజలందరూ ఆ ప్రాంతం నుంచి కొవ్వూరు రావాలన్నా, రాజమండ్రి రావాలన్నా చాలా ఇబ్బందులను ఎదుర్కొంటున్న పరిస్థితులలో ఈ రహదారుల నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవడం ఎంతైనా అభినందనీయం.

కన్నాపురం నుంచి కొయ్యలగూడెం వెళ్లే రహదారి రెండు రాష్ట్రాలకు అతి చేరువలో ఉన్న రహదారి. ఈ రెండు ప్రాంతాల మధ్య సుమారు 60 నుంచి 75 కిలోమీటర్ల విస్తీర్ణం ఉంది. ఆ రహదారి చాలా దయనీయమైన పరిస్థితిలో ఉంది. చాలాకాలం నుంచి ఆ రహదారి మరమ్మత్తులు చేయకపోవడం వల్ల ఆ ప్రాంతంలో నివసించే గిరిజనవాసులకు చాలా ఇబ్బందులున్నాయి. ఆ ప్రక్కనే ఉన్న అటవీ ప్రాంతం నుంచి కొంతమంది దొంగ కలపను రవాణాచేయడం, కాపుసారా కాయడం జరుగుతోంది. నిఘావర్గాలైన పోలీసులకు సమయానికి అక్కడకు వెళ్లడం చాలా ఇబ్బందిగా ఉంది కాబట్టి ఈ రెండు రహదారులకు సంబంధించిన పనులు పుష్కరాలలోపు పూర్తిచేస్తామని రాష్ట్రమంత్రిగారు చెప్పడం ఎంతైనా అభినందనీయం. ఈ సందర్భంగా తమరిద్వారా వారికి నా అభినందనలు తెలియజేస్తున్నాను.

శ్రీ శిద్ధా రాఘవరావు: అధ్యక్షా, గౌరవసభ్యులు అడిగిన కొవ్వూరు నుంచి తాళ్లపూడి మీదుగా పోలవరం వెళ్లే రహదారి పనులకోసం టెండర్లను కూడా పిలవడం జరిగింది. రూ. 6.60 కోట్లతో ఆ పనులు ప్రస్తుతం జరుగుతున్నాయి. పశ్చిమగోదావరి జిల్లా కన్నాపురం జంక్షన్ నుంచి వయా దొండపాడు, రేపల్లెవాడ, పోలవరం నుంచి కొయ్యలగూడెం వెళ్లే రహదారి పనులు కూడా జరుగుతున్నాయి. ఆ పనులను తేది. 29.05.2015 లోపు పూర్తిచేయవలసి ఉంది కాబట్టి ఎటువంటి పరిస్థితుల్లో గోదావరి పుష్కరాలలోపు ఈ పనులను మేము పూర్తిచేస్తాము. మా ముఖ్యమంత్రిగారు కూడా రహదారులపై బాగా శ్రద్ధ వహిస్తున్నారు. ఎందుకంటే, గత 10 సంవత్సరాలుగా రహదారుల గురించి సరైన శ్రద్ధ తీసుకోకపోవడం వల్ల ఈనాడు రాష్ట్రంలో ప్రజానీకం చాలా ఇబ్బందిపడుతున్నారు. గోదావరి పుష్కరాలలోపు అన్ని విధాలుగా ఈ రహదారుల పనులు పూర్తిచేస్తాము. గోదావరి పుష్కరాల సందర్భంగా పశ్చిమగోదావరి మరియు తూర్పుగోదావరి జిల్లాల్లో రూ. 575 కోట్ల పనులను చేపట్టడం జరిగింది. ఈ పనులన్నీ కూడా తేది. 15.05.2015 లోగా పూర్తిచేయడానికి మేము ప్రణాళిక వేసుకోవడం జరిగింది. ఎట్టి పరిస్థితుల్లోనూ ఉభయగోదావరి జిల్లాల్లో ఎటువంటి ఇబ్బందులు లేకుండా ముందుకు వెళ్లడానికి మేము ప్రయత్నం చేస్తామని తమరిద్వారా గౌరవసభ్యులకు తెలియజేస్తున్నాను.

## రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాలు

ప్రశ్న నెం. 8012 (52)

సర్వశ్రీ మేకా శేషుబాబు, బి.చెంగల్ రాయుడు, శ్రీమతి నన్నపనేని రాజకుమారి,ఎం.ఎల్.సి.లు

గౌరవనీయులైన రవాణా శాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా?

అ) రాష్ట్రంలో ఇటీవల కాలంలో ప్రమాదాలు పెరిగిన విషయం ప్రభుత్వం దృష్టికి వచ్చిందా;
ఆ) అయితే, రోడ్డు ప్రమాదాలను నియంత్రించడానికి ప్రభుత్వం తీసుకున్న చర్యలు ఏమిటి;
ఇ) గత ఒక సంవత్సర కాలంగా సంభవించిన రోడ్డు ప్రమాదాల జిల్లా వారీ వివరాలేమిటి?

గౌరవనీయులైన రవాణా, రోడ్లు మరియు భవనాల శాఖ మంత్రి (శ్రీ సిద్ధా రాఘవరావు):

అ) అవునండీ, మునుపటి సంవత్సరం కంటే గత సంవత్సరంలో ప్రమాదాల సంఖ్య స్వల్పంగా తగ్గినప్పటికీ, గత మూడు సంవత్సరాలలో మరణించిన వారి సంఖ్య మరియు గాయపడిన వారి సంఖ్యలో నామమాత్రపు వార్షిక పెరుగుదల ఉంది.

ఆ) 1. రవాణా శాఖ 40,165 మంది విద్యార్థులు, 28,329 మంది వాహన డ్రైవర్లు మరియు 8,861 మంది పాఠశాల బస్సు డ్రైవర్లతో కలుపుకొని 1,76,667 మంది వ్యక్తులకు ప్రమేయం కల్పిస్తూ

రాష్ట్రంలో 22-07-2014 నుండి రోడ్డు భద్రత శిక్షణ మరియు అవగాహన కార్యక్రమాలను ప్రారంభించి, 243 పట్టణాలు/ గ్రామాలకు వర్తింపు చేయడమయింది.

2. త్రాగి డ్రైవ్ చేయడం మరియు అతివేగం వంటి వాటిని అదుపు చేయడానికి ప్రతి జిల్లాలో ఇద్దరు ఇన్‌స్పెక్టర్లను ప్రత్యేకంగా కేటాయించడమయింది. నిఘా అమలు విభాగం గుర్తించిన 10 రోడ్డు భద్రత నేరాల అదుపుపై దృష్టి సారించడమయింది.

3. 03-03-2015 తేదీనుండి పోలీసు మరియు రవాణా శాఖలు ఉమ్మడిగా ఒక రాష్ట్ర వ్యాప్త ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించడమవుతున్నది. ఈ అమలు ప్రయోజనం కోసం రాష్ట్రమంతటా 130 ఉమ్మడి బృందాలను ఏర్పాటు చేయడమయింది. ఈ బృందాలు 10-03-2015 తేదీనాటికి 18,000 కేసులను నమోదు చేశాయి.

4. పాఠశాల యాజమాన్యాలకు బాధ్యతను నిర్ణయిస్తూ (ఎ.పి.ఎం.వి. నియమావళిలోని 185 వ నియమం) విద్యాసంస్థల బస్సుల నిర్వహణ కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇదివరకే ప్రత్యేక నియమావళిని రూపొందించింది. వేసవి సెలవులలో మరమ్మత్తులను చేపట్టడానికి యాజమాన్యాలకు సౌలభ్యాన్ని కల్పించేందుకు విద్యా సంవత్సరానికి తత్సమానంగా ఇ.ఐ.బి. ల అర్హత ధ్రువీకరణను రూపొందించడమయింది. బస్సులను నడుపుకోవడానికి ఇచ్చిన అనుమతి కాకుండా వారు ఏదేని ప్రయోజనం కోసం ఇ.ఐ.బి. లను వినియోగించకుండా కట్టుదిట్టం చేయాలని జిల్లా కలెక్టర్లందరినీ కోరడమయింది.

5. పోలీసు శాఖ గుర్తించిన విధంగా ఎక్కువ ప్రమాదాలు జరిగే ప్రాంతాలలోని రోడ్లను మెరుగుపర్చాలని రోడ్లు & భవనాల శాఖను ఆదేశించడమయింది.

6. కేంద్ర ప్రభుత్వ ప్రతిపాదిత పథకాల నుండి రూ. 15.00 కోట్ల నిధులతో గన్నవరం సమీపాన మోటార్ వాహనాల ఆటోమేటెడ్ ఫిట్‌నెస్ టెస్టింగ్ కోసం ఒక ఆదర్శ తనిఖీ & ధ్రువీకరణ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలను పంపడమయింది.

7. కేంద్రప్రభుత్వ ప్రతిపాదిత పథకం నుండి రూ. 21.55 కోట్ల పెట్టుబడితో దర్శి సమీపాన డ్రైవర్ శిక్షణా నైపుణ్యాలను మెరుగుపరచుకోవడానికి ప్రతిపాదించిన ఒక ఆదర్శ డ్రైవింగ్ శిక్షణా సంస్థను ఏర్పాటు చేయాలని కేంద్రప్రభుత్వానికి ప్రతిపాదనలను పంపడమయింది.

8. రాష్ట్రంలో రోడ్డు భద్రత స్థితిని అధ్యయనం చేయడానికి మరియు రాష్ట్రంలోని రోడ్డు భద్రతను మెరుగుపరచడానికి నిర్ణయించదగు ఫలితాల కోసం చర్య తీసుకోదగిన అంశాలను సూచించడానికి ఇంజనీరింగు, అమలు మరియు ట్రామాకేర్ విభాగాల నుండి ముగ్గురు (3) సభ్యులతో ఒక నిపుణుల కమిటీని ఏర్పాటు చేయడమయింది.

ఇ) ఎస్.సి.ఆర్.బి. నుండి పొందిన విధంగా గత సంవత్సరంలో సంభవించిన రోడ్డు ప్రమాదాల జిల్లా వారీ వివరాలను తెలిపే పట్టికను సభా సమక్షంలో ఉంచడమయింది.

ఆంధ్రప్రదేశ్ లో ప్రమాదాలు ను తెలిపే పట్టిక. *

| వరుస సంఖ్య | జిల్లాలు | 2012 ప్రమాదాలు | 2012 మరణాలు | 2012 గాయపడినవారు | 2013 ప్రమాదాలు | 2013 మరణాలు | 2013 గాయపడినవారు | 2014 ప్రమాదాలు | 2014 మరణాలు | 2014 గాయపడినవారు |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | శ్రీకాకుళం | 987 | 296 | 1634 | 1188 | 364 | 1601 | 1121 | 298 | 1628 |
| 2 | విజయనగరం | 1109 | 313 | 1513 | 1209 | 311 | 1651 | 1157 | 297 | 1724 |
| 3ఎ | విశాఖపట్నం (రూరల్) | 800 | 337 | 1159 | 818 | 320 | 1020 | 819 | 331 | 996 |
| 03బి | విశాఖపట్నం (నగరం) | 1439 | 384 | 1063 | 1550 | 398 | 1302 | 1377 | 360 | 1335 |
| 04ఎ | తూర్పు గోదావరి | 1786 | 636 | 2253 | 1755 | 535 | 2074 | 1828 | 685 | 2119 |
| 04బి | రాజమండ్రి | 551 | 177 | 452 | 512 | 143 | 507 | 501 | 124 | 503 |
| 5 | పశ్చిమ గోదావరి | 1669 | 639 | 1883 | 1755 | 607 | 1955 | 1773 | 641 | 2033 |
| 06ఎ | కృష్ణ | 1442 | 443 | 2119 | 1488 | 431 | 2068 | 1445 | 441 | 2037 |
| 06బి | విజయవాడ నగరం | 1600 | 376 | 1446 | 1519 | 328 | 1503 | 1648 | 334 | 1607 |
| 07ఎ | గుంటూరు(రూరల్) | 1282 | 518 | 1406 | 1220 | 467 | 1297 | 1294 | 526 | 1492 |
| 07బి | గుంటూరు(అర్బన్) | 807 | 244 | 775 | 847 | 242 | 813 | 911 | 233 | 1079 |
| 8ఎ | చిత్తూరు | 1406 | 600 | 1857 | 1537 | 591 | 2073 | 1444 | 586 | 2071 |
| 8బి | తిరుపతి (అర్బన్) | 692 | 215 | 955 | 580 | 223 | 671 | 608 | 248 | 811 |
| 9 | ప్రకాశం | 1413 | 526 | 1480 | 1537 | 524 | 1528 | 1364 | 548 | 1532 |
| 10 | నెల్లూరు | 1660 | 528 | 1827 | 1798 | 502 | 2180 | 1429 | 480 | 1738 |
| 11 | కడప | 1423 | 534 | 1985 | 1328 | 441 | 1764 | 1419 | 456 | 1975 |
| 12 | అనంతపురం | 1457 | 650 | 2272 | 1636 | 622 | 2636 | 1672 | 714 | 2581 |
| 13 | కర్నూలు | 1530 | 580 | 2273 | 1663 | 497 | 2250 | 1702 | 560 | 2530 |
| | **మొత్తం** | **23053** | **7996** | **28352** | **23940** | **7546** | **28893** | **23512** | **7862** | **29791** |

* As obtained from Road Safety Cell of, O/o DGP for 2012 ,2013 and from SCRB for 2014

డి. శాంబాబ్
ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి

శ్రీ మేకా శేషుబాబు : (స్థానిక సంస్థల నియోజక వర్గం – పశ్చిమగోదావరి) అధ్యక్షా, ఈ రాష్ట్రంలో వాహనాల సంఖ్య పెరుగుదల, జనాభా పెరుగుదల విషయంలోగానీ నేడు చూసినట్లయితే ప్రజలు అనేకరకాల ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. మంత్రిగారు సమాధానం చెప్పినప్పటికీ, వాహనాలు సంఖ్యాపరంగా పెరిగినప్పటికీ, వాటికనుగుణంగా రహదారులను వెడల్పు చేసే కార్యక్రమాలు చేయకపోవడం వల్ల, మండల కేంద్రాలు మరియు నగరాలలో అనేకచోట్ల ట్రాఫిక్ అంతరాయం కలిగి ప్రజలు అనేక రకాల ఇబ్బందులను ఎదుర్కొంటున్న సంగతి మనందరికీ తెలుసు. నేడు 20 కిలోమీటర్ల దూరం ప్రయాణం చేయాలంటే చాలా ఇబ్బందికరమైన పరిస్థితులను ప్రతిచోటా మనం చూస్తున్నాము. రహదారులను చాలాకాలం క్రితం వెడల్పు చేయడం జరిగింది. దీనిపై ప్రత్యేక శ్రద్ధ వహించి వెంటనే రహదారులను వెడల్పు చేసే కార్యక్రమం చేపట్టాలని నేను తమరిద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

పాఠశాల బస్సులు, ప్రయివేటు వాహనాలు సరైనటువంటి తర్ఫీదు లేని డ్రయివర్ల వల్ల, కండిషన్ లేని వాహనాల వల్ల అనేక ప్రమాదాలు మనరాష్ట్రంలో చోటుచేసుకుంటున్నాయి. అటువంటి వాటిపై

ప్రత్యేకదృష్టిని సారించి తగిన చర్యలు తీసుకోవాలని నేను తమరిద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను. 'Y' జంక్షన్‌వద్ద మరియు హైవేలపై సరైన ఇండికేటర్స్, సరైన డివైడర్స్ లేకపోవడం వల్ల అనేక రకాలైన ప్రమాదాలు జరిగి ప్రజలు మృత్యువాత పడుతున్న సంగతి మనందరికీ కూడా తెలుసు. ప్రజలు తమ విలువైన ప్రాణాలు కోల్పోవడమే కాకుండా చాలామంది కాళ్లు లేదా చేతులను పోగొట్టుకొని అంగవైకల్యం పొందుతున్న పరిస్థితి గురించి మనందరికీ కూడా తెలుసు.

ఉ. 10.10

అధ్యక్షా, దాదాపు 29791 మంది గాయపడ్డారని మంత్రి గారి సమాధానంలో తెలియజేయడం జరిగింది. ఈ ప్రమాదాల నివారణకు చిత్తశుద్ధితో వెనువెంటనే చర్యలు తీసుకునే విధంగా ప్రతి జిల్లాలోను జిల్లాల వారీగా సమీక్షా సమావేశాలను నిర్వహించి ట్రాఫిక్ నిబంధనల విషయంలో కాని, ప్రమాదాల నివారణ విషయంలో కాని ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ప్రయాణాలను సులభతర చేసే విధంగా చర్యలు తీసుకోవాలని మీ ద్వారా మంత్రి గారిని కోరుతున్నాను.

ప్రతి మండల కేంద్రంలో, పట్టణాలలో ఫ్లెక్సీలను విచ్చలవిడిగా పెట్టడంతో రహదారులు సరిగా కనపడకపోవడం వల్ల ఆ రోడ్లపై ప్రయాణించే వారు అనేక రకాలైన ఇబ్బందులు పడుతున్న పరిస్థితి ఉంది. అంతేకాకుండా, ఈ రోజు మున్సిపాల్టీలలో కాని, మండల కేంద్రాలలో కాని భారీ ఫ్లెక్సీల నిర్మాణం వల్ల అటువైపుగా వచ్చే వాహనాలకు రోడ్డు కనపడనటువంటి పరిస్థితి వల్ల ఇటువంటి అంతరాయం కలుగుతుందనే విషయాన్ని మీ ద్వారా ప్రభుత్వ దృష్టికి తీసుకువస్తున్నాను. వీటి మీద తగిన చర్యలు తీసుకోవలసిందిగా మీ ద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

శ్రీమతి నన్నపనేని రాజకుమారి : (శాసనసభ నియోజక వర్గం) అధ్యక్షా, గుంటూరు నుండి తెనాలి వెళ్ళే రోడ్డును వెడల్పు చేసే విషయం గురించి గత సమావేశంలోనే అడగడం జరిగింది. అక్కడ కాలువ ప్రక్కన ఉన్న రోడ్డు క్రుంగిపోవడం వల్ల అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి. గత సమావేశం తరువాత కూడా మూడు మోటారు సైకిళ్లు, ఒక ఎడ్ల బండి, రెండు కార్లు కాలువలో మునిగిపోవడం జరిగింది. ఒక కారులో ప్రయాణిస్తున్న వారు బయటకు వచ్చారు కాని, మరొక కారులో ప్రయాణిస్తున్న వారిలో ఇద్దరు, ముగ్గురు చనిపోవడం జరిగింది. ఆ రోడ్డు వెడల్పు గురించి ఏమి చర్యలు తీసుకున్నారని మీ ద్వారా మంత్రి గారిని అడుగుతున్నాను.

రెండవది, స్కూలు బస్సులే కాకుండా ఆర్టీసీ బస్సులు కూడా లోయలలో పడి పోవడం వంటి వాటి వల్ల అధిక ప్రమాదాలకు గురవుతున్నాయి. ఆర్టీసీ డ్రైవర్లు ఎక్కువ దూరం అంటే దాదాపు 300 - 400 కిలోమీటర్లు నడిపిన తరువాత మారుతున్నట్లున్నారు. అలా కాకుండా, డ్రైవర్ల సంఖ్యను పెంచి రాత్రి పూట వంద నుండి నూట యాభై కిలోమీటర్లకు మించి నడపకుండా ఏర్పాట్లు చేస్తే బాగుంటుంది. ఎక్కువ దూరం నడపడం వల్ల అలసిపోయి నిద్ర రావడంతో ఎక్కువ యాక్సిడెంట్లు జరుగుతున్నాయి. తరువాత, త్రాగి డ్రైవ్ చేస్తున్నప్పుడు కూడా ప్రమాదాలు జరుగుతున్నాయి. త్రాగి డ్రైవ్ చేసే వారిని తాత్కాలికంగా డ్యూటీ నుండి తొలగించినా, శిక్షించినా, యూనియన్లు వచ్చి గొడవ చేస్తారనే ఉద్దేశంతో మరల వారినే తీసుకోవడం జరుగుతుంది. అటువంటి వారిని డ్యూటీలోకి తీసుకోకుండా, త్రాగి డ్రైవ్ చేయకుండా చాలా కఠినంగా వ్యవహరించాల్సిన అవసరముంది.

మరొక అంశం, జాతీయ రహదార్లు బాగుండటం వల్ల చాలా స్పీడ్‌గా వాహనాలు వెళ్లడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. అలాగే, రోడ్లు బాగుండక గుంతలు పడి వాహనాల టైర్లు ఆ గుంతలలో పడడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ రెండింటి వల్ల కూడా ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయి. అవుటర్ రింగ్ రోడ్డులో కాని, జాతీయ రహదారి మీద కాని రాజకీయ నాయకులు కాని,

ప్రముఖులు కాని రోడ్డు ప్రమాదాలకు గురైతే వారి గురించి ప్రభుత్వం పరుస్యూ చేయడం జరుగుతుంది. కాని, సామాన్యులు, అతి సామాన్యులు ప్రమాదాలకు గురైతే మనమెవరమూ పట్టించుకోం. మనకు తెలియకుండా చాలా ప్రమాదాలు జరుగుతున్నాయి కాబట్టి ఎక్కడికక్కడ స్పీడ్ కంట్రోల్లో ఉండే విధంగా తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరముంది. అమెరికాలో అయితే పాదచారులు రోడ్డు దాటుతున్నప్పుడు వాహనదార్లు కారును ఆపి పాదచారులు రోడ్డు దాటిన తరువాత కాని వెళ్లరు. మనదగ్గర అటువంటి సంస్కృతి లేదు. జాతీయ రహదార్ల మీద కాని, అవుటర్ రింగ్ రోడ్డు మీద కాని స్పీడ్‌ను కంట్రోల్ చేయడానికి వాహనదారులపై నిఘా ఉంచాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

రోడ్ల మీద ఉన్న గుంతలను పూడ్చడానికి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నాను. గతంలో పని చేసిన రోడ్లు మరియు భవనాల శాఖ మంత్రులు వారి, వారి జిల్లాలకే పరిమితమై సమీక్షలు నిర్వహించేవారు. ఇప్పుడు ఈ మంత్రి గారు అలా కాకుండా, రాష్ట్ర వ్యాప్తంగా తిరిగి ఆఫీసర్లతో మీటింగులు పెట్టి ప్రమాదాల నివారణకు తగిన శ్రద్ధ చూపిస్తున్నారు కాబట్టి వెంటనే నిధులను మంజూరు చేసి రోడ్లపై ఉన్న గుంతలను త్వరిత గతిన పూడిస్తే ప్రమాదాలను నివారించవచ్చని మీ ద్వారా మంత్రి గారి దృష్టికి తీసుకువస్తున్నాను.

శ్రీమతి పి. శమంతకమణి : (శాసనసభ నియోజక వర్గం) అధ్యక్షా, బెంగుళూరు నుండి హైదరాబాదుకు నాలుగు లైన్ల జాతీయ రహదారి నిర్మాణం చాలా చక్కగా ఉంది. కాని, 'U ' టర్న్ చేయడానికి మధ్య, మధ్యలో అక్కడక్కడ స్థలం వదులుతున్నారు. ఆ వదలిన స్థలంలో నిలిపిన వాహనాల నుండి రాత్రి పూట వచ్చే వాహనాలకు ఎలాంటి రెడ్ లైట్ సిగ్నల్స్ ఉండడం లేదు. అందువల్ల 'U ' టర్న్ చేసే వాహనం దగ్గరకు వచ్చే వరకు ఆ వాహనం 'U ' టర్న్ చేస్తుందని అటుగా వెళ్లే వాహనదారులకు తెలియడం లేదు. కాబట్టి అటువంటి ప్రదేశాలలో ఏవైనా సిగ్నల్స్‌ను పెట్టి అటుప్రక్క 'U ' టర్న్ చేయడానికి వాహనాలు వస్తున్నాయని తెలియజేసే విధంగా సిగ్నల్స్ పెట్టాలని కోరుతున్నాను.

రెండవది, జాతీయ రహదార్ల మీద భారీ వాహనాలైన లారీలు, టిప్పర్లు నిలపడానికి అక్కడక్కడ మధ్య, మధ్యలో స్థలం వదులుతున్నా అక్కడ ఆ భారీ వాహనాలను నిలపడం లేదు. ఆ భారీ వాహనాలు రోడ్డు మీదనే నిలబడి, వెనుక రెడ్ లైట్ లేకుండా ఉండడం వల్ల వెనుక నుండి స్పీడ్‌గా వస్తున్న వాహనాలకు అక్కడ నిలబడి ఉన్న వాహనం గురించి ఏమీ తెలియకపోవడంతో స్పీడ్‌గా వచ్చే వాహనాలు నిలబడ్డ వాహనానికి గుద్దుకొని ప్రమాదాలకు గురవుతున్నాయి. అందువల్ల , రాత్రిపూట పెట్రోలింగ్ చేసే పోలీసులు రెడ్‌లైట్ సిగ్నల్స్ లేని వాహనాల మీద చర్యలు తీసుకోవాల్సిందిగా కోరుతున్నాను.

శ్రీ బి. చెంగల్ రాయుడు : (శాసనసభ నియోజక వర్గం) అధ్యక్షా, మంత్రి గారు అన్ని విషయాలు చెప్పారు కాని, అసలు విషయం చెప్పలేదు. ఈ మూడు పార్టీల సంఘం ఎక్కడ కలిసిందని మీకు పెద్ద అనుమానం వచ్చి ఉంటుంది. శేషు బాబు గారు వైయస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ, రాజకుమారి గారు తెలుగుదేశం, నేను కాంగ్రెస్ పార్టీ. ముగ్గురం మూడు రకాలుగా ప్రశ్నలు అడిగితే అన్ని క్లబ్ చేసి ముగ్గురికి ఒకే రకమైన సమాధానం చెప్పినటువంటి పరిస్థితి ఉంది కాబట్టి దీని మీద ఎంత consent ఉందో, దీనికి ఎంత ప్రాముఖ్యత ఉందో మీరు గుర్తు పెట్టుకోవాలి.

మిస్టర్ ఛైర్మన్ : ఇవన్నీ సప్లమెంటరీలా?

శ్రీ బి. చెంగల్ రాయుడు : అధ్యక్షా, మంత్రి గారు కౌన్సిల్ నుండి వెళ్లారు కాబట్టి ఈ హౌస్ మీద మంత్రి గారికి అభిమానం ఉందని భావిస్తున్నాను.

జంక్షన్ల అభివృద్ధికి ప్రభుత్వం ఏమైనా నిధులు కేటాయించిందా అని అడుగుతున్నాను. ఎందుకంటే.. రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జంక్షన్ల వద్దనే జరుగుతున్నాయి. జంక్షన్ల వద్ద అటు నుండి

బయటకు రావడం, ఇటువైపు నుండి వెళ్లడం వంటి చోట్ల ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి కాబట్టి జంక్షన్లను వెడల్పు చేసి, అభివృద్ధి చేయాల్సిన అవసరముంది. దీని కోసం బడ్జెట్‌లో కేటాయింపులు చూస్తే నామమాత్రంగానే ఉన్నాయి. గత సంవత్సరం కేటాయింపులు చూసినా, ఈ సంవత్సరం కేటాయింపులు చూసినా అంతంత మాత్రంగానే ఉన్నాయి. దీని కోసం ప్రభుత్వం దగ్గర డబ్బు లేనట్లుగా కనపడుతుంది.

రెండవది, అప్రోచ్ రోడ్లు. ఆర్ అండ్ బి రోడ్ల నుండి గ్రామీణ రోడ్లపైకి వెళ్లడానికి తమిళనాడులో అయితే దాదాపు 100 మీటర్ల వరకు అప్రోచ్ రోడ్లు వేస్తున్నారు. మన రాష్ట్రంలో కనీసం 10 మీటర్లు కూడా వేయడం లేదు. గ్రామీణ రోడ్లను లింక్ చేసుకుంటూ, ఆ రెండు రోడ్లు కలిసే చోట ఒక చిన్న స్పీడ్ బ్రేకర్‌ను ఏర్పాటు చేయాలి.

మూడవది, పెట్రోల్ బంకుల నుండి వాహనాలు బయటకు వచ్చేటప్పుడు స్పీడ్‌గా వస్తున్నాయి. పెట్రోల్ బంకు నుండి మెయిన్ రోడ్డుపైకి వచ్చేదగ్గర ఒక చిన్న స్పీడ్ బ్రేకర్‌ను ఏర్పాటు చేస్తే అక్కడ జరిగే కొన్ని ప్రమాదాలనైనా నివారించవచ్చు. ఇవన్నీ చిన్న, చిన్నవే. ప్రభుత్వానికి పెద్దగా ఖర్చు అయ్యేది కూడా ఏమీ ఉండదు. చాలా సంవత్సరాల తరబడి condemned వాహనాలు, ఓల్డ్ ఏజ్ వాహనాలు కూడా రోడ్ల మీద తిరుగుతున్నాయి. రోడ్లు మరియు రవాణా శాఖలను మంత్రి రాఘవరావు గారే చూస్తున్నారు కాబట్టి వీటి మీద ఏమి చర్యలు తీసుకుంటున్నారని అడుగుతున్నాను. Condemned వాహనాల వల్లనే ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఈమధ్య రాజమండ్రిలో జరిగిన ప్రమాదాన్ని నేను టీ.విలో చూశాను. బ్రేకులు ఫెయిల్ కావడంతో స్పీడ్‌గా జనం మీదకు మూడు చోట్ల ఆ వాహనం వెళ్లినట్లు టీ.విలో చూపించారు. వాహనాల జీవిత కాలం 10 సంవత్సరాలు, 15 సంవత్సరాలని ఒక టైం పెడతారు. నిర్ణీత గడువు దాటినా అవి రోడ్ల మీద తిరుగుతున్నాయి. అటువంటి వాహనాలు రాష్ట్రంలో ఎన్ని ఉన్నాయి, వాటి మీద ప్రభుత్వం ఏమి చర్యలు తీసుకోబోతుంది?

మంత్రి గారూ, మీ ప్రక్కనున్న మైనింగ్ మంత్రి గారు మంచి ఆదాయంలో ఉన్నారు. మైనింగ్ డిపార్ట్‌మెంట్ మంచి ఆదాయంలో ఉంది. దానిలో ఎటువంటి అనుమానం లేదు. ఆర్ అండ్ బి రోడ్లను ఏపి మినరల్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ కు చెందినటువంటి మినరల్‌ను పల్వరైజింగ్ చేసే మిల్లులకు సంబంధించిన వాహనాలు పాడుచేస్తున్నాయి. ఆ రోడ్ల నిర్వహణకు కిలోమీటరుకు ఇంత డబ్బు చొప్పున సంవత్సరానికి ఒకసారి చొప్పున కంట్రిబ్యూట్ చేసే విధంగా చూడాల్సిందిగా మీ ద్వారా మంత్రి గారిని కోరుతున్నాను. మినరల్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్‌కు మట్టిని త్రవ్వినా డబ్బే, మట్టిని క్రింద పోసినా డబ్బే కాబట్టి సంవత్సరానికి రూ.100 కోట్లు కాని, రూ.150 కోట్లు కాని ఆ ఏరియాలో ఉన్నటువంటి రోడ్లను అభివృద్ధి చేయడానికి వారి దగ్గర నుండి నిధులను తీసుకోవాల్సిన అవసరముంది. మినరల్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ లాభాలలో ఉంది. ఆర్ అండ్ బి నష్టాలలో ఉంది. ఆర్టీసీ దాదాపు రూ.2200 కోట్ల నష్టంలో ఉంది. డీజిల్ రేట్లు తగ్గి రూ.30 కోట్లు కలిసి వచ్చినా కూడా ఆర్టీసీ ఛార్జీలు అలాగే ఉన్నాయి.

ఉ. 10.20

ఆర్‌టిసీ నష్టాలలో ఉంది కాబట్టి దాని జోలికి పోవడం లేదు. ఒక బస్సు పెట్టుకున్న వాళ్లు మరుసటి సంవత్సరం రెండు బస్సులు పెట్టుకుంటారు. యాక్షన్ తీసుకోవాల్సిందిగా కోరుతున్నాను.

శ్రీ ఆర్. రెడ్డప్ప రెడ్డి : (నామినేటెడ్) సార్, రెండురోజుల క్రితం పలమనేరులో రోడ్డు ప్రమాదం జరిగి ముగ్గురు మరణించారు. గతంలో నేను ఈ విషయం గురించి మీ దృష్టికి తీసుకురావడం జరిగింది. నేషనల్ హైవే నంబరు 4, బెంగళూర్ నుండి రాణిపేట్ తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలలో పార్టులలో పూర్తయ్యింది కానీ ఆంధ్రప్రదేశ్ పార్టులోనే మిగిలిపోయింది. దీనివలన పలమనేరు, బంగారుపాలెం వద్ద తరచుగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. గౌరవసభ్యులు చూపించిన ఏడు వేల మరణాలలో

పలమనేరు, బంగారుపాలెం, కాటిల్‌ఫారమ్ వద్ద ఎక్కువగా జరుగుతున్నాయి. కేంద్రప్రభుత్వం ఇపిసి కింద టేకప్ చేద్దామని నిర్ణయించారు. కానీ జిల్లాకలెక్టర్‌కు చాలా సార్లు చెప్పించాను సార్, చిన్న చిన్న ఫార్మాలిటీస్ పూర్తి చేయడం లేదు. నేను మూడు రోజుల క్రితం మీరు బయట ఉన్నప్పుడు ఒక నోట్ ఇచ్చాను సార్,ఆ ఫార్మాలిటీస్ పూర్తి చేస్తే they will proceed. So District collector has to act. మీ ఇంజనీర్స్ కూడా రెవెన్యూ వాళ్ల ఆలస్యం చేస్తున్నారు, పట్టించుకోవడం లేదని చెబుతున్నారు. దానిని సీరియస్‌గా తీసుకోవాలి. It is a shame to our state. When one national high way is completed in two states, ఆంధ్రప్రదేశ్ స్టేట్‌లో మిగిలిపోయింది. దానివలన చాలా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. So I request the Minister to pay serious attention to this.

శ్రీ పి.జె. చంద్రశేఖర రావు : (శాసనసభ నియోజక వర్గం) అధ్యక్షా, రోడ్డు ప్రమాదంలో చనిపోయినవారు, క్షతగాత్రులై వికలాంగులైనటువంటి వారికి, థర్డ్ పార్టీ ఇన్సూరెన్సు కాకుండా ప్రభుత్వం వైపు నుండి నష్టపరిహారం ఇచ్చే ఆలోచన ఏమైనా ఉందా. రెండవది అత్యంత ప్రధానమైనది, National Road Safety Act అనే పేరుతో కేంద్రప్రభుత్వం ఒక చట్టం తీసుకువస్తున్న నేపథ్యంలో మన రాష్ట్రంలో ఉన్నటువంటి రూట్స్ అన్నీ కూడా కేంద్రప్రభుత్వం వాళ్లు వేలం వేసి, ఎవరు వేలంలో వస్తారో వాళ్లు మాత్రమే వాహనాలు నడుపుకునేందుకు వీలుగా ఈ చట్టం తీసుకువస్తున్న క్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 95 శాతం రవాణా అంతా కూడా ఆర్‌టిసీ ఆధ్వర్యంలో జరుగుతున్న నేపథ్యంలో, భవిష్యత్తులో ఈ రూట్స్ అన్నీ కూడా కేంద్రప్రభుత్వం ఆధ్వర్యంలోకి వెళ్లి వేలం ద్వారా రవాణా వ్యవస్థ అంతా కూడా చినాభిన్నమై రాష్ట్రప్రభుత్వ ఆధ్వర్యంలో ఉండాల్సిన రోడ్డు ట్రాన్స్‌పోర్టు కేంద్రప్రభుత్వానికో మరోదాని చేతిలోకో వెళ్లే ప్రమాదముంది. అనేక రాష్ట్రాలు దీనికి అభ్యంతరం తెలియపరిచాయి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా దీనిని ఆమోదించిందా లేదా రాష్ట్రప్రభుత్వానికి ఉన్న అధికారాలను కోల్పోయే దానికి వస్తున్న చట్టాన్ని రాష్ట్రప్రభుత్వం వ్యతిరేకిస్తున్నదా అని తెలియజేయాల్సిన అవసరం ఉందని మీద్వారా మంత్రిగారిని కోరుతున్నాను.

శ్రీ శిద్దా రాఘవరావు: అధ్యక్షా, గౌరవసభ్యులు శేషుబాబుగారు రోడ్లు వెడల్పు లేకపోవడం వలన ఈ రోడ్డు జరుగుతున్నాయని సభ దృష్టికి తీసుకురావడం జరిగింది. ఈ రోడ్లు మీద గత కొన్ని సంవత్సరాల నుండి స్పెషల్ డ్రైవ్ చేసి, ఒక పద్ధతి ప్రకారం చేసుకుని ఉండి ఉంటే ఈ సమస్యలు వచ్చి ఉండేవి కాదు. మేము అధికారంలోకి వచ్చి 9 మాసాలు. దీనిమీద కూడా ముఖ్యమంత్రిగారు స్పెషల్ డ్రైవ్ పెట్టి ఏ ఏరియాలో రూరల్ రోడ్లు, మండల స్థాయి రోడ్లు, జిల్లా స్థాయి రోడ్లు డెవలప్ చేయాలనేది ఐడెంటిఫై చేస్తున్నాము. కొన్ని ఏరియాలలో పాట్ హోల్స్ ఉన్నాయి. జిల్లాస్థాయిలో పాట్ హోల్స్ అన్నీ 75 శాతం పూర్తి చేయడం జరిగింది. దానికి నిధులు ఉన్నాయి.

తరువాత ఇండికేటర్స్ కూడా లేవని సభ దృష్టికి తీసుకురావడం జరిగింది. దానికోసం ఇప్పటికే టెండర్స్ పిలిచి మొదలు పెట్టాము. జంక్షన్స్‌లో, క్రాసింగ్ ఏరియాలలో, సైన్ బోర్డులు, రేడియం స్టిక్కరింగ్ పనులు జరుగుతున్నాయి. ఇవన్నీ కూడా రాబోయే రెండు నెలల్లో మొత్తం 13 జిల్లాలలో పూర్తి చేసుకుని ముందుకు వెళతాము. అలాగే నేషనల్ హైవేకు సంబంధించి రాష్ట్రప్రభుత్వం చేతిలో లేని పరిస్థితి. కేంద్రప్రభుత్వం వారు కూడా స్పెషల్ డ్రైవ్ పెట్టి మా రాష్ట్రంలో మీ నేషనల్ హైవేలు ఎక్కడెక్కడున్నాయో వాటన్నింటికీ కూడా సైన్ బోర్డులు, సేఫ్టీ మెజర్స్ తీసుకురావాలని నేషనల్ హైవేకు సంబంధించిన ఛైర్మన్‌తో మాట్లాడడం జరిగింది.

గౌరవసభ్యురాలు శ్రీమతి నన్నపనేని రాజకుమారి గారు తెనాలి నుండి విజయవాడ రోడ్డు గురించి అడిగారు. ఈ బకింగ్‌హాం కాలువకు ఇరువైపులో రోడ్డు వెలుతుంది. ఆ రోడ్డు స్పెషల్‌గా చూడాలని అడిగారు. నేను మొన్న గుంటూరు జిల్లా పర్యటనకు వెళ్లినప్పుడు ఆ రోడ్డు మీదనే ప్రయాణించి పరిశీలించడం జరిగింది. ఆ ఏరియాలో కూడా సైన్ బోర్డులు, అన్నీ కార్యక్రమాలు చేపట్టాము. తప్పకుండా

అవన్నీ త్వరలోనే పూర్తి చేస్తాము. కొంతమంది డ్రంక్ అండ్ డ్రైవ్ చేస్తున్నారు. దానికోసమే 130 మందితో కూడిన ఒక బృందాన్ని నియమించాము. ఈ టీమ్ సుమారు 25వేల కేసులు బుక్‌చేశారు. ఈ 25వేల కేసులలో సుమారు లైసెన్స్‌లు లేనివి సుమారు 30 శాతం కనపడుతున్నాయి. దాని మీద టి.సి గారు స్పెషల్ డ్రైవ్ చేసి, భవిష్యత్తులో డ్రైవింగ్ లైసెన్స్ లేని కేసులు , డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు, స్పీడీ డ్రైవింగ్ అదుపులోకి తీసుకురావడానికి ప్రయత్నం చేస్తున్నాము. తప్పకుండా ఎటువంటి పరిస్థితులలో అయినా సరే దానిని పూర్తి చేస్తాము.

అదేమాదిరిగా, గౌరవ సభ్యురాలుశ్రీమతి నన్నపనేని రాజకుమారి గారు రోడ్లు గుంటలు పడి ఉంటున్నాయిని చెప్పడం జరిగింది. ఇది ఒక్క రోజుతో చేసే పని కాదు. ఇది కంటిన్యూస్‌గా ప్రాసెస్ జరుగుతోంది. ఇది రూరల్ నుండి అర్బన్ ఏరియాస్ వరకూ అన్ని ఏరియాలలో ఈ ఇబ్బంది ఉంది. నిధులు లేవనే ఇబ్బంది లేదు, ఏదో విధంగా రిపేర్స్ చేయిస్తున్నాము. అన్ని విధాలుగా 2 నెలల్లో రిపేర్లు చేసి ముందుకు వెళతాము. గౌరవసభ్యురాలు శమంతక మణి గారు ఎన్ హెచ్ 5 వద్ద సిగ్నల్స్ లేవని అడగడం జరిగింది. తప్పకుండా ఈ విషయం pursue చేసి, తప్పకుండా అక్కడ సిగ్నల్స్ ఏర్పాటు చే స్తామని తెలియజేస్తున్నాను. అలాగే మన గౌరవ సభ్యులు చంగల్ రాయుడు గారు జంక్షన్ సిగ్నల్స్‌కు నిధులున్నాయా అని అడిగారు. దానికి ఫండ్స్ ఉన్నాయి. మేము టెండర్స్ కూడా పిలవడం జరిగింది. అన్ని జిల్లాలలో కూడా ప్రాసెస్ లో ఉన్నాయి. టెండర్లు పూర్తికాగానే రాబోయే ఒక నెలలోనే ఈ ప్రోగ్రెస్ మొదలవుతుంది. ఎక్కడా కూడా ఇబ్బందిలేదు. పెట్రోల్ బంక్‌ల దగ్గర స్పీడ్ బ్రేకర్స్ వేస్తే బాగుంటుందని సలహా ఇచ్చారు. తప్పకుండా మేము ఆదేశాలు జారీ చేస్తాము. అలాగే పాట్ హోల్స్ గురించి అడిగారు. మాన్యువల్‌గా పాట్‌హోల్స్ చేయాలంటే చాలా సమయం పడుతోంది. బెంగళూరు కార్పోరేషన్‌లో పాట్ హోల్ మిషన్ ఉంది. దాని ఖరీదు రూ.3కోట్ల 50 లక్షలు. ఆమిషన్‌ను ట్రైయిల్ రన్ కోసం, పైలెట్ ప్రాజెక్ట్ గా ముఖ్యమంత్రిగారు కుప్పం వచ్చినప్పుడు అక్కడకు తీసుకువచ్చి ట్రైయిల్ ఇవ్వడం జరిగింది. వెంటనే రెండు మిషన్‌లు తీసుకుని, కృష్ణా, గుంటూరు జిల్లాలకు పైలెట్ ప్రాజెక్టుగా చేయాలని ఒక నిర్ణయం తీసుకున్నాము. ఆ మిషన్‌తో స్టార్ట్ చేస్తే రోజుకు 25 కిలోమీటర్లు పూర్తయ్యే అవకాశాలున్నాయి. మాన్యువల్‌గా కాకుండా మిషన్‌తో చేస్తే ఈ కార్యక్రమం త్వరగా పూర్తవుతుందని భావిస్తున్నాము. అలాగే గౌరవ సభ్యులు రెడ్డప్ప రెడ్డిగారు ఎన్‌హెచ్ 4 గురించి అడిగారు. నేను కుప్పం వెళ్లేటప్పుడు ఆ రోడ్డులోనే జర్నీ చేయడం జరిగింది. పలమనేరు నుండి బంగారు పాలెం వరకూ నేను కూడా జర్నీ చేశాను. ఆ రోడ్‌లో curves ఎక్కువగా ఉన్నాయి. ఈ curves వలన ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. దానికి కూడా సిగ్నల్స్ ఇవ్వాల్సి ఉంది. నేను కూడా ఎన్‌హెచ్ వాళ్లతో మాట్లాడి అది కూడా ఏర్పాటు చేస్తాము. అలాగే ల్యాండ్‌కు సంబంధించి కొన్ని సమస్యలున్నాయి. నాలుగు రోజుల క్రితం వాళ్లు నాకు ఒక రిప్రజెంటేషన్ ఇవ్వడం జరిగింది. చిత్తూరు జిల్లా కలెక్టర్ గారితో మాట్లాడి యాక్షన్ తీసుకోమని చెప్పడం జరిగింది.

ఉ10.30

సభ్యులు శ్రీ పి.జె. చంద్రశేఖర్ రావు గారు ఇన్స్యూరెన్స్ గురించి మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం ఏదైనా సహాయంచేస్తుందా అని అడగడం జరిగింది. తప్పకుండా థర్డ్‌పార్టీ ఇన్స్యూరెన్స్, అంటే వెహికిల్ ఇన్స్యూరెన్స్ వస్తుంది. అవసరాన్నిబట్టి రాష్ట్ర ప్రభుత్వం ఏవిధంగా నిర్ణయం తీసుకోవాలో ఆలోచించి నిర్ణయం తీసుకుంటాం. ట్రాన్స్‌పోర్ట్ డిపార్టుమెంటుకు సంబంధించి ఢిల్లీలో సమావేశం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఆ సమావేశానికి నేను హాజరుకావడం జరిగింది. ఆ బిల్లుకు నేను మద్దతు ఇవ్వకూడదని భావిస్తున్నాను. తప్పకుండా అదే వ్రాసి పంపిస్తాము. దానిలో సమస్యేమీ లేదు. ట్రాన్స్‌పోర్టు డిపార్టుమెంటు కూడా రాష్ట్ర ప్రభుత్వం చేతిలోనే ఉండాలిగాని కేంద్ర ప్రభుత్వ చేతిలోకి వెళ్లేటువంటి పరిస్థితి

ఉండకూడదు. అదేకాకుండా మొన్న 130 బృందాలతో డ్రైవ్ నిర్వహిస్తే 30శాతం వరకు డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా తిరుగుతున్నటువంటి పరిస్థితి ఉంది. డ్రైవింగ్ లైసెన్స్ లేని వారు వారి ఇష్ట ప్రకారంగా పోతున్నారు. దానిగురించి కూడా ఎలా చేస్తే బాగుంటుందనేది ఆలోచిస్తున్నాము. రేపు సాయంత్రం గౌరవ ముఖ్యమంత్రిగారి దగ్గర సేఫ్టీగురించి, సేఫ్టీ మెజర్స్‌గురించి మీటింగ్ కూడా ఏర్పాటుచేశాం. అన్ని విషయాలు రేపు కూడా డిస్కస్ చేయబోతున్నాం. అంతేకాకుండా డ్రైవర్స్‌కు డ్రైవింగ్ సంస్థలను నిర్వహించి, డ్రైవింగ్ టెస్ట్ కోసం, టెస్ట్ ట్రాక్స్ ఏర్పాటు చేయడం కోసం గవర్నమెంట్‌కు లెటర్ వ్రాశాం. పదమూడు జిల్లాలకు యూనిట్ ఆఫీసర్, టెస్ట్ ట్రాక్ పెట్టాలని ప్రయత్నం చేస్తున్నాము. సేఫ్టీ మెజర్స్ మీద గౌరవ ముఖ్యమంత్రి గారిని నిధుల గురించి అడిగినప్పుడు రూ.5కోట్లు ట్రాన్స్‌పోర్టు డిపార్టుమెంటుకు ఇవ్వడం జరిగింది. ఈ రాష్ట్ర ప్రభుత్వం పర్మనెంట్‌గా మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్, ఎ.ఎం.వి.ఐ ఇద్దరినీ కమిటీగా తిప్పాలని, భవిష్యత్తులో అవసరమైతే స్టాఫ్‌ను పెంచుకొని జీరో యాక్సిడెంట్స్ లెవెల్‌కు తీసుకురావటానికి ఈ రాష్ట్రప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది. అందుకోసం మేము ప్రయత్నం చేస్తున్నాం. పదమూడు జిల్లాల్లో కూడా సేఫ్టీ మెజర్స్ మీద కమిటీలు వేయడం జరిగింది. అదేవిధంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దగ్గర సేఫ్టీ మెజర్స్ మీద ప్రతి శనివారం మీటింగు జరుగుతుంది. ఇవన్నీ ఒక పద్ధతి ప్రకారం చేస్తున్నాం. హైవేల ప్రక్కనున్నటువంటి వైన్ షాపులను మూసివేయాలని గౌరవ ముఖ్యమంత్రిగారు మొన్ననే ఆదేశాలిచ్చారు. వాటిమీద కూడా స్పెషల్ డ్రైవ్ జరుగుతోంది. ప్రతి నియోజకవర్గంలో ఆటో, లారీ, బస్సు డ్రైవర్ల అసోసియేషన్స్‌తో ఒక అవేర్‌నెస్ ప్రోగ్రాం ఏర్పాటు చేయాలని ట్రాన్స్‌ఫోర్ట్ సెక్రెటరీ గారికి ఆదేశాలివ్వడం జరిగింది. ఈ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన మొదటి వంద రోజుల్లోనే భద్రతా వారోత్సవాలు జరిపించాము. అయినప్పటికీ కొన్ని కారణాల వల్ల అక్కడక్కడా ప్రమాదాలు జరుగుతున్నాయి. నేను దానికి బాధపడుతున్నాను. అందుగురించి అధికారులతో ఫ్రీక్వెంట్‌గా సమావేశాలు ఏర్పాటు చేయడం జరుగుతోంది. డ్రైవింగ్ స్కిల్ కూడా ఇంప్రూవ్ చేయాలనే ఆలోచనతో ముందుకు వెళుతున్నాము. సేఫ్టీ మెజర్స్‌లో ఎక్కడైనా, ఏవైనా ఇబ్బందులు వస్తే ఎవ్వరిని కూడా వదిలిపెట్టే ప్రసక్తే లేదు. అవసరమైతే వాహనాలను పట్టుకొని సీజ్ చేసే కార్యక్రమాన్ని మొదలుపెట్టాం. అన్నివిధాల సహకరించాలని తెలియజేస్తూ సెలవుతీసుకుంటున్నాను.

మిస్టర్ ఛైర్మన్ : గౌరవ సభ్యులు శ్రీ చంద్రశేఖర్ గారు అడిగినట్లు ప్రమాదాలు జరిగినప్పుడు ప్రమాదానికి గురైన వారికి థర్డ్ పార్టీ నుండి కాకుండా నేరుగా ముఖ్యమంత్రి గారి సహాయనిధినుండి ఏమైనా సహాయం అందుతుందా? అటువంటి అవకాశం ఏమైనా ఉందా? పోయిన శనివారం కర్నూలుకు వెళ్లినప్పుడు నాకు ఒక విజ్ఞాపన పత్రం అందజేయడం జరిగింది. అదేమంటే, బోడేపల్లి మండలం, కర్నూలు జిల్లా మహిళా తహసిల్దారు జిల్లా కలెక్టరు గారికి స్వాగతం పలకడానికి రోడ్డుపై నిల్చుండగా లారీ వచ్చి తనను కొట్టేసింది. కానీ, అదృష్టవశాత్తు తాను బ్రతికే ఉంది. ఈ సంఘటన జరిగి ఆరు మాసాలు అయిందంటా, అప్పటినుండి ఆమె ఇప్పటికీ కూడా ఆరు మాసాలుగా ఆసుపత్రిలోనే ఉంది. ఆమె విజ్ఞాపన పత్రం మీద సంతకం చేయలేని పరిస్థితుల్లో వేలిముద్ర వేసి విజ్ఞాపన పత్రాన్ని నాకు సమర్పించడం జరిగింది. ఆమెకేమైనా లీవ్ మంజూరు చేసి వేతనం ఇస్తారా? అదేవిధంగా హైవే రోడ్లమీద ఉన్నటువంటి వైన్ షాపుల గురించి కూడా సీరియస్‌గా ఆలోచించాలి.

శ్రీ శిద్దా రాఘవరావు : అలాగే సార్.

శ్రీ బి. చెంగల్ రాయుడు : అధ్యక్షా, ఇసుక రేటు పెంచినప్పుడు ongoing worksకి కూడా వర్తింపచేయాలి కదా? కొత్తగా తీసుకున్న పనులకేమో పెడుతున్నారు, ongoing works కి కూడా వర్తింపచేయటం లేదు. ప్రస్తుతం జరుగుతున్నటువంటి పనులకు కూడా వర్తింపచేయాలి. అదేదో చేస్తామనే మంచి మాట ఒకటి చెప్పమనండి సార్.

## రాష్ట్రంలో పాల ఉత్పత్తి

ప్రశ్న సంఖ్య:8087 (53)

సర్వశ్రీ బొడ్డు భాస్కర రామారావు, అంగర రామమోహన్, ఎం.ఎల్.సి.లు

గౌరవనీయులైన వ్యవసాయ, పశుసంవర్ధకశాఖమంత్రిగారూ, దయచేసి ఈక్రింది సమాచారం తెలియచేస్తారా?

అ) రాష్ట్రంలో తలసరి పాల లభ్యతను జిల్లావారీగా తెలపండి.

ఆ) రాష్ట్రంలో నాణ్యమైన పాల ఉత్పత్తిని పెంపొందించడానికి మరియు హైటెక్ పాల ఉత్పత్తి కేంద్రాలను ఏర్పాటుచేయడానికి తీసుకున్న చర్యలేమిటి?

ఇ) సాధారణ ప్రజలు, ప్రత్యేకించి మహిళలు మరియు బాలల కోసం నాణ్యమైన పాలను అందుబాటులో ఉండేవిధంగా చేయడానికి తీసుకుంటున్న చర్యలేమిటి?

వ్యవసాయ, పశుసంవర్ధకశాఖమంత్రి (శ్రీ ప్రత్తిపాటి పుల్లారావు):

అ) రాష్ట్రంలో తలసరి పాల లభ్యతను జిల్లావారీగా చూపిస్తున్న పట్టికను సభా సమక్షంలో ఉంచడమైనది.

ఆ) పశుజాతి అభివృద్ధి, క్షీరసాగర్ పథకం, పశు ఆరోగ్య సంరక్షణ కార్యకలాపాలవంటి వివిధ పథకాల అమలు, పాడి పరిశ్రమ రైతులకు అవగాహన కల్పించడానికి జన్మభూమి, మాఊరు కార్యక్రమాలలో పశువైద్య శిబిరాలను ఏర్పాటుచేయడంతోపాటుగా పశుదాణ, పశుగ్రాసం అభివృద్ధిని పెంపొందించడంవంటి చర్యల రూపంలో నాణ్యమైన పాల ఉత్పత్తిని వృద్ధిపరచడానికి ప్రభుత్వం చర్యలను తీసుకుంటున్నది. ప్రస్తుతం హైటెక్ పాల ఉత్పత్తి కేంద్రాలను ఏర్పాటుచేయడానికి ఎటువంటి ప్రతిపాదనలు లేవు.

ఇ) "అన్న అమృతహస్తం పథకం" క్రింద 3.45 లక్షలమంది గర్భిణి, పాలిచ్చే మహిళలకు మరియు మహిళా శిశు సంక్షేమశాఖద్వారా "గోరుముద్దలు" పథకంక్రింద 6 సంవత్సరాలలోపు ఒక లక్షమంది పౌష్టికాహార లోపంగల బాలలకు ప్రభుత్వం పాలను సమకూరుస్తున్నది.

శాసనపరిషత్తులోని ప్రశ్న నెం.8087 లోని (ఎ) ఖండానికి సమాధానం

ఆంధ్రప్రదేశ్ 2013-14 కాలంలో జిల్లావారీగా తలసరి పాల లభ్యత

| వరుస సంఖ్య | జిల్లా | 2013-14 లో పాల ఉత్పత్తి (000ఎంటిలు) | జనాభా 2013-14 | తలసరి పాల లభ్యత (ఒకరికి/రోజుకు/ గ్రాములు) |
|---|---|---|---|---|
| 1 | శ్రీకాకుళం | 425.547 | 2824164 | 412.82 |
| 2 | విజయనగరం | 414.336 | 2427241 | 467.68 |
| 3 | విశాఖపట్టణం | 552.436 | 4610657 | 328.27 |
| 4 | తూర్పు గోదావరి | 828.642 | 5371566 | 422.64 |
| 5 | పశ్చిమ గోదావరి | 832.490 | 4177503 | 545.97 |
| 6 | కృష్ణా | 989.193 | 4860721 | 557.55 |
| 7 | గుంటూరు | 976.781 | 4936379 | 542.12 |
| 8 | ప్రకాశం | 1049.906 | 3463168 | 830.58 |
| 9 | నెల్లూరు | 558.696 | 3042571 | 503.09 |
| 10 | చిత్తూరు | 947.997 | 4423616 | 587.13 |
| 11 | కడప | 318.660 | 3068195 | 284.55 |
| 12 | అనంతపురము | 482.217 | 4275740 | 308.99 |
| 13 | కర్నూలు | 705.824 | 4336400 | 445.94 |
| | **మొత్తం** | **9082.725** | **51817921** | **480.22** |

ప్రత్తిపాటి పుల్లారావు,
వ్యవసాయ, పశుసంవర్ధక,
పాడిపరిశ్రమాభివృద్ధి & మత్స్య శాఖ మంత్రి

శ్రీ బొడ్డు భాస్కర రామారావు : (స్థానిక సంస్థల నియోజక వర్గం – తూర్పుగోదావరి) అధ్యక్షా, పాడిపరిశ్రమ ద్వారా పాల ఉత్పత్తి జరుగుతోంది. గ్రామీణ ప్రాంతాల్లోని మహిళా సంఘాలని ఇన్‌వాల్వ్ చేసి పాల ఉత్పత్తిని పెంచడానికి అవకాశం ఏమైనా ఉందా? ఎలిమెంటరీ విద్యలో మధ్యాహ్న భోజన పథకంతోపాటు గ్లాసు పాలు ఇచ్చేటువంటి ప్రతిపాదనలు ప్రభుత్వం దగ్గర ఏమైనా ఉన్నాయా? పశువుల ఉత్పత్తిలో నాణ్యమైన బ్రీడ్ తీసుకురావడానికి ప్రభుత్వం ఏమైనా చర్యలు తీసుకుంటుందా? ఈమధ్య గుజరాత్ రాష్ట్రం నుండి ఆవులు, గేదెలు తీసుకువస్తుంటే అక్కడి ప్రభుత్వం దానిమీద రెస్ట్రిక్షన్స్ పెట్టడంవల్ల మనకు మంచి పశువులు రాకుండా పోతున్నాయి. దానిమీద కూడా ప్రభుత్వం ఏమైనా చర్యలు తీసుకుంటుందా అనేది తెలపాలని మీద్వారా కోరుతున్నాను.

శ్రీ ప్రత్తిపాటి పుల్లారావు : అధ్యక్షా, పాల ఉత్పత్తి పెంచేందుకు 2014–15సంవత్సరంలో పాల ఉత్పత్తి రాష్ట్రంలో 96లక్షల మెట్రిక్ టన్నులు ఉంటే, దీనిని 2015–16 సంవత్సరం నాటికి ఒక లక్షా, ఎనిమిది

వేల టన్నులకు పెంచాలనే లక్ష్యంతోటి ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేయడమయింది.

ఉ. 10.40

రాష్ట్రంలో పాల ఉత్పత్తి పెంచేందుకు ఎక్కడ అవకాశం ఉంటే అక్కడ ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్య పద్ధతి ద్వారా అమలు చేసేందుకు ఈ క్రింది జాతి అభివృద్ధి కార్యక్రమాలు రూపొందించబడ్డాయి. పాడిపశువుల జాతికి సంబంధించి లింగనిర్ధారణ చేసినటువంటి వీర్యం, పిండాల సరఫరా రైతులకు కోరిన విధంగా మగ, ఆడ పశువులను ఉత్పత్తి చేసుకునే అవకాశం కల్పించాలనేది లక్ష్యం. 2015-16 సంవత్సరంలో నమూనా ప్రాజెక్టుగా దీనిని ప్రభుత్వ ప్రయివేటు భాగస్వామ్య పద్ధతిలో 100.00 లక్షల ఖర్చుతో సుమారు 10వేల డోసుల లింగనిర్ధారణ చేసిన వీర్యాన్ని కొనుగోలు చేసి రైతులకు సరఫరా చేయాలని తద్వారా రాష్ట్రంలో అదనంగా పై దూడలను ఉత్పత్తి చేయాలనీ ప్రతిపాదించడమైనది. ప్రభుత్వేతర స్వచ్ఛంద సంస్థ ద్వారా రాష్ట్రంలో అదనపు విత్తన పశువులకు పశుసంవర్ధక సేవలందించడం జరుగుతుంది. రాష్ట్రంలో మారుమూలల్లో పశుసంవర్ధకశాఖ ద్వారా సేవలందని ప్రాంతాలలో జాతీయ అభివృద్ధి సేవలు విస్తరించేందుకు ప్రభుత్వేతర స్వచ్ఛంద సంస్థల సహకారంతో సమీకృత పశుగణ బ్రీడింగ్ కేంద్రాలను ప్రారంభించడం. ఈ పథకం క్రింద 500.00లక్షల అంచనా వ్యయంతో 50లక్షల పాడిపశువులకు సేవలందించాలనీ ప్రతిపాదించడమైనది. బ్రీడింగ్ కేంద్రాలు ప్రారంభించిన నాలుగో ఏడాది నుంచి వార్షికంగా 4.5 లక్షల టన్నుల పాల ఉత్పత్తి అదనంగా జరుగుతుందనీ అంచనా అధ్యక్షా, దానికి గానూ క్షీరసాగర పథకం, పాడిపశువులలో ఈతకు, ఈతకు మధ్య అంతరాన్ని తగ్గించడం ద్వారా పశువుల జీవితకాల పాల దిగుబడిని పెంచేందుకు ఈ పథకాన్ని రూపొందించాము. ఈ పథకం ఆంధ్రప్రదేశ్ పాడి, పశువుల సమాఖ్య ప్రెయివేటు భాగస్వామ్యాల ద్వారా తగిన సమస్యలు ముందుకు వచ్చినట్లయితే ప్రభుత్వ, ప్రయివేటు, భాగస్వామ్య పద్ధతిలో అమలు చేయాలనీ ప్రతిపాదించడమైనది. పశువుల శూన్య కాలంలో ఆఖరి మూడు నెలలు ఈత తరువాత మొదటి మూడు నెలలు మొత్తం 6 నెలల పాటు పోషక దాణా మద్దతు ఇతర సౌకర్యాలు అందిస్తున్నాము. అదే విధంగా 1050.00 లక్షల అంచనా వ్యయంతో రూ.13వేల లబ్ధిదారులకు ప్రయోజనం చేకూర్చడం కూడా ప్రతిపాదించడమైనది. అదే విధంగా గుజరాత్ నుండి మేలు జాతి పశువులను దిగుమతి చేసుకునే ఆసక్తిగల రైతులకు అనుమతులు విరివిగా కూడా ఇస్తున్నాము. అదేవిధంగా ఎస్.హెచ్ సభ్యులకు కూడా బ్యాంకులోన్లు, SERP ద్వారా ఋణాలను మంజూరు ఇప్పించి పాడి పశువుల పెంపకం గ్రామాభివృద్ధి శాఖ ద్వారా చేపట్టడం జరుగుతుంది.

MR. CHAIRMAN: Question No. 8180 (54) is postponed at the request of the Member and Question No. 7857 (55) is postponed as the Member is not present in the House.

## కళాశాలల్లో సైన్సు, సబ్జెక్టులను కొనసాగించడం

ప్రశ్న నెం. 8109 (56)

శ్రీమతి పి.శమంతకమణి, ఎం.ఎల్.సి.

గౌరవనీయులైన మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా?

అ) కొన్ని జూనియర్ డిగ్రీ కళాశాలలో కొన్ని సైన్సు సబ్జెక్టుల బోధనను కొనసాగించడం లేదన్న విషయం వాస్తవమేనా?

ఆ) అయితే, అందుకు గల కారణాలేమిటి?

ఇ) అన్ని సబ్జెక్టులను బోధించడానికి, అవసరమైన బోధనా సిబ్బందిని సమకూర్చడానికి తీసుకున్న చర్యలేమిటి?

గౌరవనీయులైన మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి (శ్రీ గంటా శ్రీనివాసరావు):

అ) లేదండీ.

ఆ) ఈ ప్రశ్న ఉత్పన్నం కాదు.

ఇ) అన్ని సబ్జెక్టులను బోధించడానికి, అవసరమైన బోధనా సిబ్బందిని సమకూర్చడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నది. ప్రభుత్వ జూనియరు కళాల్లో ఖాళీలు ఉన్నప్పుడు అన్ని సబ్జెక్టులలో కాంట్రాక్టు ఫ్యాకల్టీని ఏర్పాటు చేయడమయింది. ప్రభుత్వ జూనియరు, డిగ్రీ కళాశాలల్లో అత్యవసరమైనప్పుడు అన్ని సబ్జెక్టులలో ప్రతి సంవత్సరం కాంట్రాక్టు లెక్చరర్లను నియమించడమవుతున్నది. గంటల వారీగా చెల్లింపులు చేస్తూ పార్ట్-టైం ప్రాతిపదికన పునర్ వ్యవస్థీకృత కోర్సులలో గెస్ట్ ఫ్యాకల్టీని కూడా నియమించడమవుతున్నది.

శ్రీమతి పమిడి శమంతకమణి : అధ్యక్షా, ఈనాటి ప్రభుత్వానికి ప్రతి మండలంలో ఒక జూనియర్ కాలేజిని ఏర్పాటు చేస్తామని చెప్పడం జరిగింది. అనంతపురం జిల్లా సింగనమల హెడ్‌క్వార్టర్స్‌లో గతం నుంచి కూడా సైన్స్ సబ్జెక్ట్ పెట్టమని చాలా సార్లు అర్జీలు ఇవ్వడం జరిగింది. ఈ రోజుకి కూడా సైన్స్ సబ్జెక్ట్ ఆ జూనియర్ కళాశాలలో పెట్టడం లేదు. అక్కడ ఉన్న పిల్లలందరూ కూడా ఆ మండలమే కాకుండా ఇతర మండలము నుంచి కూడా విద్యార్థులు ఎక్కువ సంఖ్యలో వస్తున్నారు. సైన్స్ సబ్జెక్ట్ లేనందువల్ల చాలా ఇబ్బందికరంగా ఉంది. అక్కడ కావలసిన స్థలం, భవనం ఉంది. అక్కడ కావలసిన ప్రయోగశాలలు పెట్టి కావలసిన సిబ్బందిని ఏర్పాటు చేసి సైన్స్ సబ్జెక్ట్ పెడితే బాగుంటుందని మీ ద్వారా మంత్రిని కోరుతున్నాను. అంతేకాకుండా చాలా చోట్ల కాంట్రాక్టు లెక్చరర్లను వినియోగించుకుంటుము అంటున్నారు కానీ, సంబంధిత సబ్జెక్ట్‌కు కావలసిన లెక్చరర్స్ లేనందువల్ల ఒకే లెక్చరర్ సోషల్ లెక్చరర్ వచ్చి ఇంగ్లీషు మిగతా వాటిని బోధించడం జరుగుతుంది. ఆ విషయమై తగు చర్యలు తీసుకోవలసినదిగా మీ ద్వారా నేను మంత్రి గారిని కోరుతున్నాను.

శ్రీ గంటా శ్రీనివాసరావు : అధ్యక్షా గౌరవ సభ్యురాలు అడిగిన వాళ్ల మండలంలోని కాలేజి గురించి తప్పకుండా నివేదికలు తెప్పించుకొని దాన్ని పరిశీలించి అతిత్వరలో ఆ సమస్యను పూర్తి చేస్తాము. ఇక ముఖ్యంగా ఈ సబ్జెక్ట్‌ల వారీగా కాంట్రాక్టు లెక్చరర్స్ వాళ్ల ఇబ్బందులు చెప్పారు. సభ్యురాలు అడిగిన ప్రశ్నలో సైన్స్ సంబంధించి మనం పోస్టులు నింపడం లేదు అని అంటున్నారు, అది ధ్యేయం కాదు. మన దగ్గర ఒక సారి సమాచారం ప్రకారం చూస్తే మొత్తం 2014 ఈ పరీక్షలకు హాజరు అయిన వారు నాలుగు లక్షల ఎనభై మూడు మంది ఉంటే అందులో సైన్స్ గ్రూపులో మూడు లక్షల పన్నెండు మంది ఉన్నారు. అంటే సైన్స్ గ్రూపు వారి సంఖ్య ఎక్కువగా ఉన్నది. సైన్స్‌కు సంబంధించి ఎక్కడా కూడా నిర్లక్ష్యం చేయడం లేదు. ఏ సబ్జెక్టుకు ఎంతమంది కాంట్రాక్టు లెక్చరర్స్ ఉన్నారో ఆ వివరాలు కూడా ఉన్నాయి. సబ్జెక్టు వారీగా, జిల్లాల వారీగా ఇస్తాము. మొత్తం 1382 మంది కాంట్రాక్టు లెక్చరర్స్‌ను సైన్స్ సబ్జెక్టులో మాత్రమే రిక్రూట్ చేసుకోవడం జరిగింది. వీళ్లు కాకుండా మళ్లీ పార్ట్‌టైమ్ లెక్చరర్స్, గెస్ట్ లెక్చరర్స్ వీళ్లందరూ కూడా తప్పకుండా రాబోయే రోజులలో కూడా ఈ ఫ్యాకల్టీకి సంబంధించి, స్టూడెంట్ రేషియోనీ పరిశీలిస్తూ ఎడ్యుకేషన్‌లో క్వాలిటీ తగ్గకుండా అన్ని రకాల చర్యలు తీసుకుంటాము.

MR. CHAIRMAN: Now, next question. Mr. Mohammad Jani Garu please put your question.

SRI MOHAMMAD JANI: Sir, I put the question.

## అంగన్‌వాడి కేంద్రాలు

ప్రశ్న నెం. 7904 (57)

శ్రీ మహ్మద్ జాని, ఎం.ఎల్.సి.

గౌరవనీయులైన మహిళా సాధికారత, శిశు సంక్షేమం, వికలాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ మంత్రి గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా?

అ) రాష్ట్రంలో వివిధ జిల్లాలలో పనిచేస్తున్న అంగన్‌వాడీ కేంద్రాల వివరాలు ఏమిటి?

ఆ) అంగన్‌వాడీ కేంద్రాలలో సొంత భవనాలు, నిఘా, పర్యవేక్షణ కొరవడిన కారణంగా నిర్ధిష్టపరచిన ప్రమాణాల ప్రకారం లబ్దిదారులకు ఆహారాన్ని పంపిణీ చేయడంలేదన్న విషయం ప్రభుత్వం దృష్టికి వచ్చిందా?

ఇ) అయితే, ఈ విషయంలో ప్రభుత్వం తీసుకోదలచిన చర్యలేమిటి?

గౌరవనీయులైన మహిళా సాధికారత, శిశు సంక్షేమం, వికలాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ మంత్రి (శ్రీమతి పీతల సుజాత) :

అ) ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వివిధ జిల్లాలలో పనిచేస్తున్న అంగన్‌వాడీ కేంద్రాల వివరాలు క్రింది విధంగా వున్నాయి.

| వరుస సంఖ్య / జిల్లా పేరు | మంజూరు చేసిన అంగన్‌వాడీ కేంద్రాల సంఖ్య | | పనిచేస్తున్న అంగన్‌వాడీ కేంద్రాల సంఖ్య | |
|---|---|---|---|---|
| | ప్రధాన | చిన్న | ప్రధాన | చిన్న |
| 1. శ్రీకాకుళం | 3403 | 789 | 3403 | 789 |
| 2.విజయనగరం | 2987 | 742 | 2987 | 742 |
| 3.విశాఖపట్టణం | 3587 | 1365 | 3587 | 1365 |
| 4.తూర్పుగోదావరి | 5113 | 433 | 5113 | 433 |
| 5.పశ్చిమ గోదావరి | 3565 | 324 | 3565 | 324 |
| 6.కృష్ణా | 3619 | 193 | 3619 | 192 |
| 7.గుంటూరు | 4351 | 54 | 4351 | 54 |
| 8.ప్రకాశం | 4009 | 235 | 4009 | 235 |
| 9.నెల్లూరు | 3454 | 320 | 3454 | 320 |
| 10.కడప | 3268 | 353 | 3268 | 353 |
| 11.కర్నూలు | 3486 | 63 | 3486 | 62 |
| 12. అనంతపురం | 4286 | 840 | 4286 | 840 |
| 13.చిత్తూరు | 3640 | 1128 | 3639 | 1095 |
| మొత్తం | 48768 | 6839 | 48767 | 6804 |

ఆ) లేదండీ.

ఇ) ఈ ప్రశ్న ఉత్పన్నం కాదు.

శ్రీ మహ్మద్ జాని : (శాసనసభ నియోజక వర్గం) అధ్యక్షా, అక్రమ పుటలు అంగన్‌వాడీ కేంద్రాలు అని ఆంధ్రజ్యోతి పేపరులో వచ్చింది. తరువాత ఈనాడు పేపరులో స్వంత భవనాలు లేవని, నిఘా లేదని వచ్చింది. నిఘా ఉంటే బాగుంటుంది, నిఘా లేదు, అంగన్ వాడీ కేంద్రాలు లేవు,ఆహార పంపిణీలో లబ్ధిదారులు నష్టపోతున్నారు. ఆ విషయంలో (అ) ప్రశ్నకు సమాధానం ఇవ్వండి. అన్ని జిల్లాలలో ఇదే విధంగా ఉన్నది. తెలంగాణాలో అయితే అంగన్ వాడీ కేంద్రాలను పెడతారంటున్నారు. ఆంధ్రలో ఆ ఆలోచన ఉందా?

శ్రీమతి పీతల సుజాతః తప్పకుండా మీ ప్రశ్నకు సమాధానం చెబుతాను సార్. అంగన్ వాడీ సెంటర్స్ కూడా ఎక్కడా ఏదీ అంటే నిఘా కేంద్రాలు పెడితేనే సక్రమంగా జరుగుతాయి, తప్పకుండా పర్యవేక్షణ ఉండాలంటే మీ అందరీ కోరికమేరకు దాన్ని తప్పకుండా పరిశీలిస్తాము.

ఉ. 10.50

శ్రీమతి పమిడి శమంతకమణి : అధ్యక్షా, అంగన్‌వాడీ కేంద్రాలలో మధ్యాహ్న భోజనములో పౌష్టికాహారము వండి పెట్టడం ఆనవాయితీగా ఉండేది. ఈ మధ్య కాలంలో మొన్న ఒక మండల కేంద్రంలో సమావేశం జరిగితే నేను అక్కడకు వెళ్ళాను. తల్లిదండ్రులకు 5 కేజీల బియ్యం, కేజీ కందిపప్పు, 1 లీటరు నూనెను సరఫరా చేస్తున్నామని చెప్పడం జరిగింది. నేను చాలా ఆశ్చర్యపోయాను. అక్కడ వంటచేసి పెట్టవలసిన చోట తల్లిదండ్రులకు ఇది ఏ రకమైన పౌష్టికాహారం అవుతుంది అధ్యక్షా? వీటిమీద పర్యవేక్షణ లేదు. చాలాచోట్ల అంగన్‌వాడీ ఉపాధ్యాయులు అక్కడకు వెళ్ళి ఉండడం లేదు. గౌరవ ముఖ్యమంత్రిగారు 'గోరుముద్దల కార్యక్రమం' అని పెట్టారు. అక్కడ ఏ ముద్దా లేనప్పుడు ఇక గోరుముద్దలు ఎక్కడ నుంచి వస్తాయి? కాబట్టి, దీని మీద తగు చర్యలు తీసుకోవలసిందిగా మీ ద్వారా గౌరవ మంత్రిగారిని కోరుతున్నాను. జిల్లాలలో చాలా వరకూ వీటి మీద ఎటువంటి పర్యవేక్షణా లేదు. గతంలోకన్నా ఇప్పుడు బాగా తగ్గింది.

శ్రీ పి.జె. చంద్రశేఖర రావు : (శాసనసభ నియోజక వర్గం) అధ్యక్షా, అంగన్‌వాడీ ఉపాధ్యాయుల, కేంద్రాలకు సంబంధించి మరియు అంగన్ వాడీకి సంబంధం లేనటువంటి జనాభా లెక్కలు లేదా పోలియో చుక్కలు, ఎన్నికలు నిర్వహించేటప్పుడు ఎన్నికల అధికారులుగా అంగన్ వాడీ సిబ్బందిని నియమించడం వలన ఈ కేంద్రాలలో ఉండే నిర్వహణ, నాణ్యతకు సంబంధించిన ప్రమాదాన్ని ప్రభుత్వం గుర్తించిందా? గుర్తిస్తే, సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల ప్రకారంగా వారికి కేవలం వారి విధులకే పరిమితం చేసే ప్రణాళిక ఏమైనా ఉందా? అంగన్‌వాడీలో పనిచేస్తున్న ఆయాలు, ఉపాధ్యాయులకు సంబంధించిన జీతాలు, సర్వీసు కండీషన్లకు సంబంధించిన విషయంలో, గతంలో గౌరవ మంత్రిగారు ఇచ్చిన వాగ్దానాలను తెలంగాణ రాష్ట్రంలో ఉన్న సిబ్బందికి వేతనాలను పరిష్కారం చేయడం జరిగింది. ఈ విషయంలో ఇప్పుడు మన ఆంధ్ర ప్రదేశ్‌కు సంబంధించిన ఆయాలు, ఉపాధ్యాయులు తీవ్రమైన ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ రోజు నుంచి వారందరూ నిరాహార దీక్షలు, పెద్ద కార్యక్రమాలు నిర్వహిస్తూ, రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టరు కార్యాలయాల వద్ద అనేక ఉద్రిక్త పరిస్థితులు నెలకొంటున్న సందర్భంలో గౌరవ మంత్రిగారు ఆ సమస్యలను పరిష్కరించే దిశగా ఏమైనా చర్యలు చేపడతారా అని మీ ద్వారా అడుగుతున్నాను.

శ్రీ ఎం.వి.ఎస్. శర్మ : (పట్టభద్రుల నియోజక వర్గం – శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్టణం) అధ్యక్షా, ఈ అంగన్‌వాడీ కేంద్రాలలో ఉన్నటువంటి వారికి పరిమితమైన, నిర్దిష్టమైన విధివిధానాలను

రూపొందించకుండా, ప్రభుత్వం ఎప్పుడు ఏ సంక్షేమ పథకాలు పెట్టినా, ఆధార్ కార్డు ఎన్‌రోల్‌మెంట్‌తో సహా, అన్నింటిని అమలు చేసే కార్యక్రమాలను వారికి ఎందుకు అప్పచెపుతున్నారు? అది స్త్రీ శిశు సంక్షేమ శాఖ కాన్‌కరెన్సుతో జరుగుతున్నదా? ఇక రెండవ అంశం – వారి వేతనాల చెల్లింపు, పెంపుల విషయంలో ఎందుకు జాప్యం జరుగుతోంది? పొరుగు రాష్ట్రాల వారికి వేతనాల పెంపు చేసిన తరువాత, ఇవతలి ప్రక్కన ఉన్న వారిలో చాలా తీవ్రమైన ఆందోళన కలుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వం ఎందుకు తాత్సారం చేస్తున్నది? పైగా వారిని ఎక్కడికక్కడ నిర్బంధానికి గురిచేసి, వారిని పోలీసు స్టేషన్లలో పెట్టించారు. కొన్ని వేల మంది కలెక్టరు కార్యాలయాలకు వెళ్ళినప్పుడు మహిళలను నిర్బంధించారు. మరి ఈ ప్రభుత్వం గత కాలంలోకి వెళ్ళదలుచుకున్నదా? గుఱ్ఱాలతో తొక్కించినటువంటి ఒక చీకటి చరిత్ర ఈ పార్టీకి ఉన్నది. మళ్ళా దానిని పునరావృతం చేయదల్చుకున్నారా అనేటటువంటిది మీ ద్వారా గౌరవ మంత్రిగారిని అడుగుతున్నాను.

డా. ఎం. గేయానంద్ ః (ఉపాధ్యాయ నియోజక వర్గం – కడప, అనంతపురం, కర్నూలు) అధ్యక్షా, ఒక ఆరు నెలలుగా మంత్రులు, ఉప ముఖ్యమంత్రి, అధికారుల దగ్గరకి మేమందరం వెళ్ళి వారికి చాలా తక్కువ వేతనాలు ఇస్తున్నారని, వాటిని మీరు రెవ్యూ చేసి, పెంచమని మేము అడుగుతున్నాము. చాలా సార్లు డెప్యూటీ చీఫ్ మినిష్టరు కే.ఈ. కృష్ణమూర్తి గారు ఒక సమావేశం ఏర్పాటు చేస్తే నేను, పి.జె. చంద్ర శేఖర రావు గారు అక్కడకు వెళ్ళి చర్చించినప్పుడు వాళ్ళ నాయకులు కూడా వచ్చారు. గ్రామ స్థాయిలో అనేక పనులు అంటే ప్రభుత్వానికి సంబంధించి మహిళా, స్త్రీ, శిశు సంక్షేమానికి ఏ పనులు ఇచ్చినా అవన్నీ చేస్తున్నారు. కనీసం వారి వేతనాలు రూ.10,000 వరకూ ఇవ్వమని కోరుతున్నారు. గత ప్రభుత్వంలో వీరి వేతనాలు పెంచడానికి ఒక ఫైలు నడిచి అప్పుడు ఉన్న ముఖ్యమంత్రిగారి వరకు వెళ్ళింది. అప్పుడున్న రాజకీయ పరిస్థితులలో ఆ ఫైలు ముందుకు రాలేదు. గవర్నెన్సు అనేది ఒక ప్రాసెస్. గతంలో ఏ ప్రాసెస్ నడిచిందో, ఆ ప్రాసెస్‌ను గౌరవించవలసిన బాధ్యత ఇప్పుడున్న ప్రభుత్వం మీద ఉందా లేదా? లేదంటే లేదని చెప్పండి. పై అంశాలకు సంబంధించి ఈ రోజు రాష్ట్ర అధ్యక్షులు గఫూర్, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుణ్యవతి నిరాహార దీక్షకు కూర్చుంటున్నారు. రేపు, 'ఛలో హైదరాబాదు' పేరుతో వేలాది మంది అంగన్‌వాడి కార్యకర్తలు హైదరాబాదుకు వస్తున్నారు. పై అంశాలను ఈరోజు ముఖ్య మంత్రిగారి దృష్టికి తీసుకు వెళ్ళి వారి వేతనాల అంశాలను సానుకూలంగా పరిశీలించి, వాటిని పరిష్కారం చేయడానికి గౌరవ మంత్రిగారు ఏ విధమైన చర్యలు తీసుకుంటారో చెప్పవలసిందిగా మీ ద్వారా మంత్రిగారిని కోరుతున్నాను.

శ్రీమతి పీతల సుజాత ః అధ్యక్షా, గౌరవ సభ్యులు శ్రీ మహ్మద్ జానీ గారు వేసిన ప్రశ్న వేరేది, అయినా నేను సమాధానం చెపుతాను.

డా. ఎం. గేయానంద్ ః (మైకు లేదు) వేరేది ఎందుకవుతుందమ్మా? అది అంగన్‌వాడీ కేంద్రాలకు సంబంధించింది కాదా? మీరు సమాధానం చెప్పవలసిందే. Sir, this is objectionable. This is not a concession from the Minister.

శ్రీమతి పీతల సుజాత ః అధ్యక్షా, ఆయన జీతాలకు సంబంధించి వేరే ప్రశ్న రూపంలో వస్తే, నేను సమాధానం చెపుతాను. అయినా, ఇప్పుడు కూడా చెపుతాను, కంగారు పడవద్దు. సార్, గౌరవ సభ్యులు శ్రీ మహ్మద్ జానీ గారు అడిగిన ప్రశ్నకు మేము సూపర్ వైజర్లతో ఎప్పుడూ పర్యవేక్షిస్తున్నాము. పొరుగు రాష్ట్రంలో వేతనాలు పెంచారని అన్నారు, తప్పకుండా దానికి కూడా ప్రయత్నం చేస్తాము. మరొక అంశం ఏమిటంటే సభ్యులు శ్రీ ఎం.వి.ఎస్. శర్మగారు గుఱ్ఱాలతో త్రొక్కించారని అన్నారు, ఆ పదాలను విత్‌డ్రా చేసుకోవాలి.

శ్రీ ఎం.వి.ఎస్. శర్మ ః (మైకు లేకుండా) తొక్కించారు, అది చరిత్ర. చరిత్రని మనం మార్చలేము. మన కోరికలను బట్టి చరిత్ర మారిపోదు సార్.

శ్రీమతి పీతల సుజాత ః ఇది కాంట్రవర్షల్ అండి, విత్‌డ్రా చేసుకోవలసిందిగా కోరుతున్నాను.

శ్రీ ఎం.వి.ఎస్. శర్మ ః ఇది విత్‌డ్రా చేసుకోవలసిన సమస్యే లేదు. ఇది చరిత్ర. అంగన్ వాడీ మహిళలను గుర్ఱాలతో త్రొక్కించారు. విత్ డ్రా ఎలా చేసుకుంటాం? It is the History. మీకు చరిత్ర తెలియకపోతే, తెలుసుకోండి.

శ్రీమతి పీతల సుజాత ః అధ్యక్షా, గౌరవ సభ్యులు శ్రీ పి.జె. చంద్రశేఖర రావు అడిగిన ప్రశ్నకు సంబంధించి చూసినట్లయితే, అంగన్‌వాడీ కార్యకర్తలను జనాభా లెక్కలకు, బిపిఎల్ సర్వేలు, ఇతరత్రా వారితో చేయిస్తున్నామని అన్నారు, వారికి జీతాలు పెంచే విషయం కూడా డా. గేయానంద్ గారు ప్రశ్న వేయడం జరిగింది. వీరిద్దరి ప్రశ్నలు ఒకటే సార్. అయితే, వారికి ప్రభుత్వం జీతాలు పెంచాలి. ప్రస్తుతం మనకున్న బడ్జెట్ రీత్యా పెంచుదామని గత అసెంబ్లీలో కూడా చెప్పాము. ఇప్పుడు కూడా అదే మాట చెపుతున్నాను. మన రాష్ట్రాలు కలిసి ఉన్నప్పుడు సర్‌ప్లస్ అమౌంట్ ఎంత ఉంది, విడిపోయిన తరువాత ఎంత ఉన్నదనేది మీ అందరికీ తెలిసిన విషయమే. పొరుగు రాష్ట్రం చిన్నది, మనది పెద్ద రాష్ట్రం. వారి జనాభా, మన జనాభా ఎంత ఉంది? మనకున్న ఆదాయ వనరులు చాలా డెఫిసిట్‌లో ఉన్నాయి. వారికి సర్‌ప్లస్ ఉండి చేస్తున్నారు. అయినప్పటికీ మనం అంగన్‌వాడీ కార్యకర్తలను గౌరవిస్తున్నాం. ఎందుకంటే, వాళ్ళు చాలా కష్టపడుతున్నారు. మేము కూడా వారి వేతనాలను పెంచాలని, మన రాష్ట్ర పరిస్థితి ఈ విధంగా ఉన్నదని, కేంద్ర మంత్రి శ్రీమతి మేనకా గాంధీగారితో కూడా రిక్వెస్టు చేసి చెప్పడం జరిగింది. వారి జీతాల విషయం తప్పకుండా గౌరవ ముఖ్యమంత్రిగారి దృష్టికి తీసుకువెళ్ళి వాటిని కూడా పెంచే ప్రయత్నం చేస్తామని తెలియజేస్తున్నాము.

గౌరవ సభ్యురాలు శ్రీమతి పమిడి శమంతకమణిగారు అడిగిన ప్రశ్నకు సంబంధించి పౌష్టికాహారం గతంలో వండి పెట్టేవారని అన్నారు. ప్రస్తుతం మనకు టేక్‌హోం రేషన్ ఇస్తున్నారు. వీటిని సుమారు 153 ప్రాజెక్టులలో అమలుచేస్తున్నాం. బియ్యం 3 కిలోలు, పప్పు 1 కిలో, నూనె అర లీటరు, గుడ్లు 16 చొప్పున నెలవారీ తల్లులకు టేక్ హోం రేషన్ ద్వారా అందజేస్తున్నాం. మనకు సుమారు 257 ఐసిడిఎస్ ప్రాజెక్టులు ఉన్నాయి. పిల్లలకు కూడా గుడ్లు, పాలు, ఆకు కూరలు మొదలైనవన్నీ కేంద్రాలలోనే ఆహారాన్ని వండిపెట్టడం జరుగుతోంది. ఐసిడిఎస్ ప్రాజెక్టులు 'అన్న అమృత హస్తం' ద్వారా నడుపబడుతున్నాయి. అక్కడ గర్భవతులు, పాలిచ్చే తల్లులు అందరికీ పై ఆహారం అందించబడుతోంది. వారందరికీ కెలోరీసు, ప్రోటీన్లతో కూడిన పోషకల విలువలు గల పౌష్టికాహారం అందించే ప్రయత్నం చేస్తున్నామని తమ ద్వారా గౌరవ సభ్యులకు తెలియజేస్తున్నాను. ప్రస్తుతం మాకు ఉన్న ఇబ్బందులనన్నింటిని అధిగమించి, గౌరవ సభ్యులు అడిగిన ప్రశ్నలకు సంబంధించి వారు అడిగినవన్నీ చేయడానికి ప్రయత్నిస్తాము. ఇందుకోసం గౌరవ సభ్యుల సహాయసహకారాలు అందిస్తే మరింత మెరుగైన ప్రయత్నాలుచేస్తామని తమ ద్వారా తెలియజేస్తున్నాను.

డా. ఎం. గేయానంద్ ః సార్, దయచేసి, మేము అడిగిన ప్రశ్నలకి గౌరవ మంత్రిగారి నుంచి స్పష్టమైన సమాధానం రాలేదు.

(పై మాటలు అంటూ, ఆయన పోడియం వద్దకు వచ్చారు.)

గత ఆరు నెలలుగా పై విషయం ఉంటే, మంత్రిగారు ఇప్పుడు ప్రయత్నం చేస్తామని అంటున్నారు. ఇది ఎలా కరక్టు అవుతుంది? ఇది అబ్జక్షనబుల్. ఈ విషయం మీద ఒక స్పష్టమైన జవాబు కావాలి. వారు ప్రయత్నం చేస్తామని అన్నారు. ఈరోజు ఈ విషయాన్ని తేల్చి చెప్పాలి సార్.

(ఈ దశలో సభ్యులు శ్రీ పి.జె. చంద్రశేఖర రావు పోడియం వద్దకు వచ్చి మాట్లాడారు.)

శ్రీ పి.జె. చంద్రశేఖర రావు : అధ్యక్షా, ఆరు నెలల నుంచి కన్సిడర్ చేస్తామని అంటూనే ఉన్నారు, ఇప్పుడు ప్రశ్న వస్తే స్పష్టమైన సమాధానం రాకపోతే ఎలా?

డా. ఎం. గేయానంద్ : ఇప్పటికీ మాకు స్పష్టంగా ఏమి హామీ ఇస్తారు? వాళ్ళు కనీస వేతనం రూ.10,000లు అడుగుతున్నారు.

శ్రీ పి.జె. చంద్రశేఖర రావు : గౌరవ మంత్రివర్యులు ఇక్కడ ఇచ్చినటువంటి హామీని ఆచరణలో చూపించే దానిలో తీవ్రమైన నిర్లక్ష్యం చేస్తున్నారు.

డా. ఎం. గేయానంద్ : సార్, చాలా స్పష్టంగా చెప్పాలి. మంత్రిగారు ప్రయత్నం చేస్తామని అంటు న్నారు. ఇంత పెంచుతామని చెప్పమనండి సార్. ఇది అసాధారణమైన పరిస్థితి. సార్. మాకు స్పష్టమైన సమసాధానం కావాలి.

శ్రీ పి.జె. చంద్రశేఖర రావు : గౌరవ మంత్రిగారు మామూలుగా చెపుతున్నారు? At the age of 60, people are sitting on hunger strike. గత ఆరు నెలల క్రితం ఏ విషయం చెప్పారో, ఇప్పుడు మంత్రి గారు అదే విషయం చెపుతున్నారు.

MR. CHAIRMAN: Please go to your seats.

(గౌరవ సభ్యులు పోడియం నుంచి తమ తమ స్థానాలలోకి వెళ్ళి కూర్చున్నారు.)

ఉ. 11.00

డా.ఎం.గేయానంద్: అధ్యక్షా, మంత్రి గారి సమాధానం సంతృప్తికరంగా లేదు. ఆరు నెలలుగా ఈ విషయాన్ని నాన్చుతూ, ఇప్పుడు ప్రయత్నం చేస్తామని అంటున్నారు. ఇది అబ్జెక్షనబుల్ సార్. ఇది ఎంతవరకు సబబు? (మైకు లేదు)

శ్రీ ఎం.వి.ఎస్.శర్మ: మంత్రి గారూ.. అంగన్‌వాడీ సంఘాల నాయకులను పిలిచి కూర్చోబెట్టి మీరు మాట్లాడొచ్చు కదా? (మైకు లేదు)

డా.ఎం. గేయానంద్: ఈ విషయం మీద స్పష్టమైన జవాబు కావాలి. మంత్రి గారు ప్రయత్నం చేస్తామన్నారు. అది స్పష్టంగా ఈ రోజు వారు తేల్చి చెప్పాలి. (మైకు లేదు)

మిస్టర్ ఛైర్మన్: కన్సిడర్ చేస్తామని మంత్రి గారు చెప్పారు కదా?

శ్రీ పి.జె.చంద్రశేఖర రావు: సార్, వాళ్లు ఆరు నెలల నుండి కన్సిడర్ చేస్తామని చెబుతూనే ఉన్నారు. ప్రశ్న వచ్చిన తరువాత కూడా సరైన సమాధానం రాకపోతే ఎలా? (మైకు లేదు)

(ఈ సందర్భంలో సభ్యులు డా.ఎం.గేయానంద్ గారు తమ స్థానం విడిచి ఛైర్మన్ పోడియం వద్దకు వచ్చారు)

డా.ఎం.గేయానంద్: స్పష్టంగా వాళ్లకు మీరు ఏం హామీ ఇస్తారో చెప్పండి. వాళ్లంతా కనీసం రూ.10,000/- వేతనం అడుగుతున్నారు. (మైకు లేదు)

శ్రీ పి.జె. చంద్రశేఖర రావుః సార్, గౌరవ మంత్రివర్యులు వారిచ్చిన హామీలను ఆచరణలో చూపించే విషయంలో తీవ్రమైన నిర్లక్ష్యం చేస్తున్నారు. (మైకు లేదు)

డా.ఎం.గేయానంద్ః వాళ్లు మొదట ఈ విషయం చెప్పాలి సార్. వాళ్లు ప్రయత్నం చేస్తామని చెబుతున్నారు. ఏం ప్రయత్నం చేస్తారో స్పష్టంగా చెప్పమనండి సార్. వాళ్లకు ఇంతిస్తాము, ఇంత పెంచుతామని స్పష్టంగా చెప్పమనండి సార్. (మైకు లేదు)

శ్రీ పి.జె. చంద్రశేఖర రావుః సార్, గౌరవ మంత్రి గారు ఎంతో క్యాజువల్‌గా చెబుతున్నారు. (మైకు లేదు)

డా.ఎం.గేయానంద్ః ఇది ఒక అసాధారణమైన పరిస్థితి సార్. (మైకు లేదు)

శ్రీ పి.జె.చంద్రశేఖర రావుః అంగన్‌వాడీలందరూ వచ్చి దీక్షలో కూర్చుంటున్నారు. At the age of 60 years, people are sitting on hunger strike. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వం నుండి పాజిటివ్ సమాధానం రాకపోతే ఎలా? (మైకు లేదు)

MR.CHAIRMAN: You please, go to your respective seats. Now, the Minister will answer.

డా.ఎం.గేయానంద్ః లేదు సార్. మంత్రి గారు జవాబు చెప్పాలి. (మైకు లేదు)

శ్రీ పి.జె.చంద్రశేఖర రావు : ఆరు నెలల క్రితం ఏ విషయమైతే మంత్రి గారు చెప్పారో, అదే విషయాన్ని ఇప్పుడు కూడా చెబుతున్నారు. (మైకు లేదు)

మిస్టర్ ఛైర్మన్ : రైట్ సార్...

శ్రీమతి పీతల సుజాత : సార్, గౌరవ సభ్యుల ఆవేదనని అర్థం చేసుకున్నాను. మాక్కూడా ఆవేదన ఉంది.

శ్రీ సి.రామచంద్రయ్య : (శాసనసభ నియోజక వర్గం)  సార్, ఒక సప్లిమెంటరీ అడిగేందుకు, should I draw your attention continuously. I cannot understand. I am not habitually putting this supplementary question. ఇంపార్టెంట్ ఇష్యూస్‌లో ఇంటర్వీన్ అవుతామంటే, మీరు అవకాశమివ్వరు. I don’t know the reasons.

MR.CHAIRMAN: Ramachandraiah Garu I am seeing.

SRI.C.RAMACHANDRAIAH: No Sir. You have agreed. I have been observing you. నేను ఒక ఇంపార్టెంటు ఇష్యూ మంత్రి గారి దృష్టికి తీసుకువద్దామంటే, కుదరడం లేదు.

శ్రీమతి పీతల సుజాతః అధ్యక్షా, నేను గతంలోనే చెప్పాను. మేము గౌరవ సభ్యుల ఆవేదనని అర్థం చేసుకున్నాము. మాక్కూడా వాళ్లకి న్యాయం చేయాలన్న ఆలోచన ఉంది. ఆ ఆలోచన ఇప్పుడుంది, అప్పుడుంది, ఎప్పుడూ ఉంటుందని సభాముఖంగా తెలియజేస్తున్నాను. అయితే, మనకు లోటు బడ్జెట్ ఉన్న రీత్యా చాలా కష్టాలున్నాయి. ఆ విషయం వేరే చెప్పక్కర్లేదు. సభ్యులందరికీ కూడా తెలుసు. తెలంగాణాలో సర్ప్లస్ బడ్జెట్ ఉంది. మనకు డెఫిసిట్ బడ్జెట్ ఉంది. వాళ్లు వేతనాలు పెంచారు కదా అని, మనం కూడా పెంచేస్తే, ఈ బడ్జెట్ లోటుని ఎట్లా పూడ్చాలి?

డా.ఎం.గేయానంద్ః ఇప్పుడు తెలంగాణా వాళ్లు వేతనాలు పెంచారని మేము అడగడం లేదమ్మా. ఆరు నెలల నుండి వేతనాలు పెంచాలని అడుగుతూనే ఉన్నాం కదా? అందువల్ల, దానికీ, దీనికి సంబంధం లేదు. వాళ్ల ప్రస్తావనే మేము తేవడం లేదు. (మైకు లేదు)

శ్రీమతి పీతల సుజాతః అధ్యక్షా, రాష్ట్రంలో చాలా ఇబ్బందికర పరిస్థితులున్నాయి. మీరు తెలంగాణా గవర్నమెంట్, ఏపీ గవర్నమెంట్ అని కంపేర్ చేస్తున్నారు. అది కరెక్టు కాదు. కానీ, మా వంతు ప్రయత్నంగా ఎంతో కొంత పెంచాలని గౌరవ ముఖ్యమంత్రి గారు చిత్తశుద్ధితో ఉన్నారు. మీరు ఎవరొస్తారో రండి. మిమ్మల్ని గౌరవ ముఖ్యమంత్రి గారి వద్దకు తీసుకువెళ్లి మాట్లాడించి తప్పకుండా నేను ప్రయత్నం చేస్తాను. మీరే మాట్లాడుదురు గాని రండి.

డా.ఎం.గేయానంద్ః సార్, ఇది మేం మాట్లాడే విషయం కాదు. ఆరు నెలలుగా మాట్లాడుతూనే ఉన్నాము. (మైకు లేదు)

శ్రీ సి. రామచంద్రయ్యః అధ్యక్షా, ఒక్క నిమిషం. మంత్రి గారు అన్నారు కాబట్టి, ఒక్క విషయం మీ దృష్టికి తీసుకువస్తున్నాను. ఇప్పుడు మినిస్టర్ గారు రిప్లై ఇచ్చారు. వారు కేంద్ర మంత్రిని కలిసి ఫండ్స్ ఇంక్రీజ్ చేయమని రిక్వెస్ట్ చేశామన్నారు. కేంద్ర ప్రభుత్వం వారు సుమారు 30 ప్రాజెక్టులు స్క్రాప్ చేయడానికి ఆల్‌రెడీ డెసిషన్ తీసుకున్నారు. దాన్లో రియాక్షన్ వస్తుందని, 80 ఈ సంవత్సరం ఇంప్లిమెంట్ చేస్తున్నారు. అందులో సర్వశిక్షా అభియాన్, ఐసీడీఎస్, మధ్యాహ్న భోజన పథకం వంటివన్నీ ఉన్నాయి. నేను కేంద్ర బడ్జెట్ కేటాయింపుల్లో వేటికెంత తగ్గించారనేది మొత్తం చదివాను. అటువంటి పరిస్థితుల్లో ఏ విధంగా కేంద్రం వాళ్లు మీకు సహకరిస్తారనే విషయాన్ని చెప్పేందుకే నేను ఇంటర్వీన్ అయ్యాను. సార్, ఎప్పుడైనా నేను ఇంటర్వీన్ అయ్యానంటే, చాలా సబ్జెక్టు ఉంటేనే అవుతాను తప్ప, లేకపోతే కాను. Moreover, even as a Member I am entitled to intervene, but not as a Leader of Opposition.

శ్రీ ఎం.వి.ఎస్.శర్మ ః సార్, ఒక్క విజ్ఞప్తి. రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడీల ఆందోళనలు కొనసాగుతున్నాయి. ఇష్యూ చాలా సీరియస్‌గా ఉంది. ముఖ్యమంత్రి గారి పిఏని నేను రిక్వెస్ట్ చేశాను. ఆ ఉద్యోగ సంఘ నాయకులతో ఒక విజ్ఞాపనా పత్రం ఇప్పించడానికి సాధ్యమౌతుందా అని అడిగితే, సాధ్యం కాదని వారు చెప్పారు. కాబట్టి, మంత్రి గారు ఆ ఉద్యోగ సంఘాలతో చర్చించి, ఆందోళన నివారించడానికి ప్రయత్నం చేయాలి కదా? అసలు వాళ్లని చర్చలకే పిలువరు. ప్రభుత్వం అంత పట్టుదలగా ఉండాల్సిన అవసరమేముంది? వాళ్లని పిలిచి మీతో మాట్లాడతామంటే, వాళ్లకు ఇంత ఆందోళన ఎందుకుంటుంది? ప్రభుత్వానికి డెమొక్రటిక్ అప్రోచ్ ఎందుకు ఉండటం లేదు. మీరు ఉద్యోగ సంఘాల వారిని ముఖ్యమంత్రి గారి వద్దకు తీసుకువెళతామని చెబుతున్నారు. ఇవేళ మధ్యాహ్నమే ఏమన్నా తీసుకువెళతారేమో చెప్పండమ్మా. మధ్యాహ్నమే వాళ్లని తీసుకొస్తాము. ఇందులో మాకు ప్రత్యేకమైన ప్రయోజనమేదీ లేదు. రాష్ట్రంలో ప్రశాంతమైన వాతావరణముంటే, సంఘాలు బాగా నడుస్తాయి. అందులో మాకు ఒనగూరే ప్రయోజనమేముంటుంది?

శ్రీమతి పీతల సుజాతః సార్, ఇప్పుడే, మధ్యాహ్నమే సంఘాల వారిని ముఖ్యమంత్రి గారి వద్దకు తీసుకువెళ్లాలంటే కొంచెం ఆలోచించాలి. సంఘాల వారు కాకుండా, సభ్యులు ఎవరైతే మాట్లాడుతున్నారో వాళ్లను రమ్మనండి. వీలు చూసుకుని ముఖ్యమంత్రి గారితో తప్పకుండా మాట్లాడిస్తాము.

శ్రీ ఎం.వి.ఎస్.శర్మః మేము సీఎం గారి దగ్గరకు వచ్చి మాట్లాడాల్సిన పని లేదమ్మా. ఆ సంఘాల వాళ్లు వస్తే, వాళ్లని తీసుకువెళ్లి మాట్లాడించండి. ఆందోళన చేస్తున్నది వాళ్లు. లేదు, ముఖ్యమంత్రి గారి వద్దకు సంఘాల వాళ్లని తీసుకువెళ్లక్కర్లేదంటే, ఇంక వాళ్ల పద్ధతిలో వాళ్లు కొనసాగుతారు. (మైకు లేదు)

శ్రీమతి పీతల సుజాతః అంటే, మీరు సంఘాల వాళ్లని దీక్షలు చేయమని చెబుతారా?

శ్రీ ఎం.వి.ఎస్.శర్మః చెబుతామండీ. సంఘాలతో చర్చలు జరుపమని చెబుతాము. That is our perennial right. That is a part of Law. " మేము చట్టాన్ని గౌరవించము" అని మీరు చెప్పండి. అప్పుడు చూద్దాం.(మైకు లేదు)

డా.ఎం.గేయానంద్ః ఇదేమిటి సార్? ఒక కామన్ సిటిజన్ అడిగితే, మినిస్టర్ గారు మాట్లాడటం కుదరదా? ఇది ఎట్లా సార్? సంఘాల వాళ్లతో మాట్లాడము అని అంటున్నారేమిటి సార్? సంఘాల వాళ్లని పిలిచి మాట్లాడాలి. ఇంతకంటే డెమోక్రసీ లేకపోవడం ఏమన్నా ఉంటుందా? వేల మందికి సంబంధించిన సంఘాల వాళ్లతో మీరు మాట్లాడండి అనంటే, మేము మాట్లాడము అనంటారేమిటి? (మైకు లేదు)

శ్రీమతి పీతల సుజాతః మేము వాళ్లతో మాట్లాడటానికి సిద్ధంగా ఉన్నామండీ. మీరు తప్పుగా అర్థం చేసుకుంటున్నారు.

మిస్టర్ ఛైర్మన్ః ఒక్కటేమంటే, మీతో ప్రిలిమినరీ డిస్కషన్ చేసిన తరువాత, వాళ్లతో మాట్లాడతామంటున్నారు.

డా.ఎం.గేయానంద్ః ఆరు నెలలుగా మేము ఈ విషయాల్ని డిఫరెంట్ ఫోరమ్స్‌లో రెయిజ్ చేస్తున్నాము. ఇదేమిటి సార్? (మైకు లేదు)

శ్రీ పి.జె.చంద్రశేఖర రావుః సంఘాల వాళ్లతో మాట్లాడుకుంటే పోయేదానికి ఇంకా ప్రిలిమినరీ ఏముంది? (మైకు లేదు)

శ్రీ ఎం.వి.ఎస్.శర్మః వాళ్లిరువురూ తేల్చుకోలేకపోతే, మేం మధ్యవర్తిత్వం చేయిస్తాము. వాళ్లూ-వాళ్లూ తేల్చుకుంటే, మధ్యలో మేమెందుకు అసలు? మా జోక్యం ఎందుకు? (మైకు లేదు)

శ్రీమతి పీతల సుజాతః ఫస్ట్ మీతో మాట్లాడిన తరువాత, సంఘాల వాళ్లతో తప్పకుండా మాట్లాడతానండీ.

శ్రీ పి.జె.చంద్రశేఖర రావుః మంత్రి గారు మమ్మల్ని రమ్మంటే తప్పకుండా వస్తాము. కానీ, చర్చించాల్సింది సంఘాల వాళ్లు. మేము అవసరం లేదు. మీరు సాయంగా రమ్మంటే వస్తాము. (మైకు లేదు)

మిస్టర్ ఛైర్మన్ః చంద్రశేఖర రావు గారూ.. మొదట మీతో ప్రిలిమినరీ డిస్కషన్ చేసిన తరువాత, సంఘాల వారితో మాట్లాడతామని మంత్రి గారు చెబుతున్నారు.

శ్రీ పి.జె.చంద్రశేఖర రావుః మేమేమీ డిస్కషన్ చేయం సార్. ఎందుకంటే, సంఘాల వాళ్ల ఆబ్సెన్స్‌లో మేమేం మాట్లాడతాము. (మైకు లేదు)

మిస్టర్ ఛైర్మన్ః ప్రిలిమినరీ డిస్కషన్ అండీ. తరువాత వాళ్లతో కూడా మాట్లాడతామన్నారు కదా?

శ్రీ పి.జె.చంద్రశేఖర రావుః వాళ్ల ఆబ్సెన్స్‌లో వాళ్ల విషయాలు, ప్రభుత్వంతో మేము ఎలా మాట్లాడతాము సార్? (మైకు లేదు)

శ్రీమతి పీతల సుజాతః మీరు మాట్లాడమంటే వాళ్లతో నేరుగా, నేనే మాట్లాడతానండీ. కానీ, మిమ్మల్ని గౌరవించి మీ ద్వారా వాళ్లతో మాట్లాడదామని అనుకుంటున్నాను. డైరెక్టుగా మాట్లాడమంటే, నేనే మాట్లాడతాను సార్. నో ప్రాబ్లెం.

శ్రీ పి.జె.చంద్రశేఖర రావుః కాదు మేడమ్. టైం చెబితే వాళ్లని తీసుకుని మీ వద్దకు వస్తాము. (మైకు లేదు)

శ్రీమతి పీతల సుజాతః వాళ్ల సమస్యని మీ ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చారు కాబట్టి, మీకు వాళ్ల దగ్గర వెయిట్ ఉంటుందనే ఉద్దేశంతో మీతో పాటు, వాళ్లతోనూ మాట్లాడదామని అనుకున్నాను.

MR.CHAIRMAN: We have to wait for sometime. The issue is on the Floor of the House. Okay, leave it. Now, I will take up Question No.8108.

**ఖనిజం, ముడి ఖనిజాల త్రవ్వకం**

ప్రశ్న నెం.8108

శ్రీమతి పి.శమంతకమణి, ఎం.ఎల్.సి.,

గౌరవనీయులైన మహిళాభ్యుదయం, శిశు సంక్షేమం, గనులు మరియు భూగర్భ శాఖ మంత్రి గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా?

అ) రాష్ట్రంలో కొత్తగా కనుగొన్న ఖనిజాలు మరియు ముడి ఖనిజాల గనుల రకాల జిల్లా వారీ వివరాలు ఏమిటి?

ఆ) వాటిని వెలికితీయడం కోసం టెండర్లను పిలవడమయిందా?

ఇ) అయితే, ఆ వివరాలు ఏమిటి?

గౌరవనీయులైన మహిళాభ్యుదయం, శిశు సంక్షేమం, గనులు మరియు భూగర్భ శాఖ మంత్రి (శ్రీమతి పీతల సుజాత):

అ) లేదండీ. రాష్ట్రంలో ఇటీవలి కాలంలో ఎటువంటి కొత్త ఖనిజాలు, ముడి ఖనిజాలను కనుగొనలేదు.

ఆ) ఈ ప్రశ్న ఉత్పన్నం కాదు.

ఇ) ఈ ప్రశ్న ఉత్పన్నం కాదు.

శ్రీమతి పి.శమంతకమణిః అధ్యక్షా, అనంతపురం జిల్లాలో ఏ, ఏ ఖనిజాలు ఎన్ని హెక్టార్లలో ఆవరించి ఉన్నాయో ఆ వివరాలు కావాలి. అందులో వినియోగంలో ఉన్న ఖనిజాల వివరాలను మంత్రి గారు దయచేసి తెలపవలసిందిగా కోరుతున్నాను.

శ్రీమతి పీతల సుజాతః అధ్యక్షా, ముఖ్యమైన ఖనిజాల వివరాల్లోకి వెళితే, అనంతపురం జిల్లాలో క్వార్ట్జ్ ఉంది. ఇది కర్నూలు, అనంతపురం, చిత్తూరు, నెల్లూరు, ప్రకాశం, గుంటూరు, విశాఖపట్నంలలో ఉంది. 209 మిలియన్ టన్నులతో మొదటి స్థానంలో ఉంది. లైమ్‌స్టోన్ విషయానికి వస్తే, కర్నూలు, కడప, అనంతపురం, గుంటూరు, కృష్ణా జిల్లాల్లో ఉంది. 21379.82 మిలియన్ టన్నులతో దేశంలోనే మొదటి స్థానంలో ఉంది. అదేవిధంగా చూస్తే, రాష్ట్రంలో కాల్సైట్ పెద్దగా లేదు. డైమండ్స్ అనేవి కూడ ఉన్నాయి గానీ, అవి కూడా పూర్తి స్థాయిలో బయటపడలేదు. ముఖ్యంగా చూస్తే, లైమ్‌స్టోన్ మొదటి స్థానంలో ఉంది. క్వార్ట్జ్ కూడా మొదటి స్థానంలో ఉంది.

శ్రీమతి పి.శమంతకమణిః అధ్యక్షా, అనంతపురం జిల్లాలో..

మిస్టర్ ఛైర్మన్ః సింగిల్ సప్లిమెంటరీ అడగండీ.

శ్రీమతి పి.శమంతకమణిః అవును అధ్యక్షా. ఇది అసలైనది. కోట్ల రూపాయల ఆదాయాన్ని సమకూర్చే ప్రశ్న ఇది. ప్రభుత్వానికి కోట్ల రూపాయల ఆదాయమొస్తుంటే ఎందుకు అడగకూడదు? అధ్యక్షా, అనంతపురం జిల్లా కరువు జిల్లానే అయినప్పటికీ, అపారమైన ఖనిజ సంపద అక్కడ ఉంది. ఇసుక మొదలుకుని ఇనుప ఖనిజం వరకు, విలువైన బంగారం, వజ్రాల వరకు నిక్షిప్తమైన జిల్లా అనంతపురం జిల్లా. వజ్రకరూరు అనేది వజ్రాల అన్వేషణలో ఉంది. వజ్రాలకు సంబంధించి కేంద్రం అక్కడ ఒక సెంటరును

కూడా పెట్టడం జరిగింది. రామగిరిలో గోల్డ్ మైన్స్ ఉన్నాయి. ఇసుక నుండి ఇనుప ఖనిజాల వరకు మా జిల్లాలో లభ్యమౌతుంటే, కేవలం ఒక్క క్వార్ట్జ్ వరకు మాకు చూపిస్తే ఎట్లా? అంతేకాదు. శోచనీయమైన విషయమేమంటే, డిపార్టుమెంటుకు సొంత భవనం లేదు. మారుమూల గల్లీలో పెట్టుకున్నారు. కోట్లాది రూపాయల ఆదాయం వచ్చే ఆ శాఖ కార్యాలయం ప్రజలకు అందుబాటులో లేకుండా ఎక్కడో పెట్టుకున్నారు. ఎందుకు అలా చేశారంటే, ప్రజలందరూ వచ్చి అడుగుతారని. ఒక మైన్ గురించి సామాన్య ప్రజానీకం వచ్చి అప్లికేషన్ పెట్టుకునేందుకు కూడా వీలు లేదు. ఏమంటే అనంతపురంలో ఒక గల్లీలో ఒక బ్రాంచి పెట్టారు. గుత్తిలో ఒక బ్రాంచి, తాడిపత్రిలో ఒక బ్రాంచి పెట్టారు.

ఉ. 11.10

అనంతపురంలో జిల్లా హెడ్‌క్వార్టర్‌లో ఒక పెద్ద కార్యాలయం పెడితే దానికి సంబంధించి సమాధానం చెప్పే నాథుడే లేడు. మొన్ననే పల్లె రఘునాథరెడ్డిగారు నిర్వహించిన ఒక సమీక్షా సమావేశంలో ఆ ప్రభుత్వశాఖవారు ఇచ్చిన సమాధానాలు చూసి ఆయన అసంతృప్తిచెంది జిల్లా కలెక్టర్‌గారిని విచారణ చేపట్టమని చెప్పడం జరిగింది. కరువుజిల్లా అయిన అనంతపురం జిల్లాలో చాలా ఖనిజపు గనులున్నాయి. వాటిని ఔత్సాహికులైనవాళ్ళకి ఎందుకివ్వకూడదు. అక్కడ పరిశోధన, పర్యవేక్షణలేదు. ఇది చాలా శోచనీయమైన విషయం.

శ్రీమతి పీతల సూజాతః గౌరవ సభ్యురాలు అనంతపురం జిల్లాగురించి ప్రశ్నరూపకంగా అడిగి ఉంటే వివరణాత్మకమైన సమాధానం చెప్పడానికి అవకాశముంటుంది. అయినప్పటికీకూడా కొంతవరకు సమాధానం చెప్పడానికి ప్రయత్నిస్తాను. అనంతపురంజిల్లాలో బంగారు ఖనిజం 13.74మిలియన్ టన్నులు, డైమండ్స్ 32000క్యారెట్స్, డోలమైట్ 1182మిలియన్ టన్నులు, ఇనుప ఖనిజం 1463మిలియన్ టన్నులు, మాగ్నటైట్ 381మిలియన్ టన్నులు ఉన్నాయి. అయితే కేలసైట్ ఇంకా బయటపడలేదు. అయితే గౌరవ సభ్యురాలు అనంతపురం ఖనిజ వివరాలకు సంబంధించి వేరే ప్రశ్న రూపంలో అడిగితే పూర్తి సమాధానం చెప్పడానికి అవకాశముంటుంది. అలాగే అనంతపురంజిల్లా త్రాగునీటికి కూడా ఇబ్బంది పడుతోంది. పెద్ద, చిన్న ఖనిజపుగనులు అక్కడున్నాయి కాబట్టి అనంతపురం జిల్లాను మంచినీటితోపాటు అన్ని రంగాలలో కూడా అభివృద్ధి చెందిన జిల్లాగా తీర్చిదిద్దడానికి గౌరవ ముఖ్యమంత్రిగారు ఏకైక లక్ష్యంగా పెట్టుకున్నారు. కనుక వారి లక్ష్యాన్ని, కోరికను తీర్చడానికి మా శాఖద్వారా కూడా సహాయ, సహకారాలను అందిస్తామని తెలియజేస్తున్నాను.

శ్రీమతి పమిడి శమంతకమణిః అధ్యక్షా, మంత్రిగారు ఎలాంటి ప్రకటనలు ఇవ్వరు. సంబంధిత శాఖ తరఫున ఈ సౌకర్యాలున్నాయి, ఇవి ప్రజలకు అందుబాటులో ఉంటాయి, మీరు ఈ విధంగా దరఖాస్తు పెట్టుకోండని ఒక్క ప్రకటనకూడా లేదు.

## నిత్యావసర వస్తువుల ధరలు

ప్రశ్న నెం. 59 (8112)

శ్రీ సి.రామచంద్రయ్య, ఎం.ఎల్.సి.

గౌరవనీయులైన ధరల పర్యవేక్షణ, వినియోగదారు వ్యవహారాలు, ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా?

అ) నిత్యావసర సరుకుల ధరల నియంత్రణ కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్న విషయం వాస్తవమేనా?

ఆ) అయితే, ఆ వివరాలు ఏమిటి?

గౌరవనీయులైన ధరల పర్యవేక్షణ, వినియోగదారుల వ్యవహారాలు, ఆహార, పౌరసరఫరాల శాఖమంత్రి (శ్రీమతి పరిటాల సునీతమ్మ):

అ) అవునండీ.

ఆ) ధరలను నియంత్రించటానికి తీసుకున్న చర్యలు

(i) ధాన్యం, బియ్యం, పప్పు ధాన్యాలు, వంట నూనె గింజలు, వంట నూనెల విషయంలో మిల్లర్లు, ట్రేడర్లను లైసెన్సింగు విధానం, నిల్వ పరిమితుల పరిధి క్రిందకు తీసుకురావడమయింది.

(ii) నిర్దేశించిన నిల్వ పరిమితులకు విరుద్ధంగా దాచి వుంచిన నిత్యావసర సరకుల నిల్వలను వెలికి తీయడానికి, వాటిని జప్తు చేసి భరించదగ్గ ధరల చొప్పున రాష్ట్రంలోని బహిరంగ మార్కెటులో వాటిని లభ్యంగా వుంచేందుకు తాత్కాలిక విక్రయం కోసం వాటిని విడుదల చేయడానికి మిల్లులు, వర్తకుల ఆవరణలపై ముమ్మర తనిఖీలు చేపట్టడమవుతున్నది.

(iii) ఎటువంటి శిస్తు లేకుండా, 2 : 1 నిష్పత్తిలో రాష్ట్రం లోపల, రాష్ట్రం బయట విక్రయించడం కోసం ప్రాధాన్యతగల బియ్యం రకాలను అనుమతించడమయింది.

(iv) దాచి వుంచిన నిత్యావసర సరుకుల నిల్వలను వెలికి తీయడం కోసం బియ్యం మిల్లులు, వర్తకుల ఆవరణలపై క్రమం తప్పకుండా, ఆకస్మిక తనిఖీలను చేపట్టడమవుతున్నది.

(v) అంతేకాక, రెగ్యులరు అధీకృత నిఘా అధికారులతోపాటుగా దాచివుంచిన నిల్వలను వెలికి తీయడానికి మిల్లర్లు, డీలర్ల వ్యాపార ఆవరణలను తనిఖీ చేసి నియంత్రణ ఉత్తరువులలోని నిబంధనల అతిక్రమణలపై కేసులను నమోదు చేయడం కోసం పౌర సరఫరాలు / రెవెన్యూ, వాణిజ్య పన్నులు, లీగల్ మెట్రాలజీ, నిఘా & తనిఖీ శాఖ అధికారులతో టాస్క్‌ఫోర్సులను ఏర్పాటు చేయడమయింది.

(vi) ఫిర్యాదులు అందుకొని, విచారణ, సమస్యల నివారణ కోసం వాటిని ఆన్‌లైన్ ద్వారా కలెక్టర్లకు పంపడానికి పౌర సరఫరాల కమీషన్‌రేటులో టోల్‌ఫ్రీ టెలిఫోన్ నెంబరు 1967ను ఏర్పాటు చేయడమయింది.

(vii) నిత్యావసర సరకుల ధరల పరిస్థితిని, వాటి లభ్యతను సమీక్షించటానికి మరియు ధరలను అందుబాటులో ఉంచేందుకు, మార్కెట్ మధ్యవర్తిత్వం ద్వారా ధరల పెరుగుదలను నియంత్రించటానికి ప్రభుత్వం పక్షాన చర్యలను తీసుకోవటానికి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన ధరల పర్యవేక్షణ కమిటీని ఏర్పాటు చేయడమయింది.

(viii) నిత్యావసర సరుకుల లభ్యతను, ధరలను మదింపు చేయటానికి అలాగే తృణధాన్యాల పోషకాహార అంశాన్ని బాగా ముందుగానే పంట విధానాన్ని రూపొందించేందుకు అధిక డిమాండ్ ఉన్నట్టి ఆహార ధాన్యాలను ఉత్పత్తిచేసి, బహిరంగ మార్కెటులో అందుబాటు ధరలకు వాటిని సామాన్య ప్రజానీకానికి లభ్యంగా ఉంచటానికి వీలుగా సముచిత ఎంఎస్‌పి విధానం అవసరమైనట్లయితే ఆచరణలో ఉంచటానికి వ్యవసాయ, మార్కెటింగ్, పౌర సరఫరాలు, ఉద్యానవన కమీషన్లు, మార్క్‌ఫెడ్, ఆయిల్ ఫెడ్ ఎం.డి మరియు ఆర్థిక, గణాంకాల శాఖ డైరెక్టర్లు సభ్యులుగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన ఒక ఉన్నతస్థాయి సమన్వయ కమిటీని కూడా ఏర్పాటే చేయడమయింది.

(ix) ముఖ్యమైన వ్యవసాయ సరుకుల ధరల మెరుగైన పర్యవేక్షణ కోసం, అవసరమైనప్పుడు రైతులు, వినియోగదారుల ఇద్దరి ప్రయోజనాలను కాపాడటానికి నష్టనివారక చర్యలను తీసుకోవటానికి భారీ ఆన్‌లైన్ అగ్రి-కమోడిటీస్, కన్సల్టింగ్ అండ్ మార్కెట్ ఇంటెలిజెన్సీ కంపెనీగా ఉన్నట్టి మెసర్స్ అగ్రివాచ్ సర్వీసులను వినియోగించడమయింది.

(x) సమాజానికి నిత్యావసర సరుకుల సరఫరాల నిర్వహణకు ప్రతికూల విధానంలో వ్యవహరించే డీలర్లు, మిల్లర్లు మరియు ఇతరులను నిరోధించటానికి నిత్యావసర సరుకుల బ్లాక్ మార్కెటింగ్, సరఫరాల నిర్వహణ నివారణ చట్టంలోని నిబంధనలను ప్రయోగించాలని కలెక్టర్లను ఆదేశించడమయింది.

(xi) కలెక్టర్లు సూచించిన కేంద్రాలలో మరియు రైతు బజారులలో బిపిటి, సోనామసూరి మొదలైనటువంటి అత్యంత మేలురకమైన ప్రాధాన్యతగల రకాలను కేజీ ఒక్కింటికి రూ.30/-లకు విక్రయించేటట్లు కలెక్టర్లు రైస్ మిల్లర్లను కట్టుదిట్టం చేస్తున్నారు. 364 కేంద్రాల ద్వారా 35,717 క్వింటాళ్ళ బియ్యాన్ని విక్రయించడం జరిగింది.

(xii) ప్రతి జాయింట్ కలెక్టరుకు రూ.15.00 లక్షల రివాల్వింగ్ నిధిని సమకూర్చి, మార్కెట్ ప్రమేయ కార్యకలాపాల క్రింద వ్యవసాయ మార్కెటింగు శాఖ సమన్వయంతో కూరగాయల ధరలను పర్యవేక్షించి, కూరగాయల కొనుగోలు, పంపిణీ కోసం ఏర్పాట్లు చేయాలని వారిని ఆదేశించడమయింది.

(xiii) 2014, జూలైలో ఉల్లిపాయలు, బంగాళదుంపలు, టమాటాల ధరలు బహిరంగ మార్కెటులో అసాధరణంగా పెరిగాయి. మార్కెట్ మధ్యవర్తిత్వం ద్వారా ధరలను నియంత్రించటానికి వ్యవసాయ మార్కెటింగ్ శాఖ సమన్వయంతో పౌర సరఫరాల శాఖ చర్యలను తీసుకుంది.

రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న పై చర్యల ఫలితంగా, నిత్యవసర సరుకుల ధరల పెరుగుదలను అదుపులో ఉంచి, సముచిత ధరలలో లభ్యంగా ఉంచడమయింది.

శ్రీ సి. రామచంద్రయ్యః అధ్యక్షా, మేము సప్లిమెంటరీలు అడగడానికి అవకాశంలేకుండా మంత్రిగారు చాలా పెద్ద సమాధానమిచ్చారు. ఆంధ్రప్రదేశ్‌లో వంటనూనెకు ఎక్కువగా శనగనూనె, పామోలిన్‌నూనెలను వాడతారు. మా ప్రాంతంలో శనక్కాయల పంట అంత ఆశాజనకంగా లేదు. కాబట్టి ఎక్కువగా పామోలిన్ ఆయిల్‌మీదనే ఆధారపడుతున్నాము. కానీ కేంద్ర ప్రభుత్వం దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నవారికి చౌకధరల దుకాణాల ద్వారా పామోలిన్ నూనె సరఫరా చేయడాన్ని 2013 సంవత్సరంలో నిలిపివేసింది. ఆ తరువాత ప్రభుత్వం ముక్కీ, మూలిగి ఈ పథకాన్ని కొనసాగించినా, 2014 ఏప్రిల్ 1వ తేదీ నుంచి సరఫరా చేయడాన్ని పూర్తిగా నిలిపివేసింది. కాబట్టి దీనికి ప్రత్యామ్నాయంగా ఏమైనా చేస్తారా? లేక మీరే ఈ పామోలిన్ నూనెను దిగుమతి చేసుకుని దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నవారికి సరఫరా చేసే ఆలోచన ఏదైనా ఉందా? అలాగే ఆంధ్రప్రదేశ్‌లో కందిపప్పు ఎక్కువగా వాడుతున్నా సరఫరా మాత్రం చేయడంలేదు. కాబట్టి వంటనూనెలు, కందిపప్పుకోసం ప్రభుత్వం ఏవైనా అదనపు నిధులు విడుదల చేసి తయారీదారు నుంచి నేరుగా కొని అమ్మేవిధంగా చర్యలు తీసుకుని, త్వరలోనే ఈ పథకాన్ని కొనసాగించమని కోరుతున్నాను. దీనికోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను తెలియజేయండి.

శ్రీమతి పరిటాల సునీతమ్మః అధ్యక్షా, గౌరవ సభ్యులు, మేధావులు అన్నగారు అడిగిన అంశం ఈ సభలో ఎన్నోసార్లు చర్చకు వచ్చింది. మొన్ననే మా ముఖ్యమంత్రిగారి దృష్టికి కూడా తీసుకెళ్ళాం. కందిపప్పు, పామాయిల్ సరఫరా గురించి మేం కూడా ఆలోచన చేస్తున్నాం. గత ప్రభుత్వం ఉన్నప్పుడు

'అమ్మ హస్తం' అనే పేరుక్రింద కూడా ఒక పథకాన్ని పెట్టి 9 సరుకులు ఇచ్చినారు. వాటిని ఎవరూ కూడా సక్రమంగా తీసుకోకపోవడంవల్ల చాలావరకూ అవి ఆగిపోయినాయి. మేము కూడా ఈ పథకాన్ని పెట్టాలనే ఆలోచనతో ముఖ్యమంత్రిగారి దృష్టికి తీసుకువెళ్ళినప్పుడు వారుకూడా అంగీకరించారు. జిల్లాలవారీగా, మండలాలవారీగా అక్కడి ప్రజలు తీసుకునే ఆహారాన్ని ఒక లిస్టు రూపంగా తయారుచేసి తీసుకువస్తే తప్పకుండా ఆలోచన చేద్దామని ముఖ్యమంత్రిగారు చెప్పడం జరిగింది. అనంతపురం జిల్లాలో రాగిసంగటి ఎక్కువగా తీసుకుంటారు కాబట్టి అక్కడ రాగులిస్తే బాగుంటుందని కొంతమంది సలహాలు కూడా ఇచ్చారు. పేదవాళ్ళు తీసుకునే ఆహారానికి సంబంధించిన సరుకులనుకూడా అందచేయాలని మేము ఆలోచన చేస్తున్నాము. ఇందాక గౌరవ సభ్యులు అడిగినట్లు కందిపప్పు, నూనెలను అందజేయమని మేము జిల్లాలకు వెళ్ళినప్పుడు అందరూ అడుగుతున్నారు. కాబట్టి దీనిగురించి కూడా మేము ఆలోచన చేస్తున్నాము.

MR CHAIRMAN: The House is adjourned for Tea Break for 15 minutes.

(Then, the House was adjourned at 11.16 a.m)

---

ఉ. 11.50

(తేనీటి విరామానంతరం సభ గం.11.53ని. లకు సమావేశమయింది.)

(గౌరవ ఛైర్మన్ అధ్యక్ష స్థానం వహించారు.)

మిస్టర్ ఛైర్మన్ః శర్మ గారూ, స్పెషల్ మెన్షన్ మీద మాట్లాడండి.

(2) **ప్రత్యేక ప్రస్తావన :**

శ్రీ ఎమ్.వి.ఎస్. శర్మ ః అధ్యక్షా, రాష్ట్రంలో విలేజ్ రెవెన్యూ అసిస్టెంట్స్ ఉన్నారు. వారికి జీతాలు రూ.3,000 నుండి రూ.6,000 వరకూ పెంచారు. కానీ 010 పద్దు కింద బడ్జెటరీ క్వార్టర్లీ గ్రాంట్ మార్చినందువల్ల వారికి జీతాలు రావడం లేదు. అంతేకాకుండా వారికి పెన్షన్ మరియు ఇతర సౌకర్యాలు ఏవీ లేవు. అలాగే, కారుణ్య నియామకాల విషయంలో వారు పనిలో ఉండగా చనిపోతే, లేదా ఆరోగ్య కారణాల వల్ల విరమించుకుంటే వారి మీద ఆధారపడిన వారికి అందులో నియామకాలు ఇచ్చేటప్పుడు వయోపరిమితి పెంచడం వంటి సడలింపులు వర్తించడం లేదు. ఇంతకుముందు రెవెన్యూ మంత్రిగారు సమావేశంలోనే ఉన్నారు కనుక విఆర్ఏల సమస్యలను వారి దృష్టికి తీసుకువెళ్లడం జరిగింది. సానుభూతితో వారి సమస్యలను పరిష్కరించే చర్యలను వెంటనే తీసుకోవాలని తమ ద్వారా మంత్రిగారిని కోరుతున్నాను.

శ్రీ కె.ఇ. కృష్ణమూర్తి ః గౌరవ సభ్యులు చెప్పిన విషయాన్ని నోట్ చేసుకున్నాము. మేము పరిశీలించడానికి జోనల్ సమావేశాలు పెట్టుకుంటాము కాబట్టి, ఆ సమావేశంలో తప్పకుండా ఈ సమస్యను పరిష్కరించడానికి ప్రయత్నం చేస్తాము.

MR. CHAIRMAN: First time, Special Mention answered immediately on the Floor.

శ్రీ ఎమ్.వి.ఎస్. శర్మ ః తమరి ద్వారా మంత్రిగారికి ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.

MR. CHAIRMAN. You have taken the advantage of his presence in the House. That is good.

Now, Item No.II - All the papers listed in the Agenda are deemed to have been laid on the Table of the House.

**(3) PAPERS LAID ON THE TABLE OF THE HOUSE:**

1. A copy of the 55th Annual Report and Accounts of the Andhra Pradesh State Warehousing Corporation Limited for the year 2012-13, as required under Section 31(11) of the Warehousing Corporations Act, 1962.

2. A copy of the Annual Audit Report along with Audited Annual Accounts of the Tirupati Urban Development Authority for the year 2012-13, as required under Section 24(4) of the Andhra Pradesh Urban Areas (Development) Act, 1975.

Item No.III – General discussion on Budget. Changal Rayudugaru, please initiate the discussion.

(4) **బడ్జెటుపై సాధారణ చర్చ:**

శ్రీ బి. చెంగల్ రాయుడు : అధ్యక్షా, 2015-16 సంవత్సరపు ఆంధ్రప్రదేశ్ బడ్జెట్ మీద చర్చలో పాల్గొనే అవకాశం కల్పించినందుకు మొట్టమొదటిసారిగా మీకు నా ధన్యవాదాలు తెలియచేస్తున్నాను. రూ.1,13,049 కోట్లతో గత సంవత్సర బడ్జెట్ రూ.1,11,823 కోట్ల కన్నా కొంచెం ఎక్కువ పెట్టడం జరిగింది. ప్రస్తుత బడ్జెట్ రెవెన్యూ లోటు 7,300కోట్లు, ఫిస్కల్ డెఫిసిట్ రూ.17,584 కోట్లుగా చూపించడం జరిగింది. బడ్జెట్ ఎస్టిమేషన్ వచ్చేటప్పటికి లోటు ఇంకా పెరిగే అవకాశం కనబడుతున్నది. ఏదేమైనప్పటికీ ఫుల్ టైం బడ్జెట్‌ను, జీరో బేస్డ్ బడ్జెట్‌ను తీసుకువచ్చారు. గత సంవత్సరం పరిస్థితులు వేరుగా ఉన్నాయి. దీనిని నేను ఫుల్ టైం బడ్జెట్ అనలేను, పార్ట్‌టైం బడ్జెట్ అనలేను టోకెన్ బడ్జెట్ అని స్వయానా ఆర్థిక శాఖా మంత్రిగారే సభలో చెప్పారు. నేను దాని జోలికి పోకుండా లోతుగా చూస్తే మనకు కొన్ని విషయాలు తెలుస్తాయి. పర్‌కేపిటా ఇన్‌కం రూ. 90,517గా చూపించడం జరిగింది. 2003-04వ సంవత్సరంలో పర్ కేపిటా ఇన్‌కం రూ.28,000లుగా ఉండడం జరిగింది. ఇప్పటికీ అప్పటికీ చాలా గ్రోత్ కనబడుతున్నది. కుబేరులు మూడు రకాలు, బీదవారు రెండు రకాలుగా అనుకుంటే, బీదవారికి 14వేల కన్నా ఎక్కువ వచ్చేది లేదు. బీదల యొక్క హృదయాలను స్పందించే విధంగా మాట్లాడాలనే ఉద్దేశంతో కొన్ని నిర్దిష్టమైన విషయాలను సభ దృష్టికి తీసుకువచ్చే ప్రయత్నం చేస్తున్నాను. రీ ఆర్గనైజేషన్ అయిన తరువాత ఆంధ్రప్రదేశ్‌కు రావలసిన బాకీ రూ.1.29 లక్షలు ఉంటే 2014-15 సంవత్సరంలోనే రూ.21,726కోట్లు అప్పు చేసి ఈ రోజుకు రూ.1.46 వేల కోట్ల రూపాయల అప్పులతో ఉన్నారు. ఈ రోజు పుట్టిన బిడ్డతో సహా లెక్క వేస్తే, రూ.30,000లు బాకీ ఉన్నారు. అధ్యక్షా, ఆంధ్రప్రదేశ్‌లో పుట్టినందుకు రూ.30,000లు బాకీలో పడుతున్నారు. ఇది నేడు ఉన్న పరిస్థితి. అయినా, వీటన్నింటినీ మేధావులు ఎక్స్‌సర్‌సైజ్ చేసి ఉంటారు కాబట్టి, నేను కొన్ని విషయాలను మీ దృష్టికి తీసుకువచ్చే ప్రయత్నం చేస్తున్నాను. అది కూడా బీదవారికి సంబంధించిన విషయమే. కూడు, గూడు, గుడ్డ, విద్య, వైద్యం బీదవారికి అత్యవసరమైనవి. కుబేరులు వారి బిడ్డలను లండన్‌లోనో, పారిస్‌లోనో చదివించుకుంటారు వారి జోలికి పోదల్చుకోలేదు. బీదవారి భోజన వసతి, గృహ వసతి, చదువు గురించి బడ్జెట్‌లో వారికి గల కేటాయింపుల గురించి ఎన్ని ఉన్నాయి, నిజంగా అవి అమలు జరుగుతున్నాయా అనే వాటిని సభ దృష్టికి తీసుకువచ్చే ప్రయత్నం చేస్తాను. ఇంతకుముందు కూడా 5 గ్రిడ్స్ గురించి చెప్పారు. అయితే, నా ధోరణి ఒకటే. బడి, బాట, బోరు, బల్బు, బస్సు, బ్యాంకు ఇవన్నీ ఉంటే విద్యార్థులకు ర్యాంకులు వస్తాయి. ర్యాంకులు రావాలంటే ప్రతి గ్రామానికి ఈ వసతులన్నీ కల్పించుకోగలిగితే ర్యాంకు రావడానికి అవకాశం ఉంటుంది. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత అన్ని ప్రభుత్వాలు తమ వంతు కృషి చేస్తున్నాయి. అయినా కూడా గ్రామీణ ప్రాంతమంతా అనుకున్న విధంగా సాధించలేకపోతున్నారు. దానికి కారణాలు వేరే ఉండవచ్చు. ఈ రాష్ట్రాన్ని కరువు పట్టి పీడిస్తున్నది.

మ. 12.00

అధ్యక్షా, ఈ రాష్ట్రాన్ని కరువు పట్టి పీడిస్తున్నది. ఈ కరవునుంచి విముక్తి కావాలంటే చెరువు కావాలి. చెరువులోకి నీళ్లు వస్తే ఎరువు కావాలి. ఎరువు వేసుకోవాలంటే అరువు కావాలి. అరువు పుట్టకపోతే పరువు పోతుంది. అందుకని, కరువు, చెరువు, ఎరువు, అరువు, పరువు గురించి కూడా నాలుగు మాటలు సభ దృష్టికి తీసుకువచ్చే ప్రయత్నాన్ని నేను చేస్తాను. నాకు మాట్లాడే అవకాశాన్ని మెండుగా కల్పించవలసిందిగా నేను తమరిని కోరుకుంటున్నాను.

సామాన్యుడికి కావలసిన కూడు గురించి ఆలోచిస్తే, వ్యవసాయదారుడు ఏ సాయం అందనటువంటి వ్యవసాయానికి, ఎంతో కొంత సాయమందించాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వంలో వ్యవసాయ బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ఈ ప్రభుత్వంలో కూడా వ్యవసాయ బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు కానీ, ప్రభుత్వం నిజమైన దృష్టిని వ్యవసాయంపైన సారించడంలేదు. ఎంతోమంది వ్యవసాయరంగ నిపుణులు, మేధావులు వారి సలహాలు, సూచనలిస్తున్నా కూడా రైతుకు గిట్టుబాటు ధర రావడం లేదు. పండిన పంటకు, పండిన పండ్లకు కూడా గిట్టుబాటు ధర రావడంలేదు. ఫ్యాక్టరీవారు నిర్ణయించిన రేటుకు మిగతావారు కొనుక్కోవలసి వస్తుంది. ఇక్కడ కొనుగోలు చేసేవారు నిర్ణయించిన రేటుకు అమ్మకందారుడు అమ్మవలసి వస్తుంది. ఎందుకు ఈ విధంగా జరుగుతుంది, ఎందుకు వ్యవసాయరంగం దెబ్బతింటుందని మేధావులతో రీసెర్చి చేయిస్తే బాగుంటుందని నేను తమరి ద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

ముఖ్యంగా, బీదవారికి సంబంధించిన శాఖ, పౌరసరఫరాల శాఖ. పౌరసరఫరాల శాఖకు 2015-16 సంవత్సరానికిగాను రూ. 2,459 కోట్లు కేటాయించడం జరిగింది. గత సంవత్సరం కన్నా రూ. 141 కోట్లు ఎక్కువ. గత సంవత్సరం ఈ శాఖకు రూ. 2,318 కోట్లు బడ్జెట్‌ను కేటాయించారు. ఫలానా రోజు నుంచి మేము చేస్తామనే నిర్దిష్టమైన ప్రణాళిక గురించి వ్యవసాయ రుణాలలోకానీ, హార్టీకల్చర్ రుణాలలో కానీ, డ్వాక్రా రుణాలలో కానీ, చేనేత కార్మికుల రుణాలలో కానీ ఈ ప్రభుత్వం చెప్పలేదు. కానీ, ఏప్రిల్, 2015 సంవత్సరం నుంచి 5 కిలోగ్రాముల బియ్యాన్ని బీదప్రజలకు ఇస్తామని ప్రభుత్వం గవర్నరుగారి ప్రసంగంలో పేజి నెం. 25 పేరా నెం. 2 లో స్పష్టంగా చెప్పడం జరిగింది. దానికి ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని నేను భావిస్తున్నాను. ఎందుకంటే, దీనికి కట్టుబడి ఉండడానికి చాలా సానుకూలత కనపడుతోంది. స్వర్గీయ శ్రీ ఎన్.టి.రామారావుగారు రూ. 2 లకే కిలోబియ్యం అనే నినాదంతో అధికారంలోకి వచ్చారు. ఆయన అధికారంలో నుంచి వెళ్లిపోయిన తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌పార్టీ నాయకుడు శ్రీ వై.యస్.రాజశేఖరరెడ్డి గారు 2008వ సంవత్సరంలో రూ. 2 లకే కిలో బియ్యం పథకాన్ని తీసుకువచ్చారు. శ్రీ ఎన్.టి.రామారావుగారు మరియు శ్రీ రాజశేఖరరెడ్డిగారికి మధ్య అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబునాయుడు గారు కిలో బియ్యాన్ని రూ. 5.40 పైసలకు పెంచారు. తెలుగుదేశం పార్టీని స్థాపించిన శ్రీ ఎన్.టి.రామారావు రూ. 2 లకే కిలో బియ్యం పథకాన్ని ప్రవేశపెట్టారు కదా మీరు ఎందుకు కిలో బియ్యం రేటు పెంచారని అంటే "రాష్ట్రం నష్టపోవడం నాకు ఇష్టంలేదు, నేను తప్పనిసరిగా ఈ రేటును పెట్టాలని" చెప్పి రూ. 5.40 పైసలతో కిలో బియ్యాన్ని ఇచ్చారు. 2013వ సంవత్సరంలో శ్రీ ఎన్.కిరణ్‌కుమార్‌రెడ్డిగారు కాంగ్రెస్ పార్టీ నాయకత్వంలో కిలో బియ్యం రూ. 1 లకే సరఫరా చేయడం జరిగింది. నేటికి కూడా కాంగ్రెస్‌పార్టీ ఇచ్చిన కిలో బియ్యం రూ. 1లకే పథకం అమలవుతున్నది. అది కూడా అదృష్టమనే నేను భావిస్తున్నాను. ఒరిజినల్ కాస్ట్‌తో లెక్క వేస్తే ఆరేటు కూడా సరిపోతుంది. డీలర్ ఖర్చు, రవాణా, లోడింగ్ మరియు ఇతర ఖర్చులకు ఆ రూపాయి సరిపోతుంది. అందువల్ల బియ్యం ఉచితంగా ఇచ్చినట్లే అవుతుంది. ఈ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఆ ప్రభుత్వానికి అదృష్టమనే నేను భావిస్తున్నాను. మరో ఐదు సంవత్సరాలపాటు ఎన్నికలు లేవు. ఎన్నికలు లేవు కాబట్టి కొన్ని చర్యలు తీసుకోవడానికి అవకాశం ఏర్పడింది. ఆ చర్యలు ఏమిటంటే, బోగస్ రేషన్ కార్డుల ఏరివేత కార్యక్రమాన్ని ప్రభుత్వం తీసుకోవడం జరిగింది. వాటిని ఆధార్‌తో అనుసంధానం చేయడం వల్ల చాలా

బోగస్‌కార్డులు బయటపడ్డాయి. సుమారు 75 లక్షలమందికి, ప్రతి ఒక్కరికి నాలుగు కిలోల బియ్యాన్ని వారు క్లెయిమ్ చేస్తూనే ఉన్నారు. దీంతో ఆ బోగస్‌కార్డులు బయటపడ్డాయి. దానివల్ల 30 వేల మెట్రిక్ టన్నుల బియ్యం సేవింగ్‌లోకి వచ్చింది. మొత్తం కార్డులు 1.25 కోట్లుంటే, 3.55 కోట్లమందికి 5 కిలోల లెక్కన ఇవ్వడానికి ఈ బియ్యం సరిపోతుంది. రాష్ట్రప్రభుత్వంపై ఒక్క పైసా కూడా ఖర్చు కాకుండా పకడ్బందీగా ఆ పథకాన్ని అమలు చేయడం వల్ల మనకు 30 వేల మెట్రిక్ టన్నుల బియ్యం మిగలడం వల్ల నిజమైన లబ్ధిదారులకు 5 కిలోల బియ్యాన్ని ఇవ్వడానికి అవకాశం ఏర్పడింది కాబట్టి ఈ పథకంలో వెనుకంజ వేయరని నేను భావిస్తున్నాను. తప్పనిసరిగా ఈ రాష్ట్రప్రభుత్వం వచ్చే ఏప్రిల్ మాసం నుంచి పేదప్రజలకు 5 కిలోల బియ్యాన్ని అందిస్తారని నేను ఆశిస్తున్నాను.

అధ్యక్షా, ఇక్కడ మరొక ప్రాసెస్ కూడా ఉంది. 2014-15 మరియు 2015-16 వ సంవత్సరాలలో గవర్నరుగారి ప్రసంగం ద్వారా కూడా చెప్పారు. తూర్పుగోదావరి జిల్లాలో ఇ.పి.ఒ. మిషన్ పైలట్ ప్రాజెక్టు క్రింద తీసుకుంటే 15 శాతం సేవింగ్స్ వచ్చాయి. దీనిని మిగిలిన జిల్లాలకు కూడా విస్తరిస్తామని చెబుతున్నారు. ఈ కార్యక్రమాన్ని త్వరితగతిన పూర్తిచేస్తే బాగుంటుందని, ఇంకా ఎక్కువ సేవింగ్స్ రావడానికి అవకాశముంటుందేమో చూడవలసిందిగా నేను తమరిద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

ముఖ్యంగా, ఆధార్‌కార్డు లేనివారికి బియ్యం ఇవ్వడం లేదు. ఆధార్‌కార్డు లేనివారిలో చాలామంది గిరిజనులున్నారు. వారు ఈరోజు ఒకచోట ఉంటారు, రేపు మరొకచోట ఉంటారు. గిరిజనుల వద్దకే వెళ్లి ఆధార్‌కార్డును ఇప్పించి ఆధార్ అనుసంధానం కార్యక్రమాన్ని చేయవలసిందిగా నేను ప్రభుత్వాన్ని తమరిద్వారా కోరుతున్నాను. కేంద్రప్రభుత్వం కూడా గిరిజనులకు ప్రత్యేకంగా కొన్ని మార్గదర్శకాలను జారీచేసింది. కార్డులో ఎంతమంది ఉన్నా అంతమందికి ఆవాస్‌యోజన పథకం ద్వారా 35 కిలోల బియ్యం ఇవ్వాలని ఉంది. గిరిజనుల విషయంలో ప్రత్యేక జాగ్రత్తను తీసుకోవాలని నేను తమరిద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

చౌకధరల దుకాణాల గురించి కొన్ని నిజాలను కూడా సభ దృష్టికి తేవాలి. తేది. 1.4.2014 నుంచి కందిపప్పు, తేది. 1.5.2014 నుంచి పామాయిల్ గ్రామీణ ప్రాంతాల్లో సరఫరా చేయడంలేదు. ఎందుకు సరఫరా చేయడంలేదని ఈ సభలో అడిగితే, ఆ విషయాన్ని సభ్యులు ప్రభుత్వ దృష్టికి తీసుకువచ్చినందుకు త్వరతగతిన తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఎందుకు సరఫరా చేయలేదనే విషయం వారికే తెలుసు. అక్టోబర్, 2013 నుంచి ఏప్రిల్, 2014 వరకూ పామాయిల్‌పై రూ. 23 ల సబ్సిడీని ఆనాటి రాష్ట్రప్రభుత్వం భరించి రూ. 63 లతో పామాయిల్ సరఫరా చేసింది. కానీ, ఈ ప్రభుత్వం ఈరోజుకి కూడా పామాయిల్ ఇవ్వలేదు, కందిపప్పు కూడా ఇవ్వలేదు.

మ. 12.10

(ప్యానెల్ ఛైర్‌పర్సన్ శ్రీమతి పమిడి శమంతకమణి అధ్యక్ష స్థానం వహించారు)

బీదవాళ్ళకు కొంచెం పప్పు, కొంచెం బువ్వ కావలసి ఉంది. అయితే వీటిని అందచేయడంలో తెలుగుదేశం ప్రభుత్వం ఘోరంగా విఫలమైంది. గత సంవత్సరం నుంచి పామాయిల్, కందిపప్పు ఇవ్వలేదు. కారణం తెలియదు. అయినా సంక్రాంతి చంద్రన్న కానుక పేరుతో ఒక మంచిపని చేశారు. ఉగాదికి కూడా ఏదో ఒక కానుక ఉంటుందని ప్రజలందరూ ఎదురుచూస్తున్నారు. దీపావళికి కూడా ఉంటుందని అనుకుంటున్నాం. మధ్య మధ్యలో మరేదైనా పేరుపెట్టి ఇంకా ఇచ్చినా మంచిదే.

శ్రీ అంగర రామమోహన్ : మొన్న మీరు చంద్రన్న కానుకను ఎగతాళి చేశారు. మందు సీసాలతో పోల్చారు.

శ్రీ బి.చెంగల్‌రాయుడు ః నేను ఎగతాళి చెయ్యలేదు. బీదవాళ్ళకి అందించే పథకాల విషయంలో నేను ఎక్కడా ఎగతాళి చేయను. బీదవాళ్ళకి అందేదాంట్లో ఏది ఉన్నా నేను సంతోషపడతాను. ఇంకా బీదవాళ్లు అడిగినవి ఏమైనా ఉంటే వాటిని అందచేయమని కూడా నేను చెప్పాను. దానిని మీరు వేరే విధంగా అనుకోవద్దు. హిందూ పండుగలకి ఇచ్చారు. What about Christian festivals? What about Muslims festivals? రంజాను పండుగకు 30 రోజులు వాళ్ళు పస్తులుంటారు. ఏదో రాత్రిపూట ఇంత అన్నంతిని పగలంతా ఉపవాసముంటారు. ఈ చంద్రన్న కానుకను ముస్లిం పండగైన రంజానుకు, క్రిస్టియన్ పండుగైన క్రిస్మస్‌కు కూడా పొడిగిస్తే బాగుంటుంది. అయితే చంద్రన్న కానుకలో ముస్లింలకు, క్రిస్టియన్లకు ఇలా అందరికీ ఇచ్చారు. కానీ వీళ్ళపేరుచెప్పి వాళ్ళకి కూడా వస్తే బాగుంటుంది కదా అని కూడా ఆలోచించమని ఈ ప్రభుత్వాన్ని నేను కోరుతున్నాను.

అధ్యక్షా, చంద్రన్నకానుక పేరుతో ఆంధ్రప్రదేశ్‌లోని పొరుగురాష్ట్రాల ఉప్పు, పప్పు సరుకంతా పండగకి అయిపోయింది. ఆ తరువాత ఉప్పు, పప్పుతోబాటు మొత్తం ఆరురకాల వస్తువుల ధరలు విపరీతంగా పెరిగినాయి. రాష్ట్రంలో ఆ సరుకులేమీ లేవు. అన్ని దినపత్రికలూ, అందులోనూ అనుకూలమైన పత్రికలుకూడా సరుకు అయిపోయింది కాబట్టి ధరలు పెరిగాయి అని రాశాయి. దానిమీద ఎలాంటి చర్య తీసుకోనందువల్ల బీదవాళ్ళకి చాలా నష్టం జరిగిందనే విషయం మీ దృష్టికి తీసుకువస్తున్నాను.

అధ్యక్షా, పౌరసరఫరాలశాఖలో వృథాగా చేస్తున్న ఖర్చును తగ్గించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఏ విధమైన ప్రయత్నం చేయలేదనే విషయాన్ని నిర్మాణాత్మకమైన ప్రతిపక్షంగా ప్రభుత్వం దృష్టికి తీసుకువస్తున్నాను. బియ్యం పండించి స్టేజ్-1 గోడౌనుకు, అక్కడి నుంచి స్టేజ్-2 గోడౌన్‌కు, అక్కడి నుండి స్టేజ్-3 గోడౌన్‌కు, అక్కడి నుంచి చౌకధరల దుకాణాలకు లోడింగ్, అన్‌లోడింగ్ చేయడం జరుగుతోంది. అలాగాకుండా, ఎక్కడైతే లోడ్ అవుతుందో అక్కడినుంచే నేరుగా చౌకధరల దుకాణాలకే సరుకు వెళ్తే చిల్లర దొంగతనాన్ని అరికట్టవచ్చు. జిల్లాస్థాయిలో గోతంవేసి బియ్యంతీస్తే 50కేజీలకు 49కేజీలు, మండలస్థాయిలో 50 కేజీలకు 47 కేజీల బియ్యం వస్తున్నాయి. అక్కడ్నుంచే తగ్గించి రావడంవల్ల డీలర్ కూడా తగ్గించి ఇవ్వాల్సి వస్తోంది. నేరుగా స్టేజ్ 1 నుంచి చౌకధరల దుకాణాలకే బియ్యం సరఫరా చేస్తే బియ్యం ఖర్చుతోపాటు, ట్రాన్స్‌పోర్టు, లోడింగ్ అన్‌లోడింగ్ ఖర్చు కూడా తగ్గుతుంది. దీనిని దృష్టిలోపెట్టుకుని పనిచేయాలని మీద్వారా ప్రభుత్వ దృష్టికి తీసుకువస్తున్నాను.

అధ్యక్షా, అభయహస్తం కనబడకుండా పోయింది. ప్రభుత్వం మారిందికాబట్టి మీరుకూడా ఆ పథకాన్ని మార్చారు. "మీరు 9 వస్తువులు తగ్గించి ఇచ్చారు మేము 25 వస్తువులు తగ్గించి ఇస్తామని" మీ ప్రభుత్వం పోటీపడి అనాలి. తెలంగాణ రాష్ట్రంలో 6కేజీల బియ్యమిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో 5కేజీలైనా ఇస్తున్నారు. ఎంతోకొంత పోటీపడింది. సామాన్యునికి ఉపయోగపడే వస్తువులు పోటీపడి ఇవ్వాలి. సబ్బుబిళ్ళ, డిటర్జెంట్లు, సర్ఫ్, టీపొడి, టూత్‌పేస్టు ఇలా ఇవ్వాలి. పుస్తకంలో 50శాతం ఆదా ఉంటోంది. నేను ఈ మధ్య పాఠశాలలమధ్య ఒక మధ్యస్థం చేయాల్సి వచ్చింది. పాఠ్యపుస్తకాల్లో 50శాతం కన్సెషన్ ఇస్తున్నారని ఆ సందర్భంగా తెలిసింది. తయారీదారు నుంచి నేరుగా డీలర్‌కే సరుకు వెళ్తే ధర కూడా తగ్గుతుంది. ఉదాః సబ్బు ఖరీదు 25శాతం, పేస్టు ఖరీదు 25శాతం ఇలా తగ్గిపోతుంది. టౌనులలో ఉండేవాళ్ళు కూడా పల్లెలలోని డీలర్‌దగ్గరకు వచ్చి కొనుక్కునే పరిస్థితి వస్తుంది. దీనిగురించి కూడా ఆలోచన చేస్తారని భావించాను. గత ప్రభుత్వం వద్ద ఈ ఆలోచన ఉండింది. మీరు ఈ ఆలోచన వద్దంటే ఒక నమస్కారం. ఈ ఆలోచన తీసుకుంటారంటే రెండు నమస్కారాలు. మీరు ఈ ఆలోచన అమలుచేస్తే మీకే మంచి పేరు వస్తుంది. చంద్రన్న కానుక అని పేరు పెట్టారు మంచిదే. ఇంకా అన్న అమృతహస్తమని అనుకుని పెట్టారు కూడా. ఏదో ఒకటి పెట్టి ఒక 28వస్తువులను, అవసరమైతే ఆరునెలలకు ఒకసారి ఒక చీర, జాకెట్టు, పంచె, టవలూ ఇది కూడా మీ మార్కెట్లో పెట్టండి. బీదవాళ్ళు కొనుక్కుంటారు. మీరు

25శాతం తగ్గించామని అంటున్నారు. చౌకధరల దుకాణాల్లో కొనుక్కుంటే 50 శాతం తగ్గిస్తామని చెప్పండి. మీరు ఆ విధంగాచేస్తే ఎక్కువ కష్టపడుతున్న చేనేత కార్మికులకు ఉపయోగపడేవిధంగా ఉంటుందని మీద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకువస్తున్నాను. రాష్ట్రపతి నుంచి సామాన్యుడి దాకా ఎవరెన్ని చేసినా ఈ జానెడు కడుపుకోసమే కదా. ఈ జానెడు కడుపు నిండాలి. బీదవారి శ్రమతో ధనికులు మేడలు కట్టుకోవచ్చు. కానీ వారి ఆహారం వారికి సరిపోయే విధంగా సబ్సిడీ ధరతో ఇచ్చే ప్రయత్నంచేస్తే చాలా మేలు జరుగుతుందని కూడా నేను భావిస్తున్నాను.

అధ్యక్షా, మా రామ్మోహన్‌గారు ఇందాక నేను మందు గురించి అన్నానని అన్నారు. ముఖ్యమంత్రిగారికి, నాకు జరిగిన సంభాషణనే నేను మీకు గుర్తుచేస్తున్నాను. ఒకానొక సందర్భంలో ముఖ్యమంత్రిగారితో "సార్, మీరు పండగకి పల్లెకు వెళ్ళారు. నేనూ పండగకి పల్లెకి వెళ్ళాను. చంద్రన్న కానుక కార్యక్రమాన్ని బాగా జరుపుకున్నారు. మీరిచ్చినటువంటి 100గ్రాముల నెయ్యిని దీపస్తంభాలలో పోసి ఆ దీపాలతో వాళ్ళ పెద్దలకు బట్టలు పెట్టుకున్నారు. కానీ ఇంకొకటి కూడా వాళ్ళేమి అడిగారంటే నాలుగురోజులూ నాలుగు క్వార్టర్లు ఇస్తే బాగుంటుందని అడిగారు. అయినా ముఖ్యమంత్రిగారు సభకి వస్తారు. వారి దృష్టికి తీసుకువస్తాం. నేను అలాంటివాడిని కాదు కదా అని" అన్నాను. మీరేమి చెప్తే అది ముఖ్యమంత్రిగారికి చెప్తానయ్యా అన్నాను. ముఖ్యమంత్రిగారు ఊరెళ్ళారు. నేనూ వెళ్ళాను. అక్కడేమీ ఎగ తాళి చేయలేదు. మీరిస్తే వాళ్ళు తీసుకుంటారు. ఇయ్యకపోతే వాళ్ళు తీసుకోరు. ఇప్పుడు ఇన్‌కంట్యాక్స్ కట్టకపోవడంవల్ల గోడౌన్‌లన్నీ సీజ్ అయిపోయాయి. రూ.8000కోట్ల బాకీ. భారతీయ జనతాపార్టీ బంధం, అనుబంధం, తాటిచెట్టంత ప్రేమ పెరిగి మీ గోడౌన్‌లన్నింటినీ సీజ్ చేసి బంక కరిపించేసి ఉన్నారు. మీ బంధం గురించి తరువాత మాట్లాడతాను.

అధ్యక్షా, ఇక గూడు గురించి. హౌసింగ్ ప్రోగ్రాం గురించి తెలుగుదేశంపార్టీ ఎన్నికల మేనిఫెస్టోలోనే పేజి నెం.7, సీరియల్ నెం.5లో గుడిసెలులేని ఆంధ్రప్రదేశ్ చేస్తామన్నారు. పేదలందరికీ రూ.1.50లక్షలకు ఉచిత గృహం, ప్రతి గ్రామానికి తారు రహదారి, ప్రతి వీధికి సిమెంటు రహదారి, ప్రతి ఇంటికీ ఉచితంగా మరుగుదొడ్లు నిర్మిస్తామని అన్నారు. ఎన్నికల మేనిఫెస్టోను సభకు ఎందుకు తెచ్చారని మీరు అంటారేమో. నిజానికి ఎన్నికల మేనిఫెస్టో గురించి గవర్నర్‌గారి ప్రసంగంలో పలికించారు మీరు. గవర్నర్‌గారి ప్రసంగానికి, ఎన్నికల మేనిఫెస్టోకి ఏమిటండీ సంబంధం? అసలు ఆయన నోటిగుండా ఎన్నికల మేనిఫెస్టో మాట్లాడచ్చునా. మీ బడ్జెట్‌లో మాట్లాడచ్చు. దానిని తొలగించమని మా ఎల్‌ఓపిగారు కూడా అడిగారు. రూ.1.50లక్షలతో ఎన్నిరోజుల్లో ఇల్లు కట్టిస్తారు? ఫలానారోజునుంచి కడ్తామని చెప్పలేదు. ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఛైర్మన్ ప్రసాద్‌గారు నిన్న తిరుపతికి వచ్చారని మీడియాలో వచ్చింది. మేనిఫెస్టో చాలా పవిత్ర గ్రంథం. పవిత్రతను కాపాడండి అన్నారు. మీరు ఇచ్చినదానిని కాపాడమని ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఇచ్చినటువంటి స్టేట్‌మెంట్. నిన్ననే నేను దినపత్రికలో చదివాను.

మ. 12.20

పేజీ నెం.29 లో, పేరా నెంబరు 85-86 లో గృహ నిర్మాణానికి సంబంధించి ఈ సంవత్సరం రూ.897 కోట్లు మంజూరు చేశారు. కొత్తగా 2,07,000 గృహాలను కట్టిస్తామన్నారు. అది చాలా మంచిది. 2014-15 వ సంవత్సరపు బడ్జెట్ బుక్‌లో పేజ్ నెంబర్ 22, పేరా నెంబర్ 57-59లో రూ.8,800 కోట్లు గృ హ నిర్మాణానికి గాను కేటాయించారు. గత సంవత్సరం గవర్నర్ గారి ప్రసంగంలో కూడా రూ.1.50 లక్షలతో బలహీన వర్గాలకు ఇండ్లను నిర్మించి ఇస్తామని మీరు చెప్పారు. హరిజన, గిరిజనులకు రూ.1,50,000/-, మిగిలిన వారికి రూ.1 లక్ష రూపాయలతో ఇండ్లు నిర్మించి ఇస్తామని గత సంవత్సరం బడ్జెట్‌లో చెప్పిందే, ఈ సంవత్సరం బడ్జెట్‌లో కూడా చెప్పారు.

సభ్యులు శ్రీ అంగర రామమోహన్ గారు ఈ సంవత్సరమైనా ఇండ్లు ప్రారంభిస్తారా అని ప్రశ్నించగా, పరిశీలిస్తామని మంత్రి గారు సమాధానమిచ్చారు. ప్రతిపక్షం వారు అడగాల్సిన ప్రశ్నలను ట్రెజరీ బెంచీల్లో ఉండి కూడా, ప్రశ్నల రూపంలో అడుగుతున్నప్పుడు, ప్రభుత్వం వారు చాలా విలువైన సమాచారాన్ని ఇస్తున్నారు. అలాగే, మేము కూడా ప్రశ్నలు వేస్తున్నాము. ఇరువర్గాల వారి ప్రశ్నలకు కలిపి సమాధానం ఇస్తున్నారు. అందుకు చాలా సంతోషం. 2014-15వ సంవత్సరంలో ఒక్క ఇల్లు కూడా మీరు టేకప్ చేయలేదు. 2015-16 వ సంవత్సరంలో ఇళ్లు టేకప్ చేస్తామని మీరు చెప్పారు. కొంచెం లోతుగా దీని గురించి మాట్లాడాలనే ప్రయత్నం చేయడానికే తప్ప, నేను ఎవ్వర్నీ తప్పు పట్టాలని కాదు. మార్చి 26, 2014వ సంవత్సరం నుండి మే, 26 వరకూ రూ.200 కోట్లకు M-Books తీశారు. సమైక్య రాష్ట్రంలో పేమెంటు ఇవ్వాలి. ఆ చెల్లింపులు ఇంకా చేయలేదు. అప్పుడు మీరు ఎంఎల్‌సీ గా ఉన్నారు. మీకు మే 28వ తేదీన జీతం పడింది. మాకు మే 28వ తేదీన జీతం పడింది.

శ్రీ అంగర రామమోహన్ : (స్థానిక సంస్థల నియోజక వర్గం – పశ్చిమగోదావరి) సమైక్య రాష్ట్రంలో బిల్లులు ఎవరు ఇవ్వాలి? మీరా, మేమా?

శ్రీ బి. చెంగల్ రాయుడు : అధికారులు చేసిన తప్పిదం వలన, కంప్యూటర్‌లో ఫీడ్ చేయని కారణంగా పేమెంటు జరగలేదు. అప్పటి నుండి ఈ రోజు వరకూ పేమెంటు ఇవ్వలేదు. తరువాత మే, 28 నుండి M-Books చేసినవాటికీ పేమెంటు ఇవ్వక, పెండింగ్‌లో ఉన్నాయి. దాదాపు రూ. 800 కోట్లు పెండింగులో ఉన్నాయి. వాటికి ఒక్క రూపాయి కూడా ఈ బడ్జెట్లో విదల్చలేదు. ఇంక కొత్తగా మీరు ఏం ఇస్తారు? ఏదో ఒక సాకు చెప్పడం ఎందుకు? మేము చెయ్యమని నేరుగా, స్పష్టంగా చెప్పండి. మేమేమన్నా కాదన్నామా? అయితే, కేంద్ర ప్రభుత్వానికి మాత్రం ఉన్నది ఉన్నట్లుగా చెప్పే గుణం ఉంది.

గతంలో వేరే విషయానికి సంబంధించి అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ గారికి లేఖ రాస్తే వారు రిప్లై కూడా ఇచ్చారు. అలాగే, నేను కేంద్ర మంత్రి శ్రీమతి స్మృతీ ఇరానీ గారికి లెటర్ రాయగా వారు కూడా రిప్లై ఇచ్చారు (సభలో లెటర్ చూపించారు). భారతదేశంలో విద్యార్థినీ విద్యార్థులకు 8వ తరగతి వరకూ భోజనం పెడుతున్నారు. కేంద్రమే అన్ని ఖర్చులు భరిస్తున్నది. జిల్లాపరిషత్ హైస్కూళ్లలో, గవర్నమెంట్ స్కూళ్లలో, మున్సిపల్ స్కూళ్లలో 10వ తరగతి వరకూ బాలబాలికలు చదువుకుంటారు. అయితే, 8వ తరగతి వరకు మాత్రమే భోజనం పెట్టి, 9,10వ తరగతి పిల్లలకు మాత్రం భోజనం పెట్టక పోవడం మంచిది కాదనే ఉద్దేశంతో ఆనాటి ముఖ్యమంత్రి శ్రీ కె. రోశయ్య గారు 9, 10వ తరగతి చదివే విద్యార్థులకు కూడా భోజనం పెడతాము, కేంద్ర ప్రభుత్వం నిధులు ఇవ్వకపోతే, ఆ ఖర్చును రాష్ట్రప్రభుత్వమే భరిస్తుందని ఒక నిర్ణయం తీసుకుని దాన్ని సత్వరమే అమలుపరిచారు. అధ్యక్షా, కేంద్ర మంత్రి శ్రీమతి స్మృతీ ఇరానీ గారు పంపిన లెటరు ప్రస్తుతం నా దగ్గరుంది, ఆ కాపీని మీకు సమర్పిస్తాను. ఆమె నాకు వ్రాసిన లేఖలో ఒక మంచి వాక్యం ఉపయోగించారు. అది మీకు చదివి వినిపిస్తాను. Further, the Central Government bears the entire cost of food grains and its transportation as per the specified norms. There is no proposal to provide Mid-Day Meals to the children beyond class 8th at present. వారి అభిప్రాయాన్ని మనకు ఖచ్చితంగా చెప్పేశారు కాబట్టి, వారి చర్యలు అభినందనీయం. నేను ఇవ్వలేనని ఆమె చెప్పేసింది. నిజం చెప్పినందుకు రెండు చేతులూ ఎత్తి ఆవిడకు దండం పెట్టాలి. అదే పద్ధతిలో మీరు కూడా క్రిస్టల్ క్లియర్‌గా ఇవ్వలేమని చెప్పండి.

అధ్యక్షా, అలాగే, ప్రధానమంత్రి గారికి గిరిజనుల గురించి ఒక లేఖ రాశాను. ఆయన దగ్గరి నుండి కూడా రిప్లై వచ్చింది. మన రాష్ట్రంలో ముఖ్యమంత్రిగారి దగ్గరి నుండి మంత్రుల వరకు లెటర్స్‌కు రిప్లై ఇచ్చే సమయం లేదు కాబట్టి, దాని గురించి నేనేం మాట్లాడను. గతంలో సాధారణంగా మంత్రులెవరికైనా లెటర్ రాస్తే, దానికి వారి నుండి రిప్లై వస్తుంది. కానీ, ఇప్పుడు ఏ మంత్రీ, ఎవ్వరికీ రిప్లై ఇవ్వడం లేదు. రిప్లై

ఇవ్వకపోయినా మరేం ఫరవాలేదు. మాకు సహాయం చేయడానికి ఒక పి.ఏని, టైపిస్టుని, లెటర్ హెడ్స్‌ని ఇచ్చారు, నెలకు రూ.95వేలు జీతం ఇస్తున్నారు. అయితే, గ్రామీణ ప్రాంతాలలో పర్యటించినప్పుడు సమస్యలు మాకు తెలుస్తున్నాయి. ఉదాహరణకు, రోడ్లు మరియు భవనాల శాఖా మంత్రిగారికి చెబుతున్నాను. ఇది మీ రోడ్డయ్యా, ఎండాకాలం వచ్చింది కాబట్టి సరిపోయింది, పొరపాటున వర్షాలు వస్తే ఆ రోడ్లని ఫిషరీస్ డిపార్టుమెంటుకు అప్పగించాల్సి వచ్చుండేది కాబట్టి ఆ గుంటల్ని చూడండి, లేకపోతే రేప్పొద్దున చేపలు చేరతాయి అని చెప్పాల్సి వస్తుంది.

శ్రీ శిద్ధా రాఘవరావు : సార్!.....

శ్రీ బి. చెంగల్ రాయుడు : నేను మీ గురించి మాట్లాడడం లేదు. నేను రాసిన లెటర్స్ గురించి చెబుతున్నాను.

శ్రీ శిద్ధా రాఘవరావు : ఉదాహరణకు మా శాఖ గురించే చెప్పారు.

శ్రీ బి. చెంగల్ రాయుడు : మీరు మా మిత్రులు కాబట్టి మిమ్మల్ని ఉదాహరణగా చెప్పాను.

శ్రీ శిద్ధా రాఘవరావు : అధ్యక్షా, ఈ రోడ్లన్నీ ఇప్పటికిప్పుడు వేసినవి కాదు. గత 10 సంవత్సరాలుగా అధికారంలో ఉంది వారు. మేము అధికారంలోకి వచ్చి 10 మాసాలే అవుతోంది. ఈ 10 మాసాలలో ఎంత చేయగలమో అంతా చేస్తున్నాము. ఇది కూడా ఒక ప్రణాళిక ప్రకారం రెడీ చేసుకుంటున్నాము. రోడ్ల విషయంలో దశల వారీగా ఎంత చేయాలి, ఏ పద్ధతిలో చేయాలనే దాని మీద ముఖ్యమంత్రిగారు కూడా ఆసక్తిగా ఉన్నారు. కొన్నింటినీ బిఓటి, కొన్నింటిని పిపిపి మోడ్‌లో చేయాలి. మన దగ్గర నిధులు తక్కువగా ఉన్నాయి కాబట్టి అన్నీ ఆలోచించి, రాబోయే రోజులలో రోడ్లను బాగు చేస్తాము. చేపల చెరువులుగా మాత్రం తయారు చేయము. తప్పకుండా రోడ్లను నీటుగా వేయిస్తాము.

శ్రీ బి. చెంగల్ రాయుడు : గతంలో నేను మండల ప్రెసిడెంట్‌గా ఉన్నప్పుడు జిల్లాపరిషత్తులోకి చేపలు పట్టుకుని తీసుకుపోయి, జిల్లాపరిషత్తు ఛైర్మన్‌కు చూపించాను. ఏంటి చంగల్‌రాయుడు గారూ అన్నారాయన. దారిలో వస్తోంటే రాజంపేట రోడ్డులో నీళ్లున్నాయి సార్. ఆ నీళ్లల్లో ఈ చేపలు దొరికాయి. మరి వీటిని ఆర్ అండ్ బి వాళ్లకివ్వాలా, కలెక్టర్ గారికివ్వాలా, లేదా ఎవరికివ్వాలని అడిగాను. అందరూ ఫకఫకా నవ్వారు. అలాంటి చేపలు మళ్లీ రావనుకోండి. మన ఆర్ అండ్ బి మంత్రిగారి మీద నాకు గట్టి నమ్మకం ఉంది. అందులో అనుమానమేమీ లేదు. పొరపాటున వర్షాలు పడలేదు కాబట్టి సరిపోయింది. వర్షాలు పడి ఉంటే చేపలు వచ్చి ఉండేవి. ఒక ఇంచ్ గుంట, వర్షం పడిందంటే మీటరు గుంటగా తయారౌతుంది. అందుకనే ఈ విషయం చెప్పాను. మిమ్మల్ని హర్ట్ చేయాలని మాత్రం కాదు. లెటర్స్‌కు రిప్లై రాలేదనే ఆవేదనతోనే ఈ ఉదాహరణ చెప్పాను కానీ, మిమ్మల్ని ఇబ్బంది పెట్టాలని కాదు. నా ఉద్దేశమేమంటే – కేంద్రంలో ప్రధానమంత్రి గారు, కేంద్ర మంత్రిణి గారు కూడా రిప్లై ఇస్తున్నారు గానీ, రాష్ట్ర మంత్రులు మాత్రం మేం రాసే లేఖలకు రిప్లై ఇవ్వడం లేదు. నాకు లెటర్స్ రాసే అలవాటు ఉంది.

ఒక స్టేట్‌మెంట్ ప్రకారం చూద్దాం. 2004వ సంవత్సరం నుండి 2014వ సంవత్సరం వరకు ఎన్ని ఇళ్లు మంజూరు అయ్యాయి? వాటిలో కొన్ని దొంగలు దోచుకున్నారని చెప్పవచ్చు. అధికారం మీ చేతుల్లో ఉంది కాబట్టి, ఆ దొంగలను లోపల వేసి శిక్షించవచ్చు. అవన్నీ ప్రక్కన పెడదాము. మొత్తం కేటాయించిన ఇళ్లు 70,50,000. మంజూరు చేసిన గృహాలు 50 లక్షలు. అందులో పూర్తయిన ఇళ్లు 36 లక్షలు. అసంపూర్తిగా మిగిలినవి 6 లక్షలు. కొత్త ప్రభుత్వం వస్తూనే రద్దు చేసినవి 8 లక్షలు. ఇది రికార్డెడ్‌గా నేను ఇస్తున్న ఇన్ఫర్మేషన్. దీంట్లో ఎక్కడా ఒక్క శాతం కూడా తప్పుడు సమాచారం లేదు. ఒకవేళ దీంట్లో తప్పుడు సమాచారముందని ప్రభుత్వం నిరూపిస్తే నా ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేస్తాను. అయితే, నేను చెప్పిన

వివరాలు సమైక్య రాష్ట్రంలోనివి. 2004 నుండి 2014 వరకు అని చెప్పాను. అది సమైక్య రాష్ట్రంలోనా, విభజన అనంతర రాష్ట్రంలోనా అనేది కాదు. మొత్తం వివరాలు చెప్పాను.

ప్రస్తుతం అసంపూర్తిగా ఉన్న ఇళ్లు ఈ రాష్ట్రంలో దాదాపు 6 లక్షల వరకూ ఉన్నాయి. వీటిల్లో ఎం-బుక్ చేసి, బేస్‌మెంట్ లెవల్ వరకు వచ్చినవి కొన్ని ఉన్నాయి. గతంలో బేస్‌మెంట్‌కు 5 బస్తాల సిమెంట్ ఇచ్చేవాళ్లు. ప్రస్తుతం 10 బస్తాలు ఇస్తామంటున్నారు. అంతే తప్ప ఎక్కువ ఇవ్వడం లేదు. ఇళ్లు కట్టుకోవడానికి డబ్బుల్లేక, వడ్డీలకు తెచ్చుకుని, అప్పుచేసి మరీ పేదవాళ్లు ఇళ్లు కట్టుకుంటున్నారు. బేస్ మెంట్ వేసుకున్నవాళ్లకూ, రూఫ్ లెవల్ వరకూ వేసుకున్న వాళ్లకూ, శ్లాబు లెవల్ వరకూ వేసుకున్న వాళ్లకు డబ్బులు ఇవ్వలేదు. ఎన్ని కష్టాలున్నాయో చూడండి! కనీసం ఎం-బుక్స్‌లో నమోదు చేసుకున్న వరకైనా డబ్బులు ఇచ్చేసి, నాయనా మాకు నిధులు వచ్చేంతవరకు మీరు ఇళ్లు కట్టుకోకండీ అని చెబితే తప్పేముంది ? మా ఆర్థిక పరిస్థితి బాగాలేదు. మేము ఇళ్లు ఇవ్వలేము, మీరు చేసుకున్న పని వరకు డబ్బులిస్తున్నాము, ఇంక మేము ఇవ్వలేమని చెబితే పోతుంది కదా? అదీ చెప్పలేదు.

మ. 12.30

ప్రభుత్వం ఋణాలు మంజూరు చేస్తుందని డబ్బులు వడ్డీలకు తెచ్చుకుని అవి తీర్చలేక కొందరు ఆత్మహత్య చేసుకున్నారు. రైతులు ఆత్మహత్య చేసుకుంటే రూ.5లక్షలు ఇచ్చిన విధంగానే, గృహాలు కట్టుకునేందుకు వడ్డీకి డబ్బు తెచ్చి దానిని తీర్చలేక ఆత్మహత్య చేసుకున్న వారికి కూడా రూ.5లక్షలు ఇస్తే బాగుంటుంది. మేము మా ప్రభుత్వం ఉన్నప్పుడు ఇళ్లు కట్టడానికి పూనుకున్నాము. 2004-05 లో పది లక్షల ఇళ్లు ఇచ్చాము. 2006-07, 2007-08, 2008-09 లో ఫేస్-1,ఫేస్-2, ఫేస్-3 ప్రకారం ఇళ్లు ఇచ్చాము. ఫేస్-1లో saturation by the name of congress party ఇచ్చాము. ఎంత మంది ఇళ్లు ఇమ్మన్నా ఇచ్చేయమన్నాము, సర్వే చేయమని చెప్పాము. మండలాన్ని మూడు భాగాలుగా విభజించమన్నాము. 1వ భాగము ఫేస్-1, 2వ భాగము ఫేస్-2, 3వ భాగము ఫేస్-3. తరువాత కేటగిరీ-1, అంటే స్థలం ఉంది కానీ ఇల్లు లేదు, కేటగిరీ-2 అంటే స్థలం ఉంది కానీ పొసెషన్ సర్టిఫికేట్ లేదు. తహసీల్దారు గారు మీరు పొసెషన్ సర్టిఫికేట్ ఇవ్వండి. పొసెషన్ సర్టిఫికేట్ ఇవ్వమని పంచాయితీ సెక్రటరీ ఆదేశించాము. వాళ్లకి ఇల్లివ్వండి. కేటగిరి-3 క్రింద స్థలం, ఇల్లు రెండు లేవు అనే వాళ్లకి భూమిని కల్పించి, ఇల్లిచ్చాము. అయినా కూడా వద్దని ఆపేశాము. అలాంటి పరిస్థితి వచ్చింది. ఇప్పుడిచ్చినటువంటి రూ.897 కోట్లలో ప్లాన్, నాన్ ప్లాన్ ప్రభుత్వ అసిస్టెన్స్ తీసుకుంటే, ఇందిర ఆవాస్ యోజన కింద రూ. 70,000 లతో ఇల్లిస్తే, మిగిలిన రూ.80,000/- లు మనం భరించాలి. దానికి డబ్బులు లేవు. ఈ ప్రభుత్వం రెండు లక్షల ఏడు వేల ఇళ్లు కట్టాలంటే, రూ.3,105 కోట్లు ఖర్చవుతుంది. ఎందుకిలా ప్రజలను మోసం చేస్తారు? నాలుగేళ్లు అధికారంలో ఉంటారు, ఇప్పటినుంచే ఈ ప్రకటనలు ఎందుకు? మావల్ల కాదంటే మిమ్మల్ని ఎవరు వద్దంటున్నారు? కాబటి ప్రజలకు గూడు కట్టించే విధంగా ప్రయత్నం చేయమని నేను మిమ్మల్ని కోరుకుంటున్నాను.

శ్రీ అంగర రామమోహన్ : కేటగిరీ-4 కింద కూడా ఇల్లిచ్చారు. ఒక్కొక్కరికి 4,5 ఇళ్లు ఇచ్చారు, వాటి మీద ఎంక్వైరి చేస్తున్నారు.

శ్రీ బి. చెంగల్ రాయుడు : ఎంక్వైరి ఎన్నేళ్లు చేస్తారు. ఉన్నవే తీసుకున్నారు. ఈ మూడు నెలలలో ఎంక్వైరి చేసి వాళ్లందరిని జైల్లో పెట్టండి. బీదవాళ్ల పేరుని అడ్డం పెట్టుకుని ఇళ్లు కట్టుకున్న వాళ్ల మొహం మీద మనం ఊసేసివద్దాం. దానికి నేను ముందుంటాను. మీరు ఆ పని చేయలేరా?

శ్రీ శిద్దా రాఘవరావు : అధ్యక్షా, రెండు రోజుల క్రితమే దాని మీద అసెంబ్లీలో కూడా హౌస్ కమిటీ వేయడం జరిగింది.

SRI B.CHANGAL RAYUDU: House Committee was constituted in order to delay the matters చేయకూడదన్నప్పుడు కమిటీలు వస్తాయి. ఈ హౌజ్ లోపల కమిటీలు వేసింది, మూడు నెలల లోపుల రిపోర్ట్ ఇవ్వమంటే, రిపోర్ట్ ఇచ్చేసింది. రాజీవ్ రహదారి మీద మూడు నెలలు రిపోర్టు ఇచ్చిన ఘనత ఈ హౌజ్‌కే దక్కుతుంది. మీ హౌజ్ కమిటీ ఎప్పటి లోగా రిపోర్టు ఇస్తుందో స్పష్టంగా చెప్పండి. 45 రోజులలోనో, 90 రోజులలోనో, లేక 2019 కా, 2029 కా ఎప్పటి లోగా పూర్తి చేస్తుందని చెప్పండి. మీరు టైమ్ బౌండ్ ప్రోగ్రామ్ పెట్టండి.

ఛైర్‌పర్సన్ : త్వరగా ముగించండి. ఇంకా మాట్లాడవలసిన సభ్యులు చాలామంది ఉన్నారు.

శ్రీ బి. చెంగల్ రాయుడు : అయిపోయిందమ్మా, రెండు నిముషాలు. క్రూడ్ ఆయిల్ చాలా ముఖ్యమైన అంశం. క్రూడ్ ఆయిల్ రేటు పడిపోయే కొద్ది అటు కేంద్ర ప్రభుత్వం లోనూ, ఇటు రాష్ట్ర ప్రభుత్వం లోనూ చెమటలు పడుతున్నాయి. క్రూడ్ ఆయిల్ రేటు తగ్గితే, దేవుడా క్రూడ్ ఆయిల్ రేటు తగ్గింది మా వాళ్లకి ఆయిల్ రేటు తగ్గించమని మనం కోరుకోవాలి. Thanks to Atal Bihari vajpai, the then Prime Minister. అడ్మినిస్ట్రేటివ్ మెకానిజమ్ అనేదాన్ని 2002 లో తీసుకువచ్చారు. క్రూడ్ ఆయిల్ రేటు బారెల్ మీద పెరిగితే, రాష్ట్రంలో పెంచాలి, అక్కడ తగ్గితే రాష్ట్రంలో తగ్గించాలి. మే 2009 న ఒక బారెల్ 51 డాలర్లు ఉండేది, డీజిల్ ధర రూ.30/-లు, పెట్రోలు ధర రూ.41/-లు. ఆగస్టు,2013 న 115 యుఎస్ డాలర్లు, డీజిల్ ధర రూ.53/-లు, పెట్రోలు ధర రూ.74/-లు. తరువాత బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. 2014 మే రూ.110 /-లు, డీజిల్ ధర రూ.62/-లు, పెట్రోలు ధర రూ.79/-లు. ఆగస్టు 14 న మూడు రూపాయలకు పడిపోయింది, రూ. 64/-, రూ.75/-. జనవరి 2015 న రూ.46/- లకు క్రూడ్ ఆయిల్ తగ్గిపోయింది. That is the lowest. రూ.60/-లు, రూ.69/-లు. ఇప్పుడు ఈ నెలలో రూ.54/- లు బారెల్ ఉంది. ఈ రోజు రూ.58/-లు, రూ.71/-లు. క్రూడ్ ఆయిల్ రేటు పెరిగితే అక్కడ ఎక్సైజ్ డ్యూటీ వేస్తారా? ఆ ఎక్సైజ్ డ్యూటీ మీద వ్యాట్ వేస్తారా? ఎక్కడైనా రేటు పెరిగే కొద్దీ సంతోష పడాలి గానీ, రేటు పెరిగే కొద్దీ మీ కళ్లలోనుంచి నీళ్లు వస్తున్నాయి. ఎందుకంటే మా పన్నులు తగ్గిపోతాయి. స్వయాన ఆర్థిక మంత్రి ఈ క్రూడ్ ఆయిల్ బారెల్ రేటు పడిపోయినందువల్ల రూ. 500 కోట్లు రాష్ట్ర ప్రభుత్వానికి నష్టం వచ్చిందని చెప్పారు. ఇది నిజం, రికార్డెడ్. తగ్గితే ఆనందపడాలి కానీ, ఎందుకు ఏడవడం? కేంద్ర ప్రభుత్వం ఎక్సైజ్ డ్యూటీని, రాష్ట్రప్రభుత్వం వ్యాట్‌ని ఇంపోజ్ చేశాయి. మొన్న నేను ఏర్పాటు చేసిన ఒక కమిటీ సమావేశానికి ప్రిన్సిపాల్ సెక్రటరీ ట్రాన్స్‌పోర్ట్ మరియు మేనేజింగు డైరెక్టరు వచ్చారు. మనకు ఆయిల్‌లో ఎంత మిగిలిందంటే 20 నుంచి 30 కోట్లు మిగిలింది. కానీ ఆర్‌టిసి నష్టాల్లో ఉంది, కాబట్టి ఇది సేవింగ్స్‌లోకి వస్తుందని మేము భావిస్తున్నాము కాబట్టి ఇలాంటి వాటి మీద గట్టిగా పట్టు పట్టొద్దన్నారు. నేను మా ఊళ్లో ట్రాక్టర్ల వాళ్లందరిని పిలిచి డీజిల్ రేటు పడిపోయింది కదా, మీరు రూ. 500/- లు తీసుకుంటున్నారు, రూ.50/- లు తగ్గించండంటే, రూ.450/- లు గంటకు తీసుకుంటున్నారు. ఆటో వాళ్లు కూడా రూ.7/- లు తీసుకునే వాళ్లు రూ.5/- లు తగ్గించి తీసుకుంటున్నారు. కానీ, ఆర్‌టిసి తగ్గించలేదు. మా మంత్రిగారిని నేను బాధపెట్టను.

గ్రామీణాభివృద్ధికి సంబంధించి, 2015-16 కు గాను, పేజి నెం.37, పారా నెం. 121-126 రూ.8,212/-లు రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది. 2014-15 లో పేజి నెం.25, పారా నెం. 64-68 లలో రూ.6094/- లు కేటాయించింది. ఆ రోజు మొత్తం పెన్షన్‌లు 45 లక్షల రూపాయలు ఉన్నాయి. ఇది ఈ 13 జిల్లాల ఆంధ్రప్రదేశ్‌కి సంబంధించింది. జన్మభూమి కమిటీలు వేశారు, జనరల్‌గా సర్పంచ్ ఉండగా, వార్డు నెంబరు వాళ్లకు కావలసిన వాళ్లని పెట్టుకొని మీరు చేయవచ్చు. సోషల్ వర్కర్స్ పేరితో కొందరిని పెట్టి, స్క్రుటినీ చేశారు. స్క్రుటినీ చేస్తే నలభై నాలుగు లక్షల యాభైవేల మంది స్క్రుటినీ చేసిన వాళ్లు దొరికారు. వీళ్లు సక్రమంగా పనిచేయలేదు. రాష్ట్రం నుంచే నేను నా తడాఖా చూపిస్తానని చెప్పి, State

Resident Data Hub అని సర్వేకి ఇక్కడ నుంచి పంపించారు. అది నలభై మూడు లక్షలకి తేలింది. మధ్యలో ఒకటిన్నర లక్షల మంది ఉన్నారు. వాళ్లు ఎలా ఉన్నారంటే నీకు 5 ఎకరాల పొలం ఉంది కాబట్టి నువ్వు అనర్హుడివి, నీకు ట్రాక్టరుంది అనర్హుడివి, నీకు ఉద్యోగం ఉంది అనర్హుడివి అని అంటున్నారు. మా ఊళ్లో ఒకాయన దొరా, నాకు 5 ఎకరాల పొలం ఉందని వాళ్లు రాసుకున్నారు, నాకు పెన్షన్ వద్దు, కానీ నాకు ఆ 5 ఎకరాలు ఇప్పించు అని అన్నాడు. మీరు ఒకటిన్నర ఎకరం పొలం ఇస్తే, పెన్షన్‌కి సంబంధించిన రూ.1000/- లు ఇవ్వనవసరం లేదు. నువ్వేమి పని చేస్తున్నావయ్యా అని ఊర్లో సాకలోళ్లని అడిగితే ఉద్యోగం అని చెప్పాడు. సాధారణంగా పల్లెల్లో సాకలోళ్లు చేసేది ఉద్యోగమే అంటారు. ఉద్యోగం అని రాసుకుని అతని పేరు తీసేస్తారు. SRDH కు ఉద్యోగం అంటే తెలీదు, సద్యోగం అంటే తెలీదు, 5 ఎకరాల పొలం అంటే తెలీదు, ప్రభుత్వం వేసిన జన్మభూమి కమిటీ నిర్ధారణ చేస్తే దానిని కూడా మీరు తప్పుపట్టి, ఎక్కడో కూర్చొని రిమోట్ సెన్సెస్‌తో లెక్కలు వేసి ఒకటిన్నర లక్షల మంది గొంతుకోస్తున్నారు. ఇది ఎంతవరకు న్యాయమో మీరే చెప్పాలి.

మ. 12.40

MGNREGS క్రింద గత ప్రభుత్వంలో గత సంవత్సరం 34.3 లక్షల మందికి ఎంప్లాయిమెంటు ఇస్తే ఈ సారి 15-16లో 8 లక్షల మందికి ఎంప్లాయిమెంటు ఇస్తున్నారు. గవర్నమెంటు అసిస్టెడ్ ప్రోగ్రామ్ వాళ్ల వాటా నీళ్ల వాటా ఉన్నది కాబట్టి మనము కూడా పూర్తిగా తగ్గించాము. దీని ద్వారా గ్రామీణ ప్రాంతాలలోని వారికి పనిలేకుండా పోయింది. స్వచ్ఛ భారత్ క్రింద 5.4 లక్షలకి ఇల్లు కట్టించాలి. కానీ, నిధులు లేవు. గత సంవత్సరం ఇచ్చిన నిధులను నేను లెక్కచేసుకొని తరువాత చెప్తాను. అక్టోబర్‌లో అనౌన్స్‌మెంట్ చేసి నవంబర్2న పంపకాలు పెట్టారు. అక్టోబర్ నుంచి మార్చి 15 వరకు రూ.6,094కోట్లు ఖర్చు అయితే, ఏప్రిల్ 15 నుంచి మార్చి16 వరకు 12,200 కోట్లు అవుతుంది. గవర్నర్ గారి ప్రసంగంలో లక్షమందికి పెన్షన్ ఇస్తామని గవర్నర్ గారు చెప్పారు. పేజీ నెం.18, పేరా నెం.2లో ఈ రాష్ట్రంలో ఈ సంవత్సరానికి లక్షమందికి పెన్షన్ ఇస్తామని చెప్పారు, సరే ముఖ్యమంత్రి గారు సభకు వచ్చారు. రెండు లక్షల మందికి పెన్షన్ ఇస్తామని చెప్పారు. నిన్న ఆంధ్రజ్యోతి పేపరులో పంచాయతీ రాజ్ శాఖామంత్రి అయ్యన్నపాత్రుడు గారు రాష్ట్రప్రభుత్వం 1.50 లక్షల మందికి పెన్షన్ ఇస్తున్నారని చెప్పారు. ఫర్వాలేదు, ముఖ్యమంత్రి గారికి, గవర్నర్ గారికి మధ్యన ఈయన ఉన్నారు. ఇంకోకాయన అచ్చన్నాయుడుగారు 4 లక్షల పెన్షన్స్ మంజూరయ్యాయని వేశారు. ముఖ్యమంత్రిగారు, గవర్నర్‌గారు, పంచాయతీ రాజ్ శాఖామంత్రి ఇచ్చిన దానికి లేబర్ మినిస్టర్ ఇచ్చిన దానికి పొంతనే లేదు. తీసివేసిన పెన్షన్‌దారులకి మళ్లీ పెన్షన్ ఇస్తే మాకు చాలు. ఎక్కువ మాకు వద్దు. మీరు మళ్లీ పర్‌సన్‌టేజ్ పెంచారు. దాన్ని చూడమని చెబుతున్నాను అంతే తప్ప వేరే ఉద్దేశం ఏమి లేదు. ఈ ప్రోగ్రామ్ మీకు మంచి గౌరవం తెచ్చిపెడుతుంది. ఇది బీదవాళ్లను ఆదుకునేటువంటి కార్యక్రమం. ఈ డబ్బుతో కోడలు అత్తను బాగా చూసుకుంటున్నది. అత్తను కోడలు ఎందుకు బాగా చూసుకుంటున్నది, నెలకు రూ.1000 వస్తున్నదని. దీన్నీ తీసివేస్తే మీకు అత్తది, కోడలిది రెండూ ఓట్లు రావు. అందుకే కొంచెం జాగ్రత్తగా ఉండమని చెబుతున్నాను.

తమిళనాడులాంటి ఎక్సైజ్ డ్యూటినీ తీసుకొస్తామని అంటున్నారు. చాలా సంతోషం. పేజీ నెం.7, పేరా నెం.2 బడ్జెట్ పుస్తకంలో ఉంది. హోల్‌సేల్ డీలర్‌గా ఏపీబీసీఎల్ ఉన్నారు, రీటైలర్‌గా ప్రైవేటువాళ్లు ఉన్నారు. ఎన్.టి.రామారావు ప్రభుత్వం తరువాత చంద్రబాబునాయుడు గారు అధికారంలోకి వచ్చిన తరువాత బ్రాందీషాపులను విడుదల చేసారు. బ్రాందీషాపులతోబాటు, అందరికీ, అంటే ఎవరైతే మూడు లక్షల రూపాయలు కడతారో వారికి, కూల్‌డ్రింక్‌షాపుల మాదిరిగా లైసెన్స్‌లను కూడా ఇవ్వడం జరిగింది. ఈనాడు పేపర్‌లో కూల్ డ్రింక్స్ షాపులే నయం అని ఒక ఆర్టికల్ కూడా వచ్చింది. గుడి, బడి పేరు పెట్టారు. నూరు అడుగుల లోపు ఉంటే తీసేసారు పోయాయి. దాంతో బ్రాందీ షాపులవాల్లంతా అంతో ఇంతో 10

రూపాయలు సంపాదించుకున్నారు. ఇప్పుడు 5 వేల బ్రాందీ షాపులు ఉన్నాయి. ఇప్పుడు కొత్త పాలసీలో APBCL హోల్‌సేలర్, గవర్నమెంట్ వచ్చి రీటైలర్. అంటే ఎవరి పర్సంట్ మార్జిన్ వాళ్లకు ఇస్తామన్నారా? అది కూడా వాళ్లకు ఎందుకు ఇవ్వాలి. మనమే అంతా తీసుకోవాలనీ ప్లాన్ చేసారు. మీరు సక్సెస్ అయ్యేట్లు ఉంటే. దీంట్లో అధికారుల యొక్క పాత్ర చాలా ఉంటుంది కాబట్టి కొంచెం మీరు కష్టపడితే ఫలితం ఉంటుందో లేదో తెలియదు కానీ, మనం ఆరోగ్య శ్రీ ని శ్రీకాకుళం, అనంతపురం, అదిలాబాద్‌లోని 3 జిల్లాలలో వ్యాప్తి చేశాము. మీరు ఒకే సారి అన్నింటిలో వేలు పెడితే చెయ్యిలు కాలుతాయెమో, మొదటికే మోసం వస్తుంది. కొంచెం జాగ్రత్తపడమని నేను చెబుతున్నాను. మొత్తం రాష్ట్రంలో 4,500 షాపులు ఉన్నాయి. బార్స్ వచ్చి 750 ఉన్నాయి. రెస్టారెంట్లు, క్యాబరే డాన్స్, మెబైల్ షాప్స్, ఇవన్నీకూడా పెడితే ఆదాయం పెరుగుతుందని ఆ ప్రయత్నం చేయవద్దని నేను మీకు సలహ ఇస్తున్నాను.

ఇకపోతే విచిత్రం ఏమిటంటే ఇద్దరు డిప్యూటీ ఛీఫ్ మినిష్టర్స్, రెవెన్యూ ప్రిన్సిపల్ సెక్రటరీతో గతంలో డిపార్టుమెంటల్లీ రిలేటడ్ స్టాండింగ్ కమిటీలో ఒక మీటింగ్ ఏర్పాటు చేసుకున్నాము. అందులో తేలిన అంశమేమంటే చీప్ లిక్కర్ మీద 16 శాతం టాక్స్ వేస్తున్నారు. ఇక్కడ కూడా ఇండియాలో ధనికులు తాగేటువంటి దాని మీద 4 శాతం టాక్స్. ఇతర దేశాల నుంచి వచ్చిన మందుకు మాత్రము టాక్స్ లేదు. డ్యూటీ ఫ్రీ. ఇదేమీ న్యాయం. బీదవారు తాగే మందుకు పన్నులు ఎక్కువ. బీదవారి కంటే పైస్థాయి వారు తాగే మందుకు పన్ను తక్కువ. ఇతర దేశాల నుంచి వస్తున్న మందుకు టాక్స్ లేదు. ఇందులో ఏదో మతలబు ఉంది ఇప్పుడే కాదు మొదటి నుంచి కూడా ఉన్నది. ఇందులో చాలా వరకు ఎవరికి అన్యాయం జరుగుతుందంటే బీదవారికే అన్యాయం జరుగుతుంది. మీరు డబ్బులే సంపాదించాలని అంటున్నారు. మీరు డబ్బులు సంపాదించండి రాష్ట్రానికి అవసరం. ఒక చిన్న మాట చెబుతాను ముంబాయిలో ఒకతను 2కోట్ల రూపాయల కారుకి అడ్వాన్స్ కట్టాడు. సంవత్సరం తరువాత కారు డెలివరి తీసుకున్నాడు. కారు డెలివరి తీసుకున్న తరువాత ఫోన్ వచ్చింది. వాళ్ల ఫ్రెండ్ కి హార్ట్ఎటాక్ వచ్చిందని. ఆ ఫ్రెండ్‌కి ఇతను పది లక్షలు డబ్బు ఇచ్చి ఉన్నాడు. ఎటువంటి పత్రము రాసుకోలేదు. వెంటనే ఆసుపత్రికి వెళ్లాడు. ఆసుపత్రి దగ్గర కారు పెట్టేలోపు ఒక అంబులెన్స్ వచ్చి కారుని కొట్టేసింది. వెంటనే అతను నా కారు పోయింది 20లక్షల రూపాయలు అవుతాయనీ కారు వైపు చూస్తున్నాడు. అక్కడ ఉన్న డాక్టరు నీ కారు పోతేపోయింది, నీ కుడి చేయి విరిగిపక్కన పడింది చూసుకో అని చెప్పాడు. అప్పుడు అతను అవునా నా కుడిచెయ్యి విరిగిపోయిందా, సార్ నా కుడి చెయ్యి కనపడకున్నా పర్వాలేదు. దానికి ఒక డైమండ్ రింగ్ ఉంది దాని వెల 25 లక్షల రూపాయలు, ఆ రింగు తీసిఇవ్వండి సార్ అని అన్నాడు. అతనికి చెయ్యి పోయిందనీ లేదు, డైమండ్ రింగు కావాలి. తరువాత నేరుగా చికిత్స చేసుకోకుండా, అతని స్నేహితుడు ఉన్న బెడ్‌వద్దకు వచ్చి, నా గురించి నా ఫ్రెండ్ ఏమైనా చెప్పాడా, నేను పది లక్షల రూపాయలు ఇచ్చానని అడిగారు. అవును ఇచ్చారు, మీ డబ్బుకు ఏమి ఇబ్బంది లేదు అని చెప్పారు. దీనిని బట్టి తెలిసేదేమంటే, కొందరు డబ్బు కోసమే ఉంటారు. వాళ్లకు ఏమి తోచదు. డబ్బు సంపాదిస్తామనే ఉంటారు. ఇక్కడ 4500 మంది బ్రాందీ షాపులు ఏమి కావాలి. 4500 మంది బ్రాందీ షాపులలో పని చేస్తున్నటువంటి కార్మికుల బ్రతుకులు ఏమి కావాలి. ఇవన్నీ దృష్టిలో పెట్టుకొని అక్కడ పని చేస్తున్నటువంటి కార్మికులకు ఉద్యోగంపై గ్యారంటీ కల్పించాలి. లేకపోతే వాళ్లు మరో బిక్షగాళ్లవుతారని మీ దృష్టికి నేను తీసుకొస్తున్నాను.

Development of Women & Children in Rural Areas. 1982–83 లో Integrated Rural Development Program (IRDP) క్రింద Save Rs.1 per a dayఅనే ప్రోగ్రామ్ తీసుకొని ఒక్క రూపాయి ఆదా చేయండి. దీన్ని మిగులపెట్టుకోండి. మేము మీకు ఇంకా డబ్బులిస్తాము అని ఒక ప్రోగ్రామ్ తీసుకొచ్చారు. అందులో 75 శాతం Government of India, 25 శాతం రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చి డ్వాక్రా

తీసుకొచ్చారు. అంత స్పీడుగా జరగలేదు. తరువాత 91-96 లో పి.వి. నరసింహారావు గారు ప్రధానమంత్రిగా ఉన్నారు.

మ. 12.50

బంగ్లాదేశ్ నుంచి వచ్చినటువంటి కథలన్నీ వినపడి, అక్కడ మైక్రో ఫైనాన్స్ సిస్టంలో బాగా ఎవాల్వింగ్ చెందిందని దానిని ఎక్కువ వేగవంతం చేశారు. అప్పుడు బాగా జరిగిందనే విషయాన్ని ఇప్పుడు సభ దృష్టికి తీసుకువస్తున్నాను. కానీ, ఇప్పుడు ఏం జరుగుతోంది? తెలుగుదేశం పార్టీగా మార్చి, 1982లో ఏర్పడింది. జనవరి 9, 1983లో స్వర్గీయ ఎన్.టి. రామారావు గారు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. ఆగష్టు 16, 1984 వరకు ఆ ప్రభుత్వం ఉంది. ఆ సమయంలోనే నాదెండ్ల భాస్కరరావు గారిది రెండు నెలల పాలన జరిగింది. సెప్టెంబరు 16, 1984 నుంచి 1989 వరకు ఆయనే పరిపాలనలో ఉన్నారు. డిశంబరు 12, 1994 నుంచి సెప్టెంబరు1, 1995 వరకు తిరిగి ఆయనే పరిపాలనలో ఉన్నారు. మధ్యలో 1984 నుంచి 1989 వరకు మీకు తెలిసిందే. సెప్టెంబరు1, 1995 నుంచి మే 13, 2004 వరకు శ్రీ ఎన్. చంద్రబాబు నాయుడు పరిపాలనలో ఉన్నారు. ఈ డ్వాక్రాను భారతదేశంలో పరిచయం చేసే నాటికి టిడిపి పార్టీయే పుట్టలేదు. మరి దీనిని తెలుగుదేశం పార్టీ తెచ్చేసిందని చెప్పుకోవడం ఎందుకు? ఇది జనబాహుళ్యానికి తెలియదు. ఒక అబద్ధాన్ని 10సార్లు చెపితే అదే నిజమయిపోతోంది. అదే డ్వాక్రాను శ్రీ ఎన్. చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చిన తరువాత, ఆర్గనైజేషన్‌ని ఇన్‌స్టిట్యూషనలైజేషన్ చేశారు. చట్టంలో ఏం ఉందో, దానినే ఫుల్‌స్టాపు, కామా మార్చకుండా చేశారు. కాకపోతే దాని పేరు మార్చారు అంతే. డా. వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి గారు అధికారంలోకి రాగానే దాని పేరు మార్చేసి పావలా వడ్డీ పథకం అని పెట్టారు. పెట్టుబడి పెట్టేవారికి ఆ పథకం ఇచ్చారు. ఆ తరువాత శ్రీ ఎన్. కిరణ్ కుమార్ రెడ్డి అధికారంలోకి వచ్చారు.

డా. వై. ఎస్. రాజశేఖర్ రెడ్డిగారు ఇందిరా క్రాంతి పథకాన్ని తీసుకువచ్చారు. ఆ తరువాత పావలా వడ్డీ వచ్చింది. శ్రీ ఎన్. కిరణ్‌కుమార్ రెడ్డిగారు వచ్చిన తరువాత రూ.5 లక్షల వరకూ వడ్డీ లేదని ఆ పథకాలను అభివృద్ధి చేశారు. ఇందులో శ్రీ ఎన్. చంద్రబాబు నాయుడి పాత్ర లేదని చెప్పడం లేదు. ఆయన పాత్ర ఉంది. కానీ దీనిని పుట్టించింది మాత్రం కాంగ్రెస్సే. దానిని శ్రీమతి ఇందిరా గాంధీ గారి నేతృత్వంలో పెంచి, పి.వి. నరసింహారావు గారి హయాములో పోషించారని తమ ద్వారా గౌరవ సభ్యుల దృష్టికి తీసుకువస్తున్నాను.

ఇక ఇన్ఫర్‌మేషన్ టెక్నాలజీకి సంబంధించి చూసినట్లయితే, Information Technology was introduced in India in 1974 by Tata Consultancy Services (TCS). అప్పుడు దానిని ఇండస్ట్రీగా గుర్తించలేదు. శ్రీ రాజీవ్ గాంధీ గారు ప్రధానమంత్రి అవుతూనే 1984లో New computer policy తీసుకుని వచ్చారు. In that, computer sector was recognized on par with industry and de-licenced. ఇవన్నీ చేశాక బ్యాంకులు ఋణాలు ఇవ్వడానికి ముందుకు వచ్చాయి. ఇన్ఫోసిస్, కంప్యూటర్ ఆర్గనైజేషన్స్ అన్నీ వచ్చేశాయి. మనం శ్రీ రామలింగరాజు గారికి కూడా థాంక్స్ చెప్పాలి. ఆయన అమెరికాకు వెళ్ళారు. ఇది నేను ఒక ఆర్టికల్‌లో చదివాను, ఆయన నాతో ఏం మాట్లాడ లేదు. అక్కడ అమెరికాలో రాత్రి అయితే, ఇక్కడ పగలు, ఇక్కడ పగలు అయితే, అక్కడ రాత్రి. రెండు సిస్టములను అభివృద్ధి చేస్తానని వాటిని రామలింగరాజు గారు ఆంధ్రప్రదేశ్‌కు తీసుకువచ్చారు. మనకన్నా ముందు బెంగుళూరు తీసుకువచ్చింది. ఆ తరువాత తమిళనాడు, తరువాత మనం తీసుకువచ్చాము. మనకు రూ.25లు వస్తే, బెంగుళూరుకు రూ.40లు వచ్చింది. మనకు రూ.40లు వస్తే, వాళ్ళకి రూ.70లు వచ్చింది. ఈరోజుకి కూడా సౌత్ ఇండియాలో బెంగుళూరే ప్రథమ స్థానంలో ఉంది. దీనిని ఎవరూ పరిచయం చేయలేదు. అప్పుడు 1978లో ఎవరు ఉన్నారు. ఇక్కడ అసెంబ్లీ నడుస్తోంది. వెంకయ్య నాయుడుగారు అప్పుడు ప్రతిపక్షంలో

ఉన్నారు. నేను ఇక్కడ గ్రంథాలయానికి వెళ్ళి కొన్ని పుస్తకాలు చదివితే, నాకు కొన్ని విషయాలు తెలిశాయి. అప్పుడు ఆయన సభలో ఏమన్నారంటే – ఈ ఐటి మనకు ఎందుకు? టీ నీళ్ళకు గతి లేకపోతే టీ.వీ.లా? కాఫీ నీళ్ళకి గతి లేకపోతే కంప్యూటర్లా? ఆహారానికి గతి లేకపోతే ఫ్యాక్సులా? ఇవన్నీ అసెంబ్లీలో చెప్పారు. అప్పుడు యూనియన్ లీడర్లు కూడా వచ్చారు. కొందరు మా మిత్రులు బాధపడతారేమో కూడా. కంప్యూటరైజేషన్ జరగడం వలన లేబర్ ఇబ్బందిపడుతుందని, పనులు జరగవని అన్నారు. ఈరోజు అర్థ రాత్రి 12.02 ని.లకు బ్యాంకులో డబ్బులు పడితే, మనం చూసుకుంటున్నాం. తెల్లవారితే ఎయిర్‌పోర్టుకు వెడుతూ, మధ్యదారిలో ఏ.టి.ఎం. నుండి డబ్బులు డ్రా చేసుకుని వెడుతున్నాం. ఆదివారంనాడు కూడా డబ్బులను తీసుకుంటున్నాం. We have to thank, we have to salute Sri Rajiv Gandhi for introducing IT system in India. అలా కాకుండా ఐ.టి. రంగాన్ని నేను తెచ్చాను అని చెప్పడం ఎంతవరకు సబబు? ప్రభుత్వం జాగా ఇస్తే, అక్కడ ప్రజలు ఇళ్ళు కట్టుకున్నారు, అది ముచ్చటగా ఉంది. అందులో 11 శాతం మనకు ఇస్తున్నారు. ఐ.టి. రంగాన్ని శ్రీ రాజీవ్ గాంధీ గారు భారతదేశానికి తీసుకువచ్చారు తప్ప, వేరే వాళ్ళ యొక్క పాత్ర ఏమీ లేదు. 1974లోనే టిసిఎస్‌ను తీసుకువచ్చిన విషయాన్ని మీ దృష్టికి తీసుకు వస్తున్నాను తప్ప మరేమి లేదు.

అధ్యక్షా, షెడ్యూల్డు ట్రైబ్స్ అంటే నాకు వల్లమాలిన ప్రేమ. ఈ సంవత్సరం బడ్జెటులో రూ.993కోట్లు పెట్టారు. గత సంవత్సరం రూ.1150కోట్లు పెట్టారు. సుమారు రూ.160కోట్లు తగ్గింది. నోరు లేని గిరిజనులకు ఎంత చేస్తే వారి ఋణం తీరుతుంది? ఒక ప్రక్క 34 కులాలు అంటారు. గతంలో గవర్నరుగారి ప్రసంగంలో 34 అన్నారు, ఇప్పుడు 35 కులాలు అయినాయి. ఈ ప్రభుత్వాల దృష్టిలో ఎన్ని కులాలు ఉన్నాయనే సంగతి కూడా తెలియదని ఇరు రాష్ట్రాల గవర్నరుగారి ప్రసంగాలని ఒకసారి చూడమని చెపుతున్నాను.

'గిరిపుత్రికా కళ్యాణం' పథకం అని పెట్టి వారికి రూ.50,000లు ఇస్తామని అంటున్నారు. మంచిది. వారు పెళ్ళి చేసుకున్నప్పుడు వారికి ఇవ్వవలసిందే. దీనికి నేను ప్రభుత్వానికి ఒక సలహా ఇస్తున్నాను. గిరిజనులు తలా ఒక చోట ఉంటారు. అక్కడ వారికి ఒక మనిషిని పెట్టి, నూరు శాతం సబ్సిడీతో ఒక ఆటోను ఇస్తే, రాత్రిళ్ళు వారికి పాములు కరచినా, గర్భిణీ స్త్రీలను ఎటువంటి ఇబ్బందులు లేకుండా దగ్గరలోని ఆసుపత్రులకి తీసుకు వెళ్ళడానికి అవకాశం ఉంటుంది. కాబట్టి, ఈ ప్రభుత్వం గిరిపుత్రికా కళ్యాణం బదులు ప్రతి కాలనీకి ఒక కార్యకర్తని పెట్టి, వారికి ఒక ఆటోని ఇవ్వండి. ఇది కూడా మీ కార్యకర్తలకి, గిరిజనులకే ఇవ్వండి. పాము కరచినా, వారిని త్వరగా ఆసుపత్రికి తీసుకువస్తే వాళ్ళు బ్రతుకుతారు. అలాగే గర్భిణీ స్త్రీలకు కూడా మేలు జరగడానికి అవకాశం ఉంటుంది కాబట్టి, ఈ ప్రభుత్వం గిరిజనుల గురించి ఆలోచించాలని తమ ద్వారా కోరుతున్నాను.

Literacy among women is very very poor in ST community. వారికి పది మంది ఉంటే మాకు 40 మంది పిల్లలు ఉండి బడి కావాలని అంటున్నారు. ఇది ఎస్టీ కమ్యూనిటీ. వారిలో లిటరసీ పెంచేదానికి 10 మంది ఉన్నా సరే, మీరు ఒక పాఠశాలను పెట్టండి. లేకపోతే, రిమోట్ ఏరియా గురుకుల పాఠశాలను పెట్టండి. సుమారు 300 మందిని పెట్టండి. మనకు ఉన్న గురుకుల పాఠశాలలే అలా ఉన్నాయి. కోడూరులో మినీ గురుకుల పాఠశాల ఉంది. దాదాపు ఆ పాఠశాలను నేను దత్తత తీసుకున్నట్లుగా నేను పనిచేస్తున్నాను. అందులోని ఉపాధ్యాయులకు సుమారు రూ.4,.000ల జీతం ఇస్తున్నారు. అక్కడ 12 మంది వరకూ ఉపాధ్యాయులు ఉన్నారు. మనకు సభలో సోషల్ వెల్ఫేర్ మినిస్టరు హామీ ఇచ్చి ఉన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో డా. వై.ఎస్. రాజశేఖర్ రెడ్డిగారు ముఖ్యమంత్రిగా ఉన్న హయాములో కేంద్రప్రభుత్వం రూ.3,000లు ఇస్తే, రూ.1200లు రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వగా మొత్తం రూ.4,200లు వారికి జీతం రూపంలో

ముడుతున్నది. వీరికి కూడా జీతాలు పెంచమని అడిగితే, తప్పనిసరిగా ఇస్తామని, తాము రోజుకు రెండు ఇడ్లీ తిని బ్రతుకుతున్నానని అన్నారు. ఇది ఇంక ఎన్ని సంవత్సరాల బడ్జెట్‌లో చెపుతారో చూడాలి.

ఇక హెల్త్‌కి సంబంధించింది. ఇది మన ఆరోగ్యానికి చాలా ముఖ్యమైన అంశం. ప్రసంగంలోని పేజి నెం.31, 32; పేరా నెం. 91 నుంచి 104 వరకు ఉన్నది. అందులో బడ్జెట్ కేటాయింపులు సుమారు. రూ.5,728కోట్లు మంచిదే. కానీ, ఏం జరుగుతోంది? మాకు చిన్నప్పుడు హెల్త్ ఇన్‌స్పెక్టర్ ఉండేవారు. ఆయన చాలా పవర్‌ఫుల్. ఆ తరువాత రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ అంత పవర్‌ఫుల్‌గా ఉండేవారు. ఆయనని చూసి అదిరిపోయే వారు. సబ్‌ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ మూడవ కేటగిరి. ఇప్పుడు హెల్త్ ఇన్‌స్పెక్టర్ సిస్టమే లేదు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌ను ఎస్ఐ పిలిచి నిలబెడుతున్నారు. ఇప్పుడు Police Inspector is more powerful than these two Inspectors. In Gulf countries, Health Inspector is supreme. ఆయన సర్టిఫై చేస్తే లోపల వేసేస్తున్నారు. ఫలానా తేదీకి ఎక్స్‌పైర్ అయిపోయిందంటే, చూసి, లైసెన్సును రద్దు చేసే స్తున్నారు. మీరు పోలీస్ డిపార్టుమెంటును పెద్దఎత్తున చూస్తున్నారు. హెల్త్ డిపార్టుమెంటును తగ్గించేస్తున్నారు. ఈ దేశంలో జ్వరానికి మాత్రలు మా చిన్నప్పుడు పావలాకి 4 బిళ్ళలు వచ్చేవి. ఒక బిళ్ళ వేసుకుంటే జ్వరం పోయేది. ఇప్పుడు జ్వరానికి సుమారు రూ.400లు ఖర్చు పెట్టవలసి వస్తోంది. చెయ్యి పట్టుకుంటే నూరు రూపాయలు, చెయ్యి విడిస్తే నూరు రూపాయలు. ఇవన్నీ ఎంతగానో దోచేస్తున్నారు. బీదవారు చాలా మంది ఉంటున్నారు. అందుకని ఇక్కడ బల్క్ డ్రగ్ ఉత్పత్తి అవుతున్నా మెడిసినల్ వాల్యూ పెరుగుతోంది. ఇతర దేశాలకు వెడితే, అక్కడ నుంచి మాత్రలు వస్తున్నాయి. దీనికి నేను హెల్త్ డిపార్టు మెంటుకు సంబంధించి ఒక చిన్న సలహా ఇవ్వదలచుకున్నాను. ఇప్పుడు మనం చేయవలసిందల్లా ఒకటే. జనతా మందులషాపులు పెట్టాలని ప్రభుత్వాలు ఎప్పటి నుంచో అంటున్నాయి. పది మందుల షాపులతో పాటు ఈ మందుల షాపును కూడా పెట్టండి. బయట మందుల కంటే మీరు కొంచెం తగ్గించి అమ్మండి. అందులో కూడా మీకు 40శాతం, 50 శాతం వాటా కూడా వస్తోంది. అది మీకు మిగిలిపోతుంది. ఇతర దేశాల నుంచి ఈ రాష్ట్రానికి వస్తున్న మందులు ఎంతో కమర్షియల్ ట్యాక్సు మినిస్టర్‌ని అడిగితే చెపుతారు. ఈ రాష్ట్రంలోని వెల్త్ అంతా ఇతర రాష్ట్రాలకు బల్క్‌డ్రగ్స్ రూపంలో వెళ్ళిపోతోంది.

మ. 1.00

శ్రీ బి.చెంగల్ రాయుడు : సాధారణంగా పల్లెల్లో కూరగాయలు తీసుకువెళ్లి రెండు రూపాయలకే వేసొస్తారు. మళ్లీ రూ.20 ఖర్చుపెట్టి కూరగాయలు కొనుక్కొచ్చుకుంటారు. అలాగే, మనం బల్క్ డ్రగ్స్ ఇక్కడ నుండి ఇతర దేశాలకు పంపిస్తున్నాము. Thankful to IDPL. ఐడీపీఎల్ వల్లనే బల్క్ డ్రగ్ వచ్చింది. ఐడీపీఎల్‌లో పనిచేసిన వాళ్లంతా డ్రగ్స్ టెక్నాలజీ నేర్చుకుని సొంత వ్యాపారాలు పెట్టుకున్నారు. ఈ రోజు బల్క్ డ్రగ్ ఇండస్ట్రీలో ఉన్న వాళ్లంతా, ఆ రోజున ఐడీపీఎల్‌లో పనిచేసిన వాళ్లే. పండిట్ జవహర్ లాల్ నెహ్రూ గారు ఆ రోజే చెప్పారు. రాష్ట్రంలో ఐడీపీఎల్ ఏర్పాటు వల్ల చుట్టుప్రక్కలంతా దాని ప్రభావం పనిచేస్తుందన్నారు. తద్వారా నేను మీకు చెప్పదల్చుకున్నది ఒక్కటే. ప్రస్తుతం హైదరాబాదులో చిన్న బ్లడ్ టెస్ట్ చేయించుకుంటే రూ.2400/- ఖర్చవుతుంది. విజయవాడలో రూ.1800/-. కాబట్టి, రాష్ట్ర ప్రభుత్వం తరఫున ప్రతి మండల హెడ్‌క్వార్టరులో బ్లడ్ టెస్ట్, ఇసిజి, ఎక్స్‌రే తీయించుకునేందుకు ఏర్పాట్లు చేయండి. ఎక్స్‌రే ఫిల్మ్ కాస్ట్ కేవలం రూ.7/-. అది తీయడానికి కూడా ఎంత తీసుకుంటున్నారు? రూ.250 వసూలు చేస్తున్నారు. ఇసిజి జానెడు పేపరు. మరి దానికెంత తీసుకుంటున్నారు? రూ.2000/- నుండి రూ.5000/- వరకు వసూలు చేస్తున్నారు. బ్లడ్ మన పేరుతో తీసుకుని, దాన్ని మళ్లీ మనకివ్వడానికి కూడా యూనిట్‌కు రూ.2400/- తీసుకుంటున్నారు. పది రూపాయలతో అయ్యేదానికి కూడా ట్యాక్స్‌లు వేస్తున్నారు. కోటీశ్వరులు, కుబేరులు ఎక్కడికన్నా పోనివ్వండి. కానీ, పేదవాళ్లకు సంబంధించి మాత్రం నేను చెప్పే కాన్సెప్ట్‌ని అమల్లోకి తీసుకురండి. ఒక ఊర్లో, ఒక మండల హెడ్‌క్వార్టర్లో

పది వేల జనాభా ఉన్నచోట డయోగ్నాస్టిక్ సెంటర్స్ కట్టించండి, వాళ్లకు టెస్ట్‌ల కోసం ఉపయోగించండి. ఈ రోజు రాష్ట్రంలోని ఆసుపత్రుల్లో డాక్టర్లు, ప్యారామెడికల్ సిబ్బంది లేక మూతపడే స్థాయికి వచ్చాయి. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకుని, మీ ద్వారా రాష్ట్ర ప్రభుత్వాన్ని నేను ఒక్కమాట అడుగుతున్నాను. ఈ రోజున డయోగ్నాస్టిక్ టెస్ట్‌లకు ఎక్కువ ఖర్చుపెట్టే పరిస్థితులు వచ్చాయి కాబట్టి, కొన్ని జాగ్రత్తలు తీసుకోవాల్సిందిగా నేను మీ ద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను. తరువాత, స్త్రీ, శిశు సంక్షేమం..

ఛైర్‌పర్సన్ : దయచేసి, మీ ప్రసంగాన్ని పూర్తి చేయండి. ఒంటి గంట అవుతోంది. ఇంకా మాట్లాడాల్సిన సభ్యులున్నారు.

శ్రీ బి. చెంగల్ రాయుడు : అమ్మా, మాట్లాడుతోంటే దాహమౌతోంది గానీ, ఆకలి కావడం లేదు.

ఛైర్‌పర్సన్ : కరెక్టే. మీరు సీసాల మీద సీసాలు నీళ్లు తాగినప్పుడు ఇంకేం ఆకలౌతుంది!

శ్రీ బి. చెంగల్ రాయుడు : అమ్మా.. సీసాలని కాదు, గ్లాసులని అనండి. నేను సీసాలు తాగే వాడి మాదిరిగా కనపడుతున్నానా తల్లీ!

ఛైర్‌పర్సన్ : ముందు మీరు సీసాల్లో తాగారు.

(సభలో నవ్వులు)

శ్రీ బి. చెంగల్ రాయుడు : అధ్యక్షా, పేజీ నెం.26, పేరా నెం.75-77లో రూ.1,080 కోట్లు స్త్రీ, శిశు సంక్షేమానికి కేటాయించారు. రాష్ట్రవ్యాప్తంగా 50,000 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. టీచర్లు 50,000 మంది ఉంటారు. హెల్పర్లు 50,000 మంది ఉంటారు. తరువాత, మినీ అంగన్‌వాడీలు 6,839 ఉన్నాయి. అందులో టీచర్లు కూడా అంతమందే ఉంటారు. 2008లో కాంగ్రెస్ గవర్నమెంట్ డా.వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి గారు ముఖ్యమంత్రిగా ఉండగా గవర్నమెంట్ ఆఫ్ ఇండియా వారిని నిధులు కేటాయించాలని అడిగారు. మేము అంగన్‌వాడీ టీచర్లకు రూ.3,000/- ఇస్తున్నాము, మీరు కూడా నిధుల కేటాయింపులు పెంచాలన్నప్పుడు, వాళ్లు మేము ఇవ్వలేమని చెప్పారు. మీరు రూ.3000/- నుండి రూ.1200/- పెంచి, రూ.4,200/- అంగన్‌వాడీ టీచర్లకు జీతాల క్రింద ఇస్తున్నారు. ఆయాలకు, హెల్పర్లకు అంతకు ముందు రూ.1500 వస్తుండేది, దాన్ని మరో రూ.700/- పెంచి, రూ.2200/- ఇవ్వడం జరిగింది. ఈనాటికీ వారు అదే జీతాలతో గడుపుతున్నారు. వాస్తవానికి వాళ్లు ఎన్ని పనులు చేస్తారమ్మా! ఈ విషయాన్ని చాలా సీరియస్‌గా తీసుకోవాలి. కడుపులో బిడ్డ పడ్డ దగ్గర నుండి, మూడవ నెల అని తెలిసిన దగ్గర నుండి గర్భిణీ స్త్రీలకు వాళ్లకు సేవలు చేస్తున్నారు, డెలివరీ పనులు చూస్తున్నారు. ప్రసవ సమయంలో గవర్నమెంట్ హాస్పిటల్‌కు అంబులెన్సుల్లో తీసుకువెళ్లి కాన్పులు చేయిస్తున్నారు. మూడవ నెల నిండుతూనే వాళ్లకు న్యూట్రిషన్ ఫుడ్ పెడుతున్నారు. ఇప్పుడు పెట్టడం లేదనుకోండి అది వేరే విషయం. బిడ్డ పుట్టిన తరువాత, బిడ్డ సంరక్షణ మూడేళ్ల వరకు చూస్తున్నారు. మూడేళ్ల తరువాత, అంగన్‌వాడీ స్కూళ్లలో చేర్పిస్తున్నారు. ఇవన్నీ ఒకవైపు.

ఇప్పుడొక కొత్త విధానం రాష్ట్రంలో ఉంది. బూత్‌లెవల్ ఆఫీసర్లు ఓటరు లిస్టులో ఎంతమంది బ్రతికున్నారు, ఎంత మంది చనిపోయారనే వివరాలు సేకరిస్తారు. ఆ పని చేసేది కూడా వీళ్లే. జన్మభూమి, పల్లెబాట, పొలంపిలుస్తోంది వంటి వాటికి కూడా వాళ్లే వెళ్లాలి. అలాంటి వాళ్లంతా ఇవాళ నిరాహారదీక్షలో కూర్చుని ఉన్నారు. ఇవాళ మంత్రి గారు మంచి రిప్లై ఇచ్చారు. మేమందరం వెళ్లి మేనకా గాంధీ గారిని కలిసి ఒక లెటరిచ్చాము, ఆమె పరిశీలిస్తామని చెప్పిందని అన్నారు. బిజెపి గవర్నమెంట్ ఎప్పుడూ పరిశీలిస్తామని చెప్పదండీ. ఒకవేళ చేస్తే, చేస్తామంటారు, లేకపోతే మా వల్ల కాదంటారు. స్మృతి ఇరానీ గారు అనుభవం లేనావిడ లేదని చెప్పేసింది. హౌస్‌ని తృప్తిపరిచేందుకు చెప్పేసింది. మేమున్నప్పుడు రూ.1200/- ఎక్స్‌ట్రా

ఇచ్చాము, మీరు రూ.2400/- ఇవ్వండి. ఆ విధంగా ఇచ్చి అంగన్‌వాడీ టీచర్లని, ఆయాలను, మినీ అంగన్‌వాడీలను ఆదుకోండి.

ఈ రోజు ఉదయమే కోడూరు నుండి ఒక అంగన్‌వాడీ టీచర్ ఫోన్ చేసింది. సార్, పోలీసులందరూ మా ఇళ్ల దగ్గరకు వస్తున్నారు, మేం హైదరాబాదుకు బయలుదేరుతున్నాము సార్ అని అంది. మీ బుద్ధి పుట్టిన చోట దాక్కోమ్మా, పోలీస్ స్టేషన్లో ఉన్నా ఫర్వాలేదు, మీరొచ్చినా, మేమొచ్చినా చేసే పనులు మేము చేస్తాము. మీ తరఫున కొన్ని వింగ్స్ పనిచేస్తున్నాయి, మీకు ద్రోహం చేయలేదమ్మా, మేము చేసే ప్రయత్నాలు మేము చేసాము, మీ విషయాన్ని నేను హౌస్‌లో కూడా అడుగుతాను అని చెప్పాను. మీరు వాళ్లు కోరిన జీతాలు ఇవ్వకపోతే ఇవ్వకపోయారు, కనీసం అరెస్టులనైనా ఖండించండి. ఆ అరెస్టులు జరగకుండా చూడండి. ఆడవాళ్ల ఉసురు మీకు తగులుతుంది. అది మీకు మంచిది కాదు. వాళ్లతో ఉదయం 6 గంటల నుండి మ.12 గంటల వరకు, మ.12 గంటల నుండి సా.08.00 గంటల వరకు పనంతా చేయించుకుని, వాళ్లకి రూ.3,000/- నుండి రూ.4,200/- వరకు మీరు చేతిలో పెడుతున్నారు. ఆడబిడ్డలకు అన్యాయం చేస్తే అది మీకు అరిష్టమని తెలియజేసుకుంటున్నాను. వారి శాపనార్థాలు మీకు తగలకూడదు, వాళ్ల కళ్ల నుండి కన్నీరు రాకూడదని మీకు తెలియజేస్తున్నాను. ఇది మంచిది కాదని మీకు మనవి చేస్తున్నాను.

ఇకపోతే పిల్లలకు బాలామృతం పెట్టారు. శ్రీమంతం చేశారు, డెలివరీ చేశారు. గత ఆరు నెలల నుండి ఏపీ ఫుడ్స్ వారు ఒక్క గ్రామానికి కూడా న్యూట్రిషన్ ఫుడ్ సప్లై చేయలేదు. ఎందుకంటే - రూ.100 కోట్లు వాళ్లకు మనం బకాయిపడ్డాము. ఆ వంద కోట్లు వాళ్లకి చెల్లిస్తే వాళ్లు మనకు ఫుడ్ సప్లై చేస్తారు కదా? మళ్లీ 10 వ షెడ్యూలు మేరకు, షీలా బేడీ కమీషన్ వారు ఎవరి భాగాలు వాళ్లకి తేల్చేస్తారు కదా? మంత్రి గారికి మీ ద్వారా ప్రత్యేకంగా తెలియజేస్తున్నాను. తెలంగాణాలో తుమ్మల నాగేశ్వర రావు గారు ఒకప్పుడు మనకు అనుకూలంగా ఉన్న వ్యక్తే మంత్రిగా ఉన్నారు. ఏపీ ఫుడ్స్ బకాయిలను మీరు వెంటనే కట్టేయండి. ఎందుకంటే, ఏపీ ఫుడ్స్ వారందించే ఫుడ్ సౌతిండియాలో నెంబర్‌వన్ ఫుడ్. తమిళనాడు, కర్నాటకలు కూడా మన దగ్గర నుండే తీసుకెళ్లారు. వాళ్లు మేము ఆర్డరిస్తామనంటే, మేం సప్లై చేయలేమని తెలంగాణా ఫుడ్స్ (గతంలో ఏపీ ఫుడ్స్) వారు అంటున్నారు. ఈ రోజు అట్లాంటి పరిస్థితుల్లో పిల్లలకు అందాల్సిన బాలామృతం లేదు. ఇప్పుడు పరిస్థితి 'గోరుముద్దలు' దాకా వచ్చింది. గోరుముద్దల ప్రోగ్రాం గురించి మళ్లీ చెబుతానమ్మా..

ఛైర్‌పర్సన్ : దయచేసి పూర్తి చేయండి. మ.12.50 కి ప్రసంగం మొదలుపెట్టారు మీరు. రెండు గంటలు మాట్లాడితే ఎలా?

శ్రీ బి. చెంగల్ రాయుడు : అవునమ్మా.. రెండు గంటలేనమ్మా నేను మాట్లాడేది. ప్రతిపక్షానికి రెండు గంటల సమయముందమ్మా. కొంచెం శాంతం వహించండమ్మా.

ఛైర్‌పర్సన్ : రెండు గంటలు ఎట్లా ఇస్తారండీ? ఇంకా మాట్లాడవలసిన సభ్యులున్నారు.

శ్రీ బి. చెంగల్ రాయుడు : రేపు, మర్నాడు మాట్లాడతారు. కొంచెం శాంతం వహించండమ్మా. అధ్యక్షా, మన రాష్ట్రానికి డబ్బు కావాలంటున్నారు. ట్యాక్సులు వేయమని అంటున్నారు. మీరు ట్యాక్సులు వేయనందుకు ధన్యవాదాలు. ఏదో డీజిల్ మీద ట్యాక్సులు వేశారు. రాజధాని ట్యాక్సు వేస్తామంటున్నారు. ఆ ట్యాక్సు ఇప్పుడు వేసే పరిస్థితులు లేవు. వేయాల్సిన పన్లేదు కూడా. కేంద్రం ఆదుకుంటుందని నేను ఆశిస్తున్నాను. మీరు ఎక్కడపడితే అక్కడ ల్యాండ్-శాండ్, వైన్-ఫైన్, ఫారెస్టు వీటన్నింటి మీదా డబ్బు కావాలంటున్నారు. 50 శాతం దానికీ, దీనికని అన్నారు. వాళ్లకేదో 25 పర్సంట్ అన్నారు. రాజధానికి భూములిచ్చిన వాళ్లు ఏమనుకుంటున్నారో మీకూ తెలుసు, నాకూ తెలుసు.

ముఖ్యంగా శాండ్ విషయానికి వస్తే, ఎప్పుడూ లేని విధంగా, బ్రిటీష్ వాళ్లకు కూడా తెలియని పన్నుని మీరు శాండ్ మీద వేశారు. క్యూబిక్ మీటరుకు రూ.650/– చొప్పున పన్ను వేశారు. ట్రాక్టరుకు రూ.2000/–, మీసేవకు రూ.50/–, కిలోమీటరుకు రూ.30/–. నాకు తెలిసి నెల్లూరులో 1500 ఎడ్లబండ్లు ఉన్నాయి. ఉదయాన్నే భార్యాభర్తలు ఎండ్లబండితో వెళ్లి, ఇసుక పోసుకుని టౌన్లోకొచ్చి రూ.350/– కి అమ్ముకుని, తిరిగి సాయంత్రానికి పశువులకు పెట్టడానికి రూ.150/– కి గడ్డి కొనుక్కుని ఇంటికి వెళతారు. అలా మిగిలే రూ.200/–లతో భార్యాభర్తలు బ్రతుకుతారు. తిరుపతిలో 1200 ఎడ్లబండ్లు ఉంటాయి. వాళ్లందర్నీ ఏట్లోకి పోతూనే రూ.650/– పన్ను కట్టమంటున్నారు. అవి కట్టలేక మేము ఎద్దులను అమ్ముకోవాల్సి వస్తుందని వాళ్లంటున్నారు. కనీసం ఆ ఎడ్లబండ్లకన్నా మీరు ఎగ్జంప్షన్ ఇవ్వండి. అసలు ఇసుకకు పన్నులు వేయడమేమిటండీ? ఏట్లో దొరికే ఇసుకకు కూడా మనమేమన్నా కష్టపడ్డామా? మడక దున్నామా, పైరు పెట్టామా, గడ్డి తీశామా, కోత కోశామా! ఏదో ఏట్లో ఇసుక వచ్చింది. అందరూ తీసుకునిపోతారు. తీసుకుపోనివ్వండి. మీ రాష్ట్ర ప్రభుత్వం ఇసుక రవాణాని పటిష్టం చేసి, మహిళా స్వయం సహాయక సంఘాలకి లీజుకిస్తే మీ సొమ్మేంపోతుందన్నారు. ఇంతా చేసి, మహిళా సంఘాలకు మీరు ఏమీ ఇవ్వడం లేదు. ట్యాక్సు క్రింద వసూలు చేసే మొత్తం రూ.650/– లో రూ.5/– మాత్రమే వాళ్లకిస్తున్నారు. రూ.40/– సీనరేజీ చార్జెస్, రూ.5/– వాళ్ల మెయింటెనెన్స్. పేరుకే మహిళా సంఘాలు.

ఇక్కడ ఇంకొకటి కూడా ఉంది. 25 శాతం మహిళా సాధికారతకు, 75 శాతం రైతు సాధికారతకు అన్నారు. ఇక్కడ విచిత్రమేమంటే, మాన్యువల్‌గా ఇసుక తవ్వకానికి ఒక్కొక్క క్యూబిక్ మీటర్‌కు రూ.178/–, మెషినరీతో తీసుకోవడానికి రూ.221, ఏట్లోకి పోయి తెచ్చుకుంటే రూ.330/–. మీరు పిలిచింది దానికి సరిపోయింది. ఇంకా గవర్నమెంట్ చేసేదేముంది? మూడు నెలల నుండి ఇసుక రవాణాకు ట్రాక్టర్లు బాడుగకు పెట్టారు కదా? కిలో మీటరుకు రూ.30/– చొప్పున మీరు ఇస్తామన్నారు.

మ. 1.10

3 నెలలనుంచి ట్రాక్టర్లు పెట్టిన వారికి ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. ఈ డబ్బులు వస్తాయని గ్రామ సర్పంచ్‌లు, మండల ప్రెసిడెంట్‌లు, జిల్లాపరిషత్ ఛైర్మన్లు ఎదురు చూస్తున్నారు. వారికి కూడా ఒక్క రూపాయి ఇవ్వలేదు. తీసుకున్న డబ్బంతా మన ట్రెజరీలోనే వేసుకున్నాము. "పొరపాటున కూడా సీజ్ చేసిన డబ్బులు మీరు పంపిణీ చేస్తారేమో చేయకూడదు. ఆ డబ్బులు మా ఖజానాకివ్వండి, మాఖజానాకు ఇచ్చిన తర్వాతనే మేము మీకు ఇస్తామని" చెప్పారు. దొరికిన ఎర్రచందనాన్ని మాత్రమే సాధారణంగా అమ్ముతారు. మేము అడవులలో నరుకుతామని స్వయంగా ముఖ్యమంత్రిగారే చెప్పారు. ఇంట్లో ఎలుక ఉంటే ఆ ఎలుకను పట్టుకోవలసింది పోయి ఆ ఇంటికే నిప్పుపెడతారా ఎవరైనా? అడవులను నరికివేస్తారా? ఒక చెట్టు లక్ష విత్తనాలను ఇస్తుంది. ఎర్రచందనానికి అడవితల్లే జన్మనిచ్చింది, అడవితల్లే సాకింది, అడవిలోనే పెరగాలి. పొరపాటున ఈ స్మగ్లర్ల చేతిలో పడిన దానిని ప్రభుత్వ ఆస్తిగా భావించి ఆ ఎర్రచందనాన్ని అమ్మాలి కానీ, అడవులను నరికే కార్యక్రమాన్ని చేయవద్దని నేను తమరిద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

అధ్యక్షా, మన రాయలసీమ ప్రాంతంలో అన్ని జిల్లాల నుంచి అనేకమంది రాష్ట్రపతిగా, ప్రధానమంత్రిగా, ముఖ్యమంత్రులుగా, స్పీకర్‌గా పనిచేసిన వారున్నారు. చిత్తూరు జిల్లా నుంచి ఇద్దరు ముఖ్యమంత్రులు, తిరుపతి నుంచి పార్లమెంటు మొట్టమొదటి స్పీకర్, కర్నూలు జిల్లా నుంచి ఇద్దరు ముఖ్యమంత్రులు, ఒక ప్రధానమంత్రి, కడప జిల్లా నుంచి ఒక ముఖ్యమంత్రి, అనంతపురం జిల్లా నుంచి ఒక ముఖ్యమంత్రి మరియు రాష్ట్రపతి గతంలో పనిచేశారు. ఇంతమంది మన రాయలసీమ జిల్లాలనుంచి దేశరాజధానిలో, రాష్ట్ర రాజధానిలో పనిచేసినా మన ప్రాంతానికి త్రాగడానికి గుక్కెడు నీళ్లు కూడా లేవు. ఇంత ఘోరమా? ఈమధ్యనే నేను భీమవరానికి వెళితే బర్రెలు నీళ్లలో ఈదుతున్నాయి. వచ్చే జన్మలో ఈ బర్రెగా

పుట్టి ఈ నీళ్లలో ఈదే అవకాశం నాకు కల్పించాలని నేను మొక్కుకుని వచ్చాను. అంటే, అక్కడున్న బర్రెలు పుణ్యం చేసుకున్నాయని నేను చెబుతున్నాను. రాయలసీమ ప్రాంతంలో హంద్రీ-నీవా, గాలేరు-నగరి ప్రాజెక్టులున్నాయి. మాకు త్రాగడానికి 1500 అడుగుల లోతున నీరు దొరుకుతుంది. ఆ నీరు కూడా ఇప్పుడు ఎండిపోయింది. కొత్తబోర్లు వేయరాదని, బోర్లనుంచి నీరు తెచ్చుకోవాలని, రవాణా ఖర్చులు పెట్టమని ప్రభుత్వం ఆదేశాలను కూడా జారీచేసింది. ఎంతకు పెట్టారంటే, గాలేరు-నగరి ప్రాజెక్టుకు రూ. 170 కోట్లు, హంద్రీ-నీవా ప్రాజెక్టుకు రూ.212 కోట్లు పెట్టి జూన్ నెలకు నీరు ఇస్తామని చెప్పారు. గ్లాసులో నీరు తెచ్చిఇస్తారేమో! ఈ కరువు పోవడానికి నీరు తెచ్చారంటే, అనంతపురం సస్యశ్యామలం కావాలి, కడప సస్యశ్యామలం కావాలి.

పేజి 39, పేరా నెం. 130 నుంచి 135 వరకూ, త్రాగునీటికోసం రూ.881 కోట్లు కేటాయించారు. బోర్లన్నీ ఎండిపోయాయి. ఏదో కొన్నిచోట్ల అవి పనిచేస్తున్నాయి. బోరు, మోటరు ఇచ్చి, దానికి విద్యుత్ సరఫరా ఇవ్వాలి. కనీసం రూ.5 లక్షలు ఖర్చవుతుంది. మీరు ఎన్ని బోర్లు వెయ్యగలరు? ఓవర్‌హెడ్ ట్యాంకులు ఎన్ని కట్టిస్తారు? 50 శాతం ఓవర్ హెడ్ ట్యాంకులు పనిచేయడంలేదు.

గత సంవత్సరం గవర్నరుగారి ప్రసంగంలో "ఎన్.టి.ఆర్.సుజల స్రవంతి పథకం" అని ఒక మంచినీటి పథకాన్ని ప్రవేశపెట్టారు. రాష్ట్రప్రభుత్వం నుంచి ఒక్కపైసా ఖర్చులేదు. ఎవరో దాత డబ్బును ఇచ్చి పెట్టిస్తారు. రూ. 2 లు చొప్పున 20 లీటర్ల టిన్ ఇస్తారు. ఆ సీసాపై ఒకప్రక్క ఎన్.టి.ఆర్. బొమ్మ మరొకప్రక్క చంద్రబాబునాయుడుగారి బొమ్మ ఉంది. డబ్బు ఇచ్చినవారి పేరు దానిపై ఎక్కడా లేదు. దాత అని వారిపేరు దానిపై వేస్తే ఏమి పోతుంది? దాని నిర్వహణకు ఎంత ఖర్చవుతుంది? రోజుకు 3 బిందెలు చొప్పున నెలకు రూ. 500 ల కెమికల్స్ కావాలి. మైక్రో ఫిల్టర్లకు రూ. 500 లు ఖర్చవుతాయి. విద్యుత్ ఛార్జీలకు రూ. 2,500 లు ఖర్చవుతాయి. మొత్తం కలిస్తే, రూ. 5 వేలు ఖర్చవుతుంది. రూ. 6 వేలు చేతికి వస్తాయి. ఏ దాత అయితే ఇస్తున్నారో వారే నిర్వహించే విధంగా తమరు చేయాలని నేను కోరుతున్నాను. మంచినీరు రూ. 2 లకే ఇస్తే చాలా మంచిపేరు వస్తుంది.

రూ.881 కోట్ల బడ్జెట్‌లో విద్యుత్ ఛార్జీల నిర్వహణకు సి.పి.డబ్ల్యు. పథకమని కేంద్రప్రభుత్వం ఇస్తున్నది. ఈ మొత్తంలో కేంద్రప్రభుత్వం నిధులు రూ.300 కోట్లు పోతే, రూ.500 కోట్లు ప్లాన్ లేదా నాన్‌ప్లాన్ బడ్జెట్‌లో ఈసంవత్సరం నీటి రవాణాకు కూడా నిధులు సరిపోవని, వీటికోసం నిధులు పెంచవలసిన అవసరముందని నేను తమరిద్వారా ప్రభుత్వానికి తెలియజేసుకుంటున్నాను.

సి.డి.పి. నిధుల విషయానికి వస్తే కొన్ని నిజాలు మాట్లాడుకోవాలి. 1956 వ సంవత్సరంలో కీ.శే. శ్రీ నీలం సంజీవరెడ్డిగారు శాసనసభలో ఒక బిల్లును పాస్‌చేసి శాసనపరిషత్తును కూడా ఏర్పాటుచేయాలని ప్రతిపాదించారు. తేది. 1.7.1958 న అది అమలులోకి వచ్చింది. అనేక కారణాల వల్ల 1958 వ సంవత్సరంలో పుట్టి 1985వ సంవత్సరంలో అది చచ్చిపోయింది. అంటే, స్వర్గీయ శ్రీ నీలం సంజీవరెడ్డిగారు శాసనపరిషత్తును పుట్టిస్తే, స్వర్గీయ శ్రీ ఎన్.టి.రామారావుగారు దానిని చంపేశారు. కారణాలు నాకు తెలియదు. రాజకీయ కారణాలని నాకు తెలిసింది. The first State Council which is abolished in federal India ఈ సభ ఒక్కటే. అది కూడా నేను అంతర్జాలంలో చూస్తే నాకు తెలిసింది. 2007 వ సంవత్సరంలో మళ్లీ శాసనపరిషత్తు వచ్చింది. ఆనాటి నుంచి నేను శాసనపరిషత్తు సభ్యునిగానే ఉన్నాను. శ్రీ చంద్రబాబునాయుడు గారు సి.డి.పి. నిధులను ఇచ్చి శాసనసభ్యులకు రూ. 50 లక్షల చొప్పున ఇచ్చారు. మొట్టమొదటిసారి శ్రీ రోశయ్యగారు ముఖ్యమంత్రిగా వచ్చిన తర్వాత నేను జన్మతః నేను లెక్కల మనిషిని అని చెప్పుకున్న ఆయన రూ. 1 కోటి చొప్పున ఉభయ సభలకు చెందిన సభ్యులందరికీ ఇచ్చారు. మనమంతా అవసరం ఉన్న చోట వాటిని ఖర్చు చేయడం జరిగింది. నేను కూడా రూ. 1.50 కోట్లు

నియోజకవర్గ అభివృద్ధికి ఖర్చుచేశాను. 2013-14 వ సంవత్సరంలో సి.డి.పి. నిధులు ఎవరికీ ఇవ్వలేదు. మీకెవరికీ ఒత్తిడి రాలేదా? నియోజకవర్గంలో పనులు చేయించినా బిల్లులు రాలేదు, ముఖ్యమంత్రిగారితో మాట్లాడి నిధులు ఇప్పించాలని మాకు ఒత్తిళ్లు వస్తున్నాయి. నియోజకవర్గ అభివృద్ధి నిధులకే అటువంటి పరిస్థితి వస్తే, మిగిలిన నిధులు ఏమి వస్తాయి?

చేనేత మరియు జౌళి శాఖకు పేజి నెం. 27, పేరా నెం. 80 నుంచి 84 లో రూ.46 కోట్లు కేటాయించారు. వ్యవసాయశాఖ తర్వాత ఎక్కువమంది కార్మికులు ఆధారపడిన శాఖ చేనేత మరియు జౌళిశాఖ. వ్యవసాయరంగానికి రూ.14 వేల కోట్లు కేటాయించి మంచిపని చేశారు. కనీసం చేనేత మరియు జౌళి శాఖకు రూ.4 వేల కోట్లు ఇస్తారని అనుకున్నాను. రూ.46 కోట్లు ఇచ్చి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమంతా గుడ్డలు ఇమ్మని చెబితే ఎలా ఇస్తారు? వారి పరిస్థితి ఏమవుతుంది? కాబట్టి కోటయ్య కమిటీ రూ.169 కోట్లకు రికమెండ్ చేసింది. దాదాపు 7,748 సొసైటీలకు 20,747 మంది సభ్యులకు మేమిస్తామని అంటున్నారు.

మ. 1.20

దానిని ఎప్పటిలోగా ఇస్తారు? ఈ సంవత్సరం ఏప్రియల్ లోగా ఇస్తారా, 2017 ఏప్రియల్‌లోనా లేదా 2019 ఏప్రియల్ లోగా ఇస్తారా అనేది చెప్పి ఉంటే వాళ్లు కూడా ఆనందపడేవాళ్లు. ఎవరినీ మీరు అనందపరచలేకపోతిరి. వికలాంగుల విషయానికి వస్తే, రూ.45 కోట్లు కేటాయించారు. వాళ్లంటే మాకు చాలా ఇష్టమని ప్రభుత్వం వారు అంటారు. మేము కాదనము.

అధ్యక్షా, తిరుపతిలో శ్రవణం ప్రాజెక్టు ఉన్నది. ఇది చాలా ముఖ్యమైన అంశము. మాట్లాడడానికి కొంచెం సమయం ఇవ్వండి. పుట్టిన బిడ్డలో చలనం లేకపోతే, మాట్లాడలేకపోతే శ్రవణంకు తీసుకువస్తారు. 0–5 సంవత్సరాలలోపు పిల్లలు పుట్టుకతో మూగ అయినటువంటి పిల్లలకు మాటలు నేర్పించి జన జీవన స్రవంతిలోకి తీసుకువస్తున్నారు. మూగ అనేవాళ్లు లేకుండా చేస్తారు. దానికన్నా, ఆ సంస్థను ప్రతి ఒక్క మెటర్నిటీ ఆసుపత్రికి అటాచ్ చేయగలిగితే, ఆంధ్రప్రదేశ్‌లో మూగ, చెవుడు ఉండరని నేను ప్రభుత్వం దృష్టికి తీసుకువస్తున్నాను. శ్రవణం ప్రాజెక్టుకు ఆంధ్రప్రదేశ్‌లోని మెటర్నిటీ ఆసుపత్రులకు అనుసంధానం చేసి ముందుకు వెళ్లవలసిన అవసరం ఉన్నదని నేను మనవి చేస్తున్నాను. అలాగే, బర్డ్ ఆసుపత్రి కూడా 5 సంవత్సరాలలోపు బిడ్డలకు మూడవ నెల నుండి 5 సంవత్సరాల లోపు ట్రీట్‌మెంట్ ఇస్తే కుంటివాళ్లు లేనటువంటి రాష్ట్రం ఏర్పడుతుంది. ఒక ముస్లిం వ్యక్తి కదిరి నుండి వచ్చి నేను నా అల్లాను, వెంకటేశ్వర స్వామిని నా బిడ్డకు నోరు రావాలని మొక్కుకున్నాను. అల్లా చేయలేదు, వెంకటేశ్వర స్వామి చేయలేదు, ఈ శ్రవణం నాకు మేలు చేసింది. నా బిడ్డకు మాటలు వచ్చాయి. రెండు చేతులు ఎత్తి దణ్ణం పెడుతున్నానని చెప్పాడు. అటువంటి సంస్థలను ఎంకరేజ్ చేయాలని మనవి చేస్తున్నాను.

రాష్ట్ర రాజధానిని తీసుకువస్తున్నామన్నారు. అందుకు రూ.3,168కోట్లు ప్రతిపాదించారు. కేంద్రప్రభుత్వం రీ ఆర్గనైజేషన్ బిల్లులోనే కాపిటల్ కోసం స్థలాన్ని, నిధులను మేమే ఇస్తామని అన్నారు. రక్తాన్ని చెమట రూపంలో ఖర్చు పెట్టి పన్నులు కట్టిన డబ్బును తీసుకుపోయి అందాల హరివిల్లును కట్టుకోవడం భావ్యం కాదు. రాజధాని భవనాలను కట్టుకోవడానికి ఈ డబ్బు వద్దు. బీదవాళ్ల సొత్తును బీదరికానికి ఖర్చు పెట్టండి. మిత్రపక్షం కాబట్టి, కేంద్రప్రభుత్వంతో పోరాడండి. కేంద్రం ఇచ్చిన నిధులతో ఎన్ని అంతస్తులైనా కట్టండి. రాష్ట్రాన్ని అభివృద్ధి చేయండి. రాజధానిని కట్టండి. అంతేకానీ, ఈ విధంగా బీదల సొత్తుతో బీదల పన్నులతో అందాల హరివిల్లులు కడతారా? భూమి ఇస్తాము, డబ్బులు ఇస్తాము, నిర్మాణాలు మీరు చేపట్టండి అని రీ ఆర్గనైజేషన్ బిల్లులో ఉంది కదా! ఇప్పుడు అదీ లేకుండా పోయింది. రాష్ట్ర ప్రభుత్వం నుండి డబ్బులు పెడతారా? బీదల సొత్తును అక్కడకు తీసుకుపోయి పెడతారా? కేంద్రం నుండి నిధులు తీసుకురాకుండా ఇక్కడ నుండి నిధులు తీసుకుపోతారా? ఇది తప్పు. కేంద్రం నుండి

నిధులు రాబట్టండి. అవసరమైతే మా అందరి సహకారం తీసుకోండి. మేము ఈ ప్రభుత్వం వెనక ఉంటాము కానీ, ఈ రాష్ట్ర బడ్జెట్‌ను అక్కడ పెట్టే ప్రయత్నం చేయవద్దని నేను మనవి చేస్తున్నాను.

సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య గారు అమెరికాకు బ్రిడ్జ్‌ని డిజైన్ చేసిన వ్యక్తి. ఆయనను మరచిపోయాము. ఎల్ అండ్ టి వారు చాలా స్పీడ్‌గా కడతారు.  జివిఎమ్‌ఆర్ వాళ్లు కట్టిస్తున్నారు. వారందరినీ పక్కన పెట్టి సింగపూర్, మలేషియా, థాయ్‌లాండ్, జపాన్ అంటే ఎలా? చివరిగా ఒక్కమాట చెప్పదల్చుకున్నాను. గతంలో బ్రెయిన్ డ్రెయిన్ జరిగింది. మేధావులు  అంతా వెళ్లిపోయారు. అమెరికాలో 3:1 రేషియోలో మనవాళ్లున్నారు. చైనా, జపాన్, సింగపూర్‌లలో ఉన్నారు. ఇప్పుడు వెల్త్ డ్రెయిన్ జరగబోతోంది. ఇతర దేశాలనుండి డబ్బులు తీసుకువచ్చి ఇక్కడ పెట్టుబడులు పెట్టాలనే ప్రయత్నం చేస్తున్నారు. స్విస్ బ్యాంకులో ఉన్నటువంటి డబ్బును వంద రోజులలోపు తీసుకువస్తామని అన్నారు. మేము వద్దని అనము. కొంచెం తెలివి ఉపయోగిస్తే స్విస్ బ్యాంకులో డబ్బు ఈ దేశానికే వచ్చేది. ఎంత సొమ్ము స్విస్ బ్యాంకులో ఉన్నా మా దేశంలో, మా రాష్ట్రంలో పెట్టండి, దానిని వైట్ చేస్తాము, దానిని నిర్మాణం పనుల కోసం తీసుకోండి. దానికి వెల్త్ టాక్స్‌లో ఒక శాతం అదనంగా కట్టమంటే సరిపోతుంది. మనం, జపాన్ లకు పోయి డ్రమ్ములు వాయించాల్సిన పని లేదు. చైనాకు పోయి చీపురు పట్టవలసిన పని లేదు. స్వతంత్ర్యం వచ్చినప్పుడు మన దేశంలో 27 విదేశీ కంపెనీలు ఉన్నాయి. 27 కంపెనీలలో ఒక్క ఈస్ట్ ఇండియా కంపెనీని రద్దు చేశారు గానీ, మిగతా 26 కంపెనీలు ఈ దేశంలోనే ఉన్నాయి. ఈ రోజు మనం త్రాగుతున్న బ్రూ కాఫీ ఇతర దేశానిది. లిప్టన్ టీ, షేవింగ్ బ్లేడ్ ఇతర దేశాలవి. ఇతర దేశాలకు ఎంలో సొమ్ము పోతున్నది. ఇది వెల్త్ డ్రెయిన్.  ఇతర దేశాలకు మన దేశపు సొమ్ము పోతున్నది. పరోక్షంగా మరో బానిస దేశంగా మనం తయారు కాబోతున్నాము. ఇది మంచిది కాదు.  ఆ రోజు పండిట్ నెహ్రూ గారు తీసుకున్న నిర్ణయాల ఫలితంగా హైదరాబాదులో ఉన్నటువంటి ఐడిపిఎల్, బిహెచ్ఇఎల్ వంటివి వచ్చాయి. ఇవన్నీ వారి పుణ్యంతో వచ్చాయి. కానీ, ఇప్పుడు ఇతర దేశాలకు వెళ్లి వారు ఇచ్చిన నిధులు తీసుకుంటున్నారు. ఇతర దేశాలను పెట్టుబడులు పెట్టమని పరిగెడుతున్నారు. ఈ రాష్ట్ర భవిష్యత్తుకు ఇది మంచిది కాదని నేను తెలియచేసుకుంటూ మీరు నాకు  ఈ అవకాశం కల్పించినందుకు, నాకు రెండు గంటలు టైం ఇవ్వాల్సింది గంటన్నర గంటకే గొంతు కోసినందుకు ధన్యవాదాలు తెలుపుతూ సెలవు తీసుకుంటున్నాను.

MR. CHAIR PERSON :  Now, the House is adjourned to meet again on 17th March, 2015 at 10.00 a.m.

(The House, then adjourned at 1.27 p.m. to meet again at 10.00 a.m. on Tuesday the 17th March, 2015).

* * *